ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 289 పేజీలు: 12 వెల: 6.50

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్ 45
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

# సత్యసాయి సేవలు జాతికి స్ఫూర్తి

• ఆయన బోధించారు.. ఆచరించారు • భుజ్ భూకంప సమయంలో సాయి అందించిన సేవలు మరువలేం • మానవ సేవే మాధవ సేవకు దర్పణం సాయి • సాయి శతజయంతి వేడుకల్లో ప్రధాని మోడీ • రూ. 100 స్మారక నాణెం, స్టాంపులు విడుదల చేసిన ప్రధాని • పేదలకు 100 గిర్ జాతి గోవులు అందజేత

**పుట్టపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** సేవ పరమో ధర్మః అనేది మన మూల జీవన విధానంలోనే ఉందని... లవ్ ఆల్ సర్వ్ ఆల్ అని భగవాన సత్యసాయి బాబా బోధించారని... బోధించడమే కాకుండా తాను ఆచరించడంతో పాటు ఆయన సంస్థలూ అదే పాటించేలా సత్యసాయి బాబా అందరిలోనూ స్ఫూర్తి నింపారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సత్యసాయి బాబా 100వ జయంత్యుత్సవాలకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు హాజరయ్యారు. వీరితోపాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, కిషన్ రెడ్డి, మంత్రి నారా లోకేష్ సహా పయ్యావుల, సవిత, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ రూ.100 స్మారక నాణేన్ని విడుదల చేశారు. సత్యసాయి స్మారక తపాళా బిళ్లల్ని ప్రధాని, సిఎం ఆవిష్కరించారు. మొదట సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి చేరుకున్న ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్వాగతం పలికారు. ఆ తర్వాత కుశ్వంత్ >>2



బుధవారం పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో ప్రధాని మోడీకి జ్ఞాపికను బహూకరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సచిన్ టెండూల్కర్, రత్నాకర్ తదితరులు

## బంగారూ... అంటూ పిలిచే సాయి -ముఖ్యమంత్రి

**పుట్టపర్తి, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** "బంగారూ' అంటూ ఆయన పిలిచే పిలుపు ఎప్పటికీ గుర్తుంటుంది. బాబాతో నాకు ఎన్నో అనుభవాలు ఉన్నాయని సిఎం చంద్రబాబు అన్నారు. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. విలువలతో కూడిన విద్యను 1వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకూ ఉచితంగా అందించారు. 102 సత్యసాయి విద్యాలయాలు.. 60,000 మందికి ఉత్తమ విద్యను అందిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆస్పత్రులు, మొబైల్ ఆస్పత్రుల ద్వారా రోజూ రోగులకు సేవలందుతున్నాయి. రాయల సీమ ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రశాంతి నిలయాన్ని తాకట్టుపెట్టి అయినా ప్రాజెక్టును పూర్తి చేయాలను >>2

## ప్రేమ, శాంతి బాట చూపిన సాయి: సిఎం చంద్రబాబు

**పుట్టపర్తి, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** నాస్తికులను సైతం ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన సత్యసాయి సమ్మోహన శక్తి ప్రపంచంలో అరుదైనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి బాబా మనకాలంలో ప్రత్యక్ష దైవ స్వరూపంగా ప్రజలకు ప్రేమ, సేవ, శాంతి, సౌభాగ్యం మార్గాన్ని చూపించిన మహానుభావుడని కొనియాడారు. "అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు" (లవ్ ఆల్ సర్వ్ ఆల్), అందరికీ సహాయం అందించు... ఎవ్వరినీ బాధించకు (హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్) అనే బాబా మహావాక్యాలు ఈ ప్రపంచానికి విశ్వ శాంతి, సర్వజన సుఖాయ అనే ఆయన సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఈ పుణ్యభూమి పుట్టపర్తిలో నేడు జరుగుతున్న భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా ప్రకటించడం ఎంతో గౌరవంగా >>2

# అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు

నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అంశాలపై ఫోకస్

మొంథా తుఫాన్ బాధిత రైతులకు త్వరలో రూ.390 కోట్లు ఇస్తాం

రెండో విడత అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన సిఎం చంద్రబాబు



బుధవారం పెండ్లిమర్రిలో రైతులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**పెండ్లిమర్రి, నవంబరు 19 ప్రభాతవార్త:** వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు... అన్నదాతకు అండగా నిలిచేందుకు.. పంచసూత్ర ప్రణాళికతో వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు ఐటీ నిపుణులకు ఎంత మంచి పేరు ఉందో.. ఎపి రైతులు కూడా ప్రపంచ వ్యాప్తంగా అదే స్థాయిలో గుర్తింపు రావాలని సిఎం చంద్రబాబు చెప్పారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. రెండో విడత చెల్లింపుల్లో భాగంగా రూ.7 వేల చొప్పున 46,85,838 మంది రైతుల ఖాతాలకు రూ.3,135 కోట్లను జమ చేశారు. రచ్చబండలో పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాలు అవలంభించాలి. సాగులో టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. మనది రైతు ప్రభుత్వం. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా తొలి విడతలో రూ.3,175 వేల కోట్ల సొమ్మును ఈ ఏడాది ఆగస్టులో జమ చేశాం. రెండు విడతలు కలిపి మొత్తం రూ.6,310 కోట్లు అన్నదాతకు అందించాం. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం నిధులు జమ చేయడం రైతు సంక్షేమంపై ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**పంచ సూత్రాల అమలుతో రైతే రాజు**

"నీరు సమృద్ధిగా ఉన్నచోటే అభివృద్ధి జరిగింది. రాయలసీమ వాసుల కష్టాలు నేను కళ్లారా చూశాను. కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేసి ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నదే నా సంకల్పం. భూగర్భ జలాలు పెంచాలి. ఒకప్పుడు సీమలో 100 అడుగుల కింద నీరు ఉండేది. ఇప్పుడు 7.3 మీటర్లకే నీరు వస్తోందంటే మన దూరదృష్టి వల్లే సాధ్యమైంది. ఆనాడు నా నియోజకవర్గం కుప్పంలో ఇజ్రాయిల్ టెక్నాలజీ తీసుకొచ్చి మైక్రో ఇరిగేషన్‌కు వెళ్లాం. భూగర్భ జలాలు పెరిగితే పర్యావరణం కూడా బాగుంటుంది. రాష్ట్రంలో నీటిభద్రత కల్పించేందుకు నిరంతరం పని చేస్తున్నాం. పట్టిసీమ పూర్తిచేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. సముద్రంలోకి వృథాగా పోయే వరద నీటిని >>2

# మరో భారీ ఎన్‌కౌంటర్

• కీలక నేత టెక్ శంకర్ హతం • మరో ఆరుగురు కూడా మృతి • కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఎన్‌కౌంటర్‌లో మరణించలేదన్న అధికారులు

**విజయవాడ/పాడేరు, నవంబరు 19,పభాతవార్త ప్రతినిధి:** మావోయిస్ట్‌లకు వరుస ఎదురుదెబ్బలు జరుగుతున్నాయి.మావోయిస్టు కదలికలపై ఎపి పోలీసు తీక్షణ దృష్టిపెట్టింది. కేవలం 24గంటల వ్యవధిలో ఆపార్టీ కీలక నేతల్లో ఒకరైన టెక్‌శంకర్ ఎదురు కాల్పుల్లో హతమయ్యారు.ఈ విషయాన్ని డిజిపి హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేసారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఈరోజు ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారం నిజం కాదు. మారేడిమిల్లిలో నిన్నజరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుపార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఐదుగురు హతమయ్యారు. బుధవారం ఏవోబీలో కాల్పులు కొనసాగుతున్నాయన్నారు. మారేడిమిల్లిలో ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. సౌత్ జోనల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఇన్చార్జి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని డిజిపి వివరించారు.పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొటెక్షన్ టీం కమాండర్, డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కమ్యూనికేషన్ టీం ఛీఫ్, సౌత్ జోనల్ కమిటీ మెంబర్ సురేష్ అలియాస్ రమేష్, ఏరియా కమిటీ సభ్యులు జాగరగొండ ఏరియా మిలిషియా కమాండర్ లోకేష్ అలియాస్ గణేష్ కూడా హతమయ్యారు. వీరితోపాటు జాగరగొండ డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు శ్రీను అలియాస్ వాసు.. జాగరగొండ డివిజినల్ కమిటీ, ఏరియా కమిటీ సభ్యురాలు అనిత, ఇదే కమిటీలో సభ్యురాలు షమ్మి ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మొత్తం ఏడుగురు మావోయిస్టులు మరణించినట్టు అధికారులు ధృవీకరించారు. మావోయిస్టు జాడలున్న ఏ ప్రాంతాన్ని వదిలేది లేదని, అన్ని చోట్ల జల్లెడపడుతున్నామన్నారు.విజయవాడ సహా రాష్ట్రంలో నిన్న అదుపులోకి తీసుకున్న వారిలో 50మందిని కోర్టుకు రిమాండ్ నిమిత్తం



బుధవారం మావోయిస్టుల నుంచి పట్టుబడిన ఆయుధాలను చూపిస్తున్న ఎడిజి లడ్డా

హాజరు పరుస్తామని తెలిపారు.ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో భద్రతా బలగాలు బుధవారం కూడా భారీ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఈరోజు ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారాన్ని పోలీసులు ఖండించారు. విజయవాడను మావోయిస్తుటు షెల్టర్‌జోన్‌గా చేసుకోవడం,పెద్ద సంఖ్యలో ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తలదాచుకోవడం కలకలం సృష్టించింది. ఎవరి దృష్టి ఉండదని ఆటోనగర్‌లో 27మంది ఒకేభవనంలో ఆయుధాలతో ఉన్నారు. విజయవాడలోని >>2



## ఆస్తుల కేసులో నేడు సిబిఐ కోర్టుకు జగన్

ఆరేళ్ల తర్వాత వ్యక్తిగతంగా కోర్టు ముందుకు

**విజయవాడ, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్థుల కేసులో హైదరాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక కోర్టుకు గురువారం హాజరు కానున్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని జగన్ కోరగా సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈకేసుల్లో డిశ్చార్జి పిటీషన్‌లపై రోజు వారీ విచారణ జరుగుతున్నందున ఆయన ప్రత్యక్షంగా హాజరుకావాలని సిబిఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒక రోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. గత నెల >>2

హిడ్మాను పట్టుకుని, చంపలేదు ఎన్‌కౌంటర్‌లోనే హతమయ్యాడు: లడ్డా 2లో

# పరకామణి చోరీపై త్వరలో మరో కేసు



కుట్రదారులను తేల్చేందుకు బోర్డు కీలక నిర్ణయం

రవికుమార్ కాల్ డేటాయే ప్రధానం

కీలక మలుపు తిరిగిన దర్యాప్తు

**తిరుపతి,నవంబరు 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణి చోరీ ఘటనపై మళ్లీ కొత్తగా కేసు నమోదు చేయాలని టిటిడి బోర్డు నిర్ణయించడం సంచలనాలు రేకెత్తించనుందా అనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కేసులో రానున్న రోజుల్లో ఎవరూ ఊహించలేని విధంగా దర్యాప్తు జరిగితే అసలు దోషులు ఎవరనేది వెలుగుచూస్తుందా? అసలు ఏ కోణంలో ఎవరు లబ్ధిపొందారనేది తేల్చాలనేది టిటిడి బోర్డు ముందున్న కీలక విషయం. ఇప్పటికే ఈ కేసులో ఫిర్యాదిదారుడు, కీలక వ్యక్తి పూర్వ పరకామణి ఏవిఎస్‌ఒ వైవి సతీశ్‌కుమార్ ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అయితే కీలక ఫిర్యాది మరణించడంతో కేసు మూసివేయకుండా ఇప్పుడు కొత్తగా తిరుమల పోలీసులకు క్రిమినల్ కేసుగా ఫిర్యాదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని భావిస్తున్నారు.

ఏకంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడుల రూపంలో కానుకలుగా సమర్పించుకున్న నగదునే చోరీచేయడం వెనుక అసలు ఎవరున్నారనేది తేల్చి భక్తుల ముందు, చట్టం ముందు బహిరంగం చేయాలనేది బోర్డు నిర్ణయంగా తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో తిరుమల పరకామణిలో జరిగిన 920 అమెరికన్ డాలర్లు చోరీలో అప్పట్లో నమోదైన కేసు పరిధి పరిమితంగానే ఉందనే కోణంలో అదేఉదంతంపై మరోకేసు నమోదుకు టిటిడి బోర్డు నిర్ణయించింది. మరిన్ని చోరీలు, దుర్వినియోగాల దృష్ట్యా క్రిమినల్ కేసు నమోదు దిశగా ఆలోచన చేసి అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. 2023లో పరకామణి భవనంలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేసి రవికుమార్ అనే వ్యక్తి పట్టుబడటం, అదేరోజు నిఘాభద్రత పర్యవేక్షిస్తున్న ఏవిఎస్‌ఒ వైవి సతీశ్‌కుమార్ అతనిని పట్టుకోవడం జరిగింది. తదుపరి దానిపై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సమగ్రంగా విచారణ చేపట్టి నిందితుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సిన కొందరు పోలీస్ అధికారులు, టిటిడి గత బోర్డు పెద్దలు, టిటిడి >>2



## చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు

లిక్కర్ కేసులో ప్రభుత్వం సంచలన ఆదేశం

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్సార్సీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేసిన సిఫార్సులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చెవిరెడ్డి, ఆయన కుమారులు, బంధువుల పేరిట ఉన్న ఆస్తులపై చర్యలు రూ. 54.87 కోట్ల నల్లధనం లావాదేవీలు జరిపినట్టు సిట్ గుర్తించింది. సిట్ సమాచారాన్ని అనుసరించి తిరుపతి, నెల్లూరు, >>2

# ధాన్యం నగదు జమ 24 గంటల్లోనే..

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి బస్తా కొనుగోలు చేస్తాం: మంత్రి నాదెండ్ల



బుధవారం గండిగుంట-2 రైతు సేవా కేంద్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

**ఉయ్యూరు, నవంబరు 19, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి బస్తా కొనుగోలు చేస్తామని, ఎలాంటి దిగులు అవసరం లేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం ఆయన ఉయ్యూరు మండలంలో పర్యటించారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, ఎండి ఎస్ డిల్లీరావు, జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడె ప్రసాద్ తదితరులతో కలిసి మండలంలోని గండిగుంట-2 రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ధాన్యం కొనుగోలు సాంకేతిక సిబ్బందితో మాట్లాడి అందుబాటులో ఉన్న గోనె సంచులు, రవాణా వాహనాలు, ఇప్పటివరకుసేకరించిన ధాన్యంవివరాలను మంత్రి తెలుసుకున్నారు. ఈ క్రమంలో >>2

మద్యం కుంభకోణం కేసు నిందితులకు హైకోర్టులో ఎదురు దెబ్బ 2లో


బుధవారం సత్యసాయిబాబా మహాసమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ


ప్రశాంతి నిలయంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌తో ప్రధాని మోడీ


వేడుకలలో డ్రమ్స్ వాయిస్తున్న ప్రముఖ కళాకారుడు శివమణి

# సత్యసాయి సేవలు జాతికి స్ఫూర్తి

>> హాల్లో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ... "సత్యసాయి బాబా మన మధ్య భౌతికంగా లేనప్పటికీ ఆయన స్థాపించిన సంస్థలు గ్రామీణ అభివృద్ధి, ప్రజలకు వైద్యం లాంటి సేవల్ని అందిస్తున్నారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు జరుపుకోవటం మనకు ఓ వరం. బాబా పాటించిన ప్రేమ, సేవ భావన ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తోంది. బాబా జీవితమే వసుధైక కుటుంబం అనే భావనతో ఉండేది. మన భారతీయుల జీవన విధానమే సేవ, భక్తి, జ్ఞానం. కోట్ల మంది బాబా భక్తులు దేశవ్యాప్తంగా మానవ సేవే మాధవ సేవ అని భావించి సేవలు అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి వైపరీత్యం వచ్చినా సత్యసాయి సేవా దళ్ సభ్యులు ప్రజలకు సేవలందిస్తున్నారు. భుజ్ భూకంపం సమయంలో సేవాదళ్ చేసిన సేవలు నాకు బాగా గుర్తున్నాయి. 3 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపుల్ని ఏర్పాటు చేసి ప్రజలకు దాహార్తి తీర్చారు. వైద్యం ఉచితంగా అందిస్తున్న సంస్థలను బాబా నిర్మించారు. సుకన్య సమృద్ధి యోజన కోసం వేల మంది బాలికలకు ఆర్థిక సాయం అందిస్తోంది ట్రస్టు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 4 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ఉన్నాయి. రూ.3.25 లక్షల కోట్లకు పైగా నిధులు ఈ ఖాతాల్లో ఉన్నాయి. వారణాసి ఎంపిగా అక్కడ 27 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కింద నిధులు జమ చేయించాను. సోషల్ సెక్యూరిటీ కవరేజ్ కోసం దేశంలో చాలా పథకాలను ప్రారంభించాం. వీటిపై విదేశాల్లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సత్యసాయి ట్రస్టు తరపున వంద గిర్ జాతి గోవులను పేదవారికి నా చేతుల మీదుగా అందించటం సంతోషంగా ఉంది. పేద ప్రజల జీవితాలు ఈ గోవుల ద్వారా పెను మార్పు వస్తుంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా వారణాసిలో 480కి పైగా గిర్ జాతి ఆవులను పేదవారికి అందించాం. ఇప్పుడు వెయ్యికి పైగా గిర్ ఆవులు ఆ ప్రాంతంలో తయారు అయ్యాయి. రువాండాలో 200కు పైగా గిర్ ఆవులు ఉన్నాయి. గోవుల దానం లాంటి సంప్రదాయం అక్కడ కూడా ఉంది. గోసంపద ద్వారా పాల ఉత్పత్తి, పోషకాహారం, సోషల్ ఇమ్యూనిటీ లాంటివి పెరుగుతాయి. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తోంది. ఇందులో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. వోకల్ ఫర్ లోకల్ అనే మంత్రాన్ని అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తే ఆత్మనిర్భర్ భారత్ తయారైనట్టే. భగవాన్ సత్యసాయి ప్రేరణతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రతీ వ్యక్తి ఆలోచనలో కరుణ, శాంతి, కర్మ అనే విధానాల ద్వారా ముందుకు వెళ్లాలి" అని ప్రధాన మంత్రి సూచించారు.

# బాట చూపిన సాయి: సిఎం చంద్రబాబు

>> భావిస్తున్నామన్నారు. బాబా నమ్మింది ఒకటే – మానవ సేవే మాధవ సేవ. అదే ఆయన జీవితం, అదే ఆయన సందేశమని పేర్కొన్నారు. ప్రేమే ఏకైక మతం, హృదయమే ఏకైక భాష, మానవత్వమే ఏకైక కులం, విధి ఒకటే చట్టమని, సర్వవ్యాపకమైన దైవం ఒకటేనని బాబా చెప్పిన మాటలు ప్రపంచం నలుమూలలా కోట్లాది మందిని ప్రభావితం చేశాయన్నారు. వందలాది దేశాల నుంచి వచ్చిన భక్తులందరికీ ఆయన దివ్య అనుగ్రహం లభించిందని, పేద నుండి అగ్ర కులాల దాకా, సామాన్యుల నుండి ప్రపంచ నాయకులదాకా అందరి బాధలు వినడం, పరిష్కార మార్గం చూపడం ఆయన ధర్మమైందన్నారు. సత్యసాయి సంస్థల ద్వారా అందుతున్న సేవలు ప్రపంచంలో ఏ సంస్థలతో పోల్చిన ప్రత్యేకమై, విశిష్టమై అధ్వితీయంగా ఉంటాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ మహోత్సవానికి స్వయంగా హాజరై ఆశీస్సులు పొందడం, బాబాతో ఆయనకు ఉన్న ఆత్మీయ బంధాన్ని వెల్లడిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటి, పారిశ్రామిక శాఖ మంత్రి నారాలోకేష్, ప్రముఖ బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సూప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, , ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవిన్యూ శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఎంపి బికేపార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, సత్యసాయి యూనివర్శిటీ ఛాన్సలర్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు నాగనంద, నిమిష్ పాండ్య, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, కేరళ సంగీత విద్వాంసులు హరిహరన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత శివమణి, బిజెపి నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు, వేలాది మంది సాయి భక్తులు పాల్గొన్నారు.

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> ఆటోనగర్,కానూరు లోని కొత్త ఆటోనగర్‌లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఇక్కడ కర్మాగారాల్లో ఉత్తరాది నుంచి వేలమంది కార్మికులు వచ్చి పనిచేస్తుంటారు. ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా లేకపోవడం,గస్తీ లోపించడం అరాచక శక్తులకు మరింత ఊతమిస్తోంది. మావోయిస్టుల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచే ఎస్ఐబీ(స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో) కార్యాలయానికి సమీపంలోనే మావోయిస్టులు షెల్టర్ పొందిన భవనం ఉంది. ఈ కార్యాలయానికి 3.5కి.మీ దూరంలోనే మావోయిస్టులు షెల్టర్ తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఇదేమార్గంలో మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయం కూడా ఉంది. సమీపంలోనే భారతీయ జనతా పార్టీ ఎంఎల్ఏ సుజనాచౌదరి నివాసం ఉంది. మచిలీపట్నంలోని ఎస్పీ బంగ్లాలో మరమ్మత్తులు జరుగుతుండటంతో ఈ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలోని ఓగేటెట్ కమ్యూనిటీలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తన బంధువుల ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు.ఈ క్రమంలో పకడ్బంది సమాచారంతో లభించడంతో మావోయిస్టు ఆశ్రిత ప్రాంతంపై దాడి జరిగిందంటున్నారు. ఇక డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పిన సమాచారాన్ని అనుసరించి అయిదు జిల్లాల్లోను,విజయవాడ,గుంటూరు నగరాల్లో కీలకం ఎన్టీఆర్, గుంటూరుజిల్లా నదితీర ప్రాంతాల్లో గాలింపు చర్యలు జరుగుతున్నాయి,.ఇక ఇదే క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికులను,ఇతర సంచార కార్మికులను పోలీసులు విచారిస్తున్న సమాచారం

**దేవ్‌జీ, అజాద్ లొంగిపోవాలి: ఇంటలిజెన్స్ ఎడిజి లడ్డా**

ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. వారిలో దేవ్ జీ, ఆజాద్‌తో సహా పలువురు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నారన్న ప్రచారం జరిగింది. అయితే చనిపోయిన వారిలో టెక్ శంకర్ ఒక్కరే కీలకమైన నేతల అని ఏపీ ఇంటలిజెన్స్ ఎడిజి లడ్డా ప్రకటించారు. నేటి ఎన్‌కౌంటర్‌లో హతమైన మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆయన సెక్యూరిటీ టీం అంతా పట్టుబడటంతో ఆయనను కూడా పట్టుకున్నారని.. ఎన్ కౌంటర్ చేస్తారని కొంత మంది ఆరపణలుచేశారు. అయితే ఈ ప్రచారాన్ని పోలీసులు ఖండించారు. మొత్తం నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఈ ఎన్కౌంటరులో చనిపోయారు. జోగారావు, జ్యోతితో పాటు సురేశ్, గణేష్, వాసు, అనిత, షమ్మిగా మిగిలిన వారిని గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

షెల్టర్ కోసం చత్తీస్ ఘడ్ నుంచి ఎపికి వస్తున్న మావోయిస్టులు లొంగిపోవాలని లడ్డా పిలుపునిచ్చారు. కృష్ణ, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టులు, వారి సహాయకులు అరెస్టయ్యారు. మాడ్వీ హిద్మాతో సన్నిహితంగా ముడిపడినవారే ఎక్కువగా అరెస్టయ్యారు. ఈ ఆపరేషన్లు ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా నిర్వహించామని, మావోయిస్టుల నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.వాటిని లడ్డా మీడియాకు ప్రదర్శించారు.

**అరెస్టయిన మావోయిస్టులకు రిమాండ్**

విజయవాడలో పట్టుబడిన మొత్తం 24 మంది మావోయిస్టులకు రిమాండ్ విధించారు. అనంతరం ఈ 24 మంది మావోయిస్టులను రాజమహేంద్రవరం లోని కర్మాగారానికి తరలించాలని అధికారులు ఆదేశాలను జారీ చేశారు. అంతేకాకుండా మరో నలుగురు మావోయిస్టుల వయసు నిర్ధరించాలని కోర్టు ఆదేశించింది.

## సిబిఐ కోర్టుకు జగన్

>> ఆయన కోర్టు అనుమతితో ఐరోపా పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన ముగియగానే ప్రత్యక్షంగా హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ ఆయన కోర్టుకు వెళ్ళకుండా, వ్యక్తిగతంగా హాజరు మినహాయింపు కోరారు. సిబిఐ అభ్యంతరం చెప్పడంతో ఇప్పుడు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అక్రమాస్థుల కేసులో 2013 సెప్టెంబరునుంచి జగన్ బెయిలుపై ఉన్నారు.

## ఆగ్నేయ బంగాళాఖాతంలో 22న అల్పపీడనం

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశంఉందని, అనంతరం అది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అదే విధంగా కొమోరిన్ పరిసర ప్రాంతాలపై మంగళవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం ఉదయానికి లక్షద్వీప్ దీవులకు సరిహద్దు, మాల్దీవుల ప్రాంతాలకు విస్తరించిందని తెలిపింది.

# హిడ్మాను పట్టుకుని, చంపలేదు

## ఎన్‌కౌంటర్‌లోనే హతమయ్యాడు: లడ్డా

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్త:** చత్తీస్‌ఘడ్ నుంచి ఎపికి రావాలని మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టామని, నవంబరు 17న చేపట్టిన కీలక ఆపరేషన్ చేపట్టామని,నిన్న మారేడుమల్లిలో హిడ్మా మరో ఐదుగురు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారని ఎపి అడిషనల్ డిజి మహేష్ చంద్ర లడ్డా పేర్కొన్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమీషరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిడ్మాను పట్టుకుని అనంతరం చంపామనే ప్రచారంలో నిజం లేదన్నారు.మంగళవారం ఎపి లోని నాలుగు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్న 50 మంది పీఎల్‌ఏ సభ్యుల అరెస్ట్ విషయం గురించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచారం మేరకు ఎక్కడెక్కడ మావోయిస్టులు ఉన్నారనే దానిపై దృష్టి పెట్టామని,ఎన్టీఆర్,కృష్ణా,కాకినాడ,కోనసీమ,ఏలూరు జిల్లాల నుంచి యాభై మంది మావోయిస్టులను పట్టుకున్నామన్నారు. ఎక్కడా ఎవ్వరికీ ప్రమాదం జరగకుండా ఆపరేషన్‌ను పూర్తి చేశామన్నారు.వీరి నుండి 45 ఆయుధాలు,272 రౌండ్లు,రెండు మ్యాగ్‌జైన్‌లు,750 గ్రాముల వైర్,నాలుగు కత్తులు,నగదు రూ.12 లక్షల72వేలు,84 మెమరీ కార్డులు,రేడియో సెట్‌లు–1,ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.వీటితో పాటు రెండు కత్తులు తదితర మారణాయుధాలను కూడ పట్టుకున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత మంది కీలక వ్యక్తులను పట్టుకోవడం ఇదే ప్రథమమన్నారు. వీరిలో బీజాపూర్ జిల్లాకు చెందినవారు 28 మంది,సుకుమా ప్రాంతానికి సంబంధించి–21,నారాయణపూర్ ప్రాంతానికి సంబంధించి–1, ఉన్నారన్నారు. కేంద్ర,రాష్ట్ర ఏరియా కమిటీ సభ్యులు,ప్లాటూన్ టీంలను పట్టుకున్నామని పేర్కొన్నారు.

# అభివృద్ధికి పంచసూత్రాలు

>> రాయలసీమ వైపు మళ్లించి రిజర్వాయర్లు నింపాం. హంద్రీనీవా ద్వారా సీమకు నీరిచ్చాం. రాష్ట్రంలో 95 శాతం జలాశయాలు నిండాయి. చెప్పిన విధంగా నదుల అనుసంధానం చేసి చూపిస్తాం. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉండబట్టే రైతులకు మేలు జరుగుతోంది." అని సీఎం అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ఇందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలి. ప్రకృతి సేద్యం వైపు రైతులు మళ్లాలి. డిమాండ్ ఉన్న పంటలను పండించాలి. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోంది. ఇంకో 6 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం పరిధిలోకి తీసుకువస్తున్నాం. మొత్తంగా 18 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఒకప్పుడు దేశానికే అన్నం పెట్టిన పంజాబ్ లో ఎరువుల వాడకం విపరీతంగా పెరగడంతో ప్రజలు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం రసాయనిక రహిత పంటలకే విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. టెస్టింగ్, ట్రేసబులిటీ వంటి అంశాలనేవి ఇప్పుడు దేశ, విదేశాల్లో కీలకంగా మారాయి. అందుకే రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువుల వాడకం తగ్గించాలి." అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మద్యం కుంభకోణం కేసు నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ నవంబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ధనుంజయరెడ్డి,కృష్ణమోహన్‌రెడ్డి,బాలాజీ గోవిందప్పకు ఏసీబీ కోర్టు ఇచ్చిన డీఫాల్ట్ బెయిల్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. వీరి బెయిల్ రద్దుకు సీఐఈడి వేసిన పిటీషన్‌ను కోర్టు అనుమతించింది. ఈ నెల 26 లోపు జడ్జి ఎదుట ముగ్గురూ సరెండర్ కావాలని ఆదేశించింది. రెగ్యులర్ బెయిలు పిటీషన్‌లను ఎసిబి కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించింది. రెగ్యులర్ బెయిలు పిటీషన్లను విచారించాలని ఎసిబి కోర్టును హైకోర్టు ఆదేశించింది.

# ధాన్యం నగదు జమ 24 గంటల్లోనే..

>> గ్రామానికి చెందిన సతీష్ కుమార్ పొలంలో పండించిన ఎంటియు 1262 రకం ధాన్యం తేమ శాతాన్ని మంత్రి సమక్షంలో పరీక్షి ంచగా 15.9 శాతం వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం ఉండాలని, అంతకుమించి తేమశాతం ఉన్న ధాన్యాన్ని రైతుకు సమ్మతమైతే ఒక శాతానికి ఒక కేజీ చొప్పున మినహాయింపు చేస్తున్నట్లు వివరించారు. అక్కడికి చేరుకున్న రైతులతో మంత్రి ముఖాముఖి మాట్లాడి ధాన్యం సేకరణలో వారికున్న సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ పారదర్శకంగా చేపడుతూ రైతులకు అండగా ఉన్నామని అన్నారు. రైతు సేవ కేంద్రాల (ఆర్‌ఎస్కే) ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ మద్దతు ధర ఇచ్చి 24 గంటల్లోపే రైతు ఖాతాలకు నగదు జమ చేస్తున్న సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే నేటికి 2 వేల శాతంతో అధికంగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వాతావరణ మార్పులకు రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఆర్‌ఎస్కే ల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని మంత్రికోరారు. జిల్లాలో ఎక్కడాకూడా గోనె సంచుల కొరత, రవాణా వాహనాల ఇబ్బందులు లేకుండా గత సంవత్సరపు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.52 కోట్ల గోనె సంచులు ఆర్‌ఎస్కేల ద్వారా రైతుల కల్లాల వద్దకే చేరుస్తున్నామన్నారు. జిల్లాలో ఈ నెలాఖరుకల్లా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబరులో 7.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేయనున్నామని తెలిపారు.

జిల్లాలో 99 శాతం ఈ-పంట పూర్తి చేశామని, కౌలు రైతులకు గంటల వ్యవధిలోనే ధాన్యం కొనుగోలు నగదు జమ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వాతావరణ మార్పుల సమయంలో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటను సురక్షితంగా కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, వాటిద్వారా నిన్న మంగళవారం వరకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఆర్‌ఎస్కే లలో నాణ్యమైన గోనె సంచులు, రవాణా వాహనాలు సిద్ధంగాఉంచినట్లు తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు ఉన్నా ఆర్‌ఎస్కే లలోని సిబ్బందిని సంప్రదించి సహాయం పొందాలని రైతులకు సూచించారు. వరి కోత యంత్రం మళ్ళీ రాదనే ఆందోళనలో, పరిపక్వానికి రాని వరి పంటను ముందుగానే కోసి నష్టపోవద్దని, అవసరమైనప్పుడు వరి కోత యంత్రాన్ని పంపించి కోత కోయిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## వారం - వర్జ్యం

20-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
● అమావాస్య మ.12.16
విశాఖ ఉ.10.58, అనూరాధ కార్తె
వర్జ్యం : మ.3.28–5.15
దు.ఉ.10.01–10.46, మ.2.33–3.18
రాహుకాలం – మ.1.30–3.00

## వారఫలం

**మేషం:** శ్రేయోభిలాషుల ఒత్తిడికి తలవంచి ఇష్టం లేకపోయినా ఓ సందర్భంలో రాయభారం నిర్వహిస్తారు.దూరప్రాంతాల నుండిశుభవార్తలు.

**వృషభం:** మధ్యవర్తిత్వాలకు వివాదాస్పద అంశాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**మిథునం:** ఉద్యోగస్తులు సహోద్యోగుల సహాయ సహకారాలు అందుకుంటారు. బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కర్కాటకం:** ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు.ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది. మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు.

**సింహం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాదాలు తీరి ప్రశాంతత పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు అందిపుచ్చుకోవడంలో నైపుణ్యం చూపండి.సంతానం నాకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కలిగిన దానితో తృప్తి పడతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**వృశ్చికం:** ఆర్థిక ప్రణాళికలు నూతనమైన మలుపులు తిరుగుతాయి.కాంట్రాక్టులు అతికష్టం మీద దక్కించుకొంటారు.

**ధనుస్సు:** కొత్త పెట్టుబడులు అనుకూలమైన ఫలితాలను ఇస్తాయి. షేర్లు, భూముల క్రయ విక్రయా లలో లాభాలు పొందుతారు.

**మకరం:** కొద్దికాలం పరిచయమున్న మిత్రులు మీకు అండదండగా నిలుస్తారు.చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** సరికొత్త ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో మాత్రం కొంత వెనుకబడతారు.దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మీనం:** దరఖాస్తు పారములు పంపునప్పుడు వాటిని బాగా పరిశీలించి పంపండి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## బంగారూ... అంటూ పిలిచే సాయి

>> కున్నారు. ఈ విషయం తెలిసి భక్తులు ముందుకు వచ్చి కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. రూ.550 కోట్లు ఖర్చు పెట్టి ఏపి, తెలంగాణ, తమిళనాడులో 1600 గ్రామాలు, 30 లక్షలకు పైగా జనాభాకు నీరిచ్చారు. చెన్నై డ్రింకింగ్ వాటర్ మోడర్నైజేషన్ స్కీంకు రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. సత్యసాయి స్ఫూర్తిని, ఆయన చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి. రాష్ట్రప్రభుత్వం భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోంది" అని సిఎం చంద్రబాబు వెల్లడించారు.

## సామాన్య ప్రజలకు ఫ్యాన్లు, లైట్లు, బల్బులు పంపిణి

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** సామాన్య,దిగువ మధ్యతరగతి ఆదాయ వర్గాల కుటుంబాల వారికి ఏపీ ప్రభుత్వం మరో శుభవార్తను అందించనున్నది..విద్యుత్తు ఆదాను చేసే దిశలో ఈ కుటుంబాలకు ఫ్యాన్లు, లైట్లు, బల్బుల పంపిణీ చేయాలని ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం!. రాష్ట్రంలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులందరికీ బీఈఈ స్టార్‌రేటెడ్, ఎనర్జీ ఎఫిషియంట్ పరికరాలు అందించనుంది. క్లీన్ ఎనర్జీని అందరికీ అందుబాటులోకి తెచ్చే క్రమంలో భాగంగా.. విద్యుత్‌ను ఆదా చేసే చర్యలలో భాగంగా.. ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సహకారంతో ఏపీ హౌసింగ్ డిపార్టుమెంట్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు నాలుగు ఎల్‌ఈడీ బల్బులు, ఆరు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, రెండు బీఎంఎ డీసీ ఫ్యాన్లు అందించనుంది. 2026 నాటికి ఆరు లక్షల మంది ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అందించే అదనపు సాయం ద్వారా వీటిని అందిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా ఏటా సుమారుగా 10.24 మిలియన్ కిలోవాట్ అవర్స్ ఆదా అవుతుందని అధికారుల అంచనా. అలాగే కోట్ల రూపాయలు ఆదా అవుతాయని అంచనా వేస్తున్నారు.

# పరకామణి చోరీపై త్వరలో మరో కేసు

>> ఓ అధికారి కలసి నిందితుడ్ని అరెస్ట్ చేయకుండా రాజీధోరణిలో లోక్‌అదాలత్‌లో అప్పటి ఏవిఎస్ఓ ఇటీవల అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయిన సతీశ్‌కుమార్‌పై ప్రోద్భలం చేసి రాజీచేయించారనేది ప్రధాన ఆరోపణలు. అందుకు ప్రతిఫలంగా రవికుమార్‌నుండి 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను శ్రీవారి కానుకగా రాయించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు కీలకంగా వ్యవహ రించిన గత బోర్డులో పెద్దలు ,టిటిడి ,పోలీస్ అధికారుల పాత్ర ఏంటనేది తేల్చడానికి ప్రస్తుత టిటిడి బోర్డు కీలకంగా నిర్ణయం తీసుకుంది. ఈ కేసు సమగ్ర దర్యాప్తులోభాగంగా హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో 20మంది బృందం మరింత లోతుగా అనేక కోణాల్లో విచారణ చేస్తోంది. పూర్వ ఏవిఎస్ఓ సతీశ్‌కుమార్ ఈ కేసుపై గతంలో హైకోర్టులో కౌంటర్‌దాఖలు చేసి కేసు రాజీలో తనకెలాంటి దురుద్దేశం లేదని,పై అధికారులు చెబితేనే అలా చేయాల్సి వచ్చిందని కూడా పేర్కొన్నారు. దాని వెనుక అంతర్యమేమిటనేది కొందరు పోలీసు అధికారులు తప్పుపడుతున్నారు. టిటిడి పరిధిలోని అంశం గనుక బోర్డు, ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలనేది అప్పట్లోనే గుప్పుమంది. ఇదే పరిణామంలో వారం రోజుల క్రిందట ఆయన అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ కేసులో డిసెంబరు 2వతేదీకి తుది నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశాలతో తాజాగా మరో కొత్తట్విస్ట్ నెలకొంది. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి సమర్పించిన కానుకలు లెక్కించే పరకామణి నుండి ఏకంగా 920 అమెరికల్ డాలర్లు చోరీ చేయడం పెద్ద విషయంగానే బోర్డు భావిస్తోంది. డాలర్ల చోరీకేసు వెనుక కుట్రదారులను తేల్చేలా విచారణ చేయాలని తీర్మానించింది. ఈ కేసుతో సంబంధం ఉన్న గత టిటిడి ఛైర్మన్, అధికారులు, పోలీసు అధికారులతోబాటు లోక్‌అదాలత్‌లో పరకామణికేసు రాజీచేసిన న్యాయమూర్తిపై కూడా చర్యలు చేపట్టాలని హైకోర్టు సూచించడం సంచలనంగా మారింది. పరకామణి చోరీ వ్యవహారంలో "పెద్ద"లుగా వ్యవహరించి చేతివాటం చూపిన వారెవరనేది ఇప్పుడు డిసెంబర్ 2వతేదీకి వెలుగుచూడనుంది. అదేగాక చోరీచేసిన గుమస్తా టిటిడి ఉద్యోగికూడా కాకపోవడం మరో కొసమెరుపు. మరోవైపు రవికుమార్ కూడబెట్టిన ఆస్తులు, కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్‌ఖాతాలు, లోక్‌అదాలత్‌లో రాజీతో ఎవరెవరికి ఎంత మొత్తంలో లాభపొందారనే వివరాలు రాబట్టడంలో ఆయన కాల్‌డేటా ఆధారంగా పోలీసులు విచారణ వేగవంతంగా చేస్తున్నారు. చోరీ జరిగిన రోజు నుండి రాజీచేసుకున్నవరకు నిందితుడువెవరెవరితో,ఎంతకాలంగా,ఎన్ని రోజులు మాట్లాడారు,ఎవరితో వాట్సాప్ ఛాటింగ్‌లుచేశాడు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయనతో సంభాషించిన వారికాల్‌డేటానుకూడా పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. రవికుమార్ పేరున అతనికుటుంబ సభ్యుల పేరున ఉన్న ఆస్తులు ఎవరిపేరున మారాయనేది తమిళనాడు ప్రభుత్వం నుండి సమాచారం అందితే ఈ మొత్తం కేసులో చిక్కుముడివీడిపోనుందనేది సమాచారం. ఇప్పుడు కొత్తగా తిరుమల పోలీసులు కేసు నమోదుచేస్తే అసలు దోషులువెవరనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనేది హాట్‌టాఫిక్‌గా మారింది. మరోవైపు రవికుమార్ కూడా తన ఆస్తులపై దర్యాప్తు విచారణ ఆపాలని హైకోర్టును ఆశ్రయించారు.

# చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు

>> చిత్తూరు జిల్లాల్లోని ఆస్తులు ఉన్నాయి.వీటిని జప్తు చేయాలని సిట్ విజ్ఞప్తి మేరకు హోం శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, కెవిఎస్ ఇన్‌ఫ్రా ఎండీ చెవిరెడ్డి లక్ష్మి పేరిట ఉన్న చర, స్థిరాస్తులన్నింటినీ జప్తు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని భూములు, ఇతర ఆస్తులు ఈ జాబితాలో ఉన్నాయి. మద్యం కుంభకోణం ద్వారా చెవిరెడ్డి కుటుంబం అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టిందని సిట్ తన విచారణలో గుర్తించింది. సుమారు రూ. 54.87 కోట్ల నల్లధనాన్ని అధికార అండతో భూ లావాదేవీల ద్వారా మళ్లించినట్టు సిట్ నిర్ధారించింది. ఈ మేరకు సిట్ చేసిన విజ్ఞప్తి ఆధారంగా హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అవినీతి నిరోధక చట్టం కింద ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు చేపట్టాలని డిజిపిని ప్రభుత్వం ఆదేశించింది.

20-11Pg3exHMNWJQETR 3 ONG_20-11Pg3exHMNWJQETR.qxd 20/Nov/25 12:30 AM Page 1





గోవులకు మేత అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ



బాలికలకు సంవృద్ధి యోజన పథకం కింద సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

# పుట్టపర్తిలో ప్రధాని పర్యటన గ్రాండ్ సక్సెస్

## - ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు - సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవలను పొగడ్తలతో ముంచెత్తిన అగ్రనేతలు - ట్రస్టు ద్వారా 100 ఆవులను రైతులకు బహూకరణ - సుకన్య సంవృద్ధి యోజన కింద పేద బాలికలను ట్రస్ట్ ద్వారా ఎంపిక

**అనంతపురం, నవంబర్ 19 ప్రభాతవార్త బ్యూరో** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన దేశ ప్రధాని నరేంద్రమోదీ పర్యటన గ్రాండ్ సక్సెస్ అయింది. కట్టుదిట్టమైన పోలీసు భద్రత రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల కృషి వల్ల ప్రధాని సభ సజావుగా సాగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేయడంతో ప్రధాని నరేంద్రమోదీ సభ సక్సెస్ అయిందని చెప్పవచ్చు. శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని నిర్ణయం తీసుకోవడంతో గత కొద్దిరోజులుగా రాష్ట్ర స్థాయి అధికారులు కూడా పుట్టపర్తిలోనే మకాం వేసి శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు సెంట్రల్ ట్రస్ట్‌తో కలిసి చర్యలు తీసుకోవడంతో ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి పర్యటన సక్సెస్ అయిందని చెప్పవచ్చు. ఒకరోజు ముందుగా మంగళవారం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్, అతిథులు, భారత రత్న అవార్డు గ్రహీత సచిన్‌థెండుల్‌కర్, సినీ నటి ఐశ్వర్యరాయ్‌బచ్చన్‌నే కాకుండా కేంద్ర మంత్రులు, ఇతర మంత్రులు వచ్చారు. మంగళ, బుధవారం పెద్ద ఎత్తున వివిపిలు రావడంతో పుట్టపర్తి కలకలలాడింది. పుట్టపర్తి అంతా విద్యుత్ దీపాలు అలంకరించడం, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ట్రస్ట్ నిర్వాహకులు ఆనందానికి గురయ్యారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం పుట్టపర్తికి చేరుకుని శ్రీ సత్యసాయి మహాసమాధిని సందర్శించడంతోపాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా 100 ఆవులను బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రైతులకు బహుకరించారు. అందులో ప్రధాన మంత్రి చేతులు మీదుగా రైతులకు అందజేశారు. పుట్టపర్తిలోని హిల్వ్యూహ స్టేడియంలో జరిగిన సభలో సత్యసాయి బాబాసేవలకు గుర్తింపుగా 100 రూపాయల నాణెనాన్ని, పోస్టల్ స్టాంప్‌లను కేంద్ర ప్రభుత్వం తరుపున ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా ఆవిష్కరింపజేశారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికలకు ఆర్థిక సాయం అందే విధంగా 20వేల మందికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించే పథకానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా ముగ్గురు బాలికలను వేదికపైకి ఆహ్వానించి ప్రధాని చేతులు మీదుగా పథకాన్ని వారికి అందజేశారు. సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగిస్తూ..సుకన్య సంవృద్ధి యోజన పథకంకు సంబంధించి గోవులను సహాయంగా అందించే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్నేళ్ల కిందట వారణాసిలో రాష్ట్రీయ గోకుళ్ మిషన్ ద్వారా 480పైగా గిరి ఆవులను పంపిణీ చేశామని, ఇప్పుడు గిర్‌ఆవులు, లేగ దూడల సంఖ్య దాదాపు 1700లకు పెరిగిందని ప్రధాని గుర్తు చేశారు. ఏడెనిమిది ఏళ్ల క్రింద ఆఫ్రీయాలోని రుమాండలోని తన పర్యటన సందర్భంగా 200 గిరి ఆవులను ఆ దేశానికి భారత్ బహుమతిగా అందించిందని ప్రధాని గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా పుట్టపర్తిలోని స్టేడియంలో జరిగిన సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం సాయి భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం 12:19 గంటలకు ప్రారంభించి 12:39గంటల వరకు ప్రసంగించారు. దాదాపు 20 నిమిషాల వరకు ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించినా, ఎలాంటి నోట్స్, పేపర్ చూడకుండానే అనర్గలంగా హిందీలో మాట్లాడటం విశేషం. ప్రధాని తన ప్రసంగంలో సత్యసాయి బాబా బోధనలను, సేవలను, ఫిలాసఫీని, అభినందిస్తూనే ప్రస్తుతం సెంట్రల్ ట్రస్టు చేస్తున్న సేవలను ప్రశంసించారు. సభలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ తన ప్రసంగాల్లో సత్యసాయిబాబా సేవలను కొనియాడారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ ఒక్కొక్కరు 8 నిమిషాల చొప్పున ప్రసంగించగా, సీఎం ప్రసంగించారు.

## బాబా మార్గాన్ని భావితరాలకు అందించడమే ట్రస్ట్ లక్ష్యం

### - శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

**పుట్టపర్తి, నవంబర్ 19, ప్రభాతవార్త** భక్తులతో భగవాన్ సత్యసాయి మాట్లాడుతూ, దీవెనలు అందించడానికి వస్తుంటానని చెప్పేవారని, ఆ వాగ్దానం నేడు ప్రధాన మంత్రి నరేంద్రమోడి పునీత దర్శనంతో నిజమైందని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. బుధవారం భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి విచ్చేసిన సందర్భంగా హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆర్.జె.రత్నాకర్ మాట్లాడుతూ, సాయి భక్తులు, సేవాదళ్ సభ్యులకు, ప్రపంచం నలుమూల నుండి విచ్చేసిన వేలాది మంది భక్తులకు ప్రేమపూర్వక అభినందనలు తెలియజేశారు. పుట్టపర్తి భగవాన్ సత్యసాయి బాబా జన్మభూమి మాత్రమే కాదు, ఆయన కర్మభూమి కూడా అన్నారు. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే మానవతా విలువలను ఇక్కడి నుంచే ప్రసారం చేశారన్నారు.సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవ చేస్తున్నారని గర్వంగా తెలిపారు. ఆ విద్యార్థుల్లో చాలామంది ఈ శతజయంతి కార్యక్రమాలకు ప్రత్యేకంగా విచ్చేసి సేవలో పాల్గొనడం బాబా బోధనల మహాత్యం అన్నారు. సత్యసాయి ప్రసంగాలను ఊటంకిస్తూ, "మా అమ్మ చదవలేదు.. నన్ను కూడా చదవించలేదు. కానీ ఆమె ఇచ్చిన విలువలు, దీవెనలు నన్ను నడిపిస్తున్నాయి" అని బాబా చెప్పేవారిని గుర్తు చేసుకున్నారు. దేశంలోని తల్లులు తమ పిల్లలకు జ్ఞానం, విలువలు అందించాలని బాబా ఎల్లప్పుడూ ఉద్బోధించేవారన్నారు.

## సత్యసాయిబాబా జన్మించి నూరేళ్లు అయినా ఆయన దివ్య స్ఫూర్తి ఇప్పటికీ నిలిచి ఉంది

### ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాయ్ బచ్చన్




**అనంతపురం, నవంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లోని హిల్ వ్యూ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తన హృదయపూర్వక భావాలను పంచుకున్నారు. బాబా పట్ల ఆమెకున్న భక్తి, ఆయన బోధనల పట్ల గౌరవం, సేవా మార్గం పట్ల ఉన్న ఆమె నిబద్ధత ఈ సందేశంలో స్పష్టంగా ప్రతిఫలించాయి.భగవాన్ సత్యసాయి బాబా జన్మించి నేటికి వందేళ్లు పూర్తయింది. కానీ ఆయన ప్రభావం, ఆయన దివ్య స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల హృదయాల్లో ఇంకా నిలిచే ఉంది. ఆయన ప్రేమకు, సేవకు, దయకు సరిహద్దుల్లేవు." సేవను నిజమైన నాయకత్వంగా చెప్పిన బాబా బోధనలను గుర్తుచేసుకుంటూ చెప్పారు. మానవ సేవే మాధవ సేవ అని బాబా నమ్మేవారు... చేసి చూపించారు. ఆయన చేసిన ప్రజాసేవ, ప్రేమ, దయ, పరిపూర్ణత – ఇవన్నీ ప్రపంచానికి ఒక ఆదర్శం."భగవాన్ బోధించిన 5 డ్లీల (ఇంగ్లీషు భాషలో)గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. డిసిప్లిన్ ( క్రమశిక్షణ), డెడికేషన్ (అంకితభావం), డివోషనల్ (భక్తి), డిటర్మే షన్(దృఢ సంకల్పం), డిస్క్రిమినేషన్ (సత్యాసత్య వివేకం), ఈ అయిదు డి లు మన జీవితానికి దిశగా, ధర్మంగా నిలుస్తాయి.

## వైసిపి ఎంపి మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ 21కి వాయిదా

### - కౌంటరు దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశం

**విజయవాడ,నవంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు హాజరయ్యేందుకు తనకు అనుమతి ఇవ్వాలంటూ ఏపీ మద్యం కుంభకోణం వ్యవహారంలో అరెస్టయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలంటూ సిట్‌ను ఏసీబీ కోర్టు ఆదేశించింది. ఎంపీ మిథున్ రెడ్డి పిటిషన్‌పై తదుపరి విచారణ నవంబర్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం స్కాంలో ఏ4గా ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు. ఆయన్ని ఈ ఏడాది జులై 19వ తేదీన సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. అంతకుముందు ఆయన్ని దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఆయన్ని అరెస్ట్ చేసి.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. నాటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంతో తన ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టులో మిథున్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అందుకు షరతులతో కూడిన బెయిల్‌ను ఆయనకు ఏసీబీ కోర్టు మంజూరు చేసింది. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఇక న్యూయార్క్ వెళ్తున్న ఎంపీల ప్రతినిధి బృందంలో ఎంపీ మిథున్ రెడ్డికి కేంద్రం చోటు కల్పించింది. ఈ పర్యటనకు వెళ్లేందుకు అనుమితి ఇవ్వాలంటూ మరోసారి ఏసీబీ కోర్టును ఆయన ఆశ్రయించారు. షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు ఆయన న్యూయార్క్‌లో పర్యటించారు.

## ప్రముఖుల రాకతో జనసంద్రంగా మారిన పుట్టపర్తి రహదారులు



ప్రధాని మోడీకి ఆశీర్వచనం చేస్తున్న పండితులు

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 19 ప్రభాతవార్త:** ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శ్రీ సత్య సాయి శతవర్ష జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఉదయం 9: 50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోపాటు కేంద్ర,రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరపు రామ్మోహన్ నాయుడు, సత్య కుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్ , అనగాని సత్యప్రసాద్ , సవితమ్మ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్వాగతం పలికారు. తొలిత ప్రధానమంత్రి సీఎం డిప్యూటీ సీఎంలతో కలిసి శ్రీ సత్య సాయి మహాసమాధిని దర్శించుకుని, కుల్వంత్ మందిరంలోని సత్యసాయి కాంచ విగ్రహం వద్ద ధ్యానముద్రలో కూర్చుని బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం పండితులు ప్రధానిని వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. సత్య సాయి ట్రస్టు ద్వారా నిరుపేద రైతులకు అందిస్తున్న గోదాన లబ్ధిదారులకు గోవులను దానం చేశారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సత్యసాయి ముద్రణ కలిగిన 100 రూపాయల నాణ్యాన్ని, స్టాంపును, మరియు సత్యసాయి ట్రస్టు ద్వారా బాలికలకు అందిస్తున్న సమృద్ధి పథకాన్ని పిల్లలకు అందించి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ట్రస్ట్ జిల్లాలోని 20వేల మంది ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కల్పించనుంది. ఈ కార్యక్రమంలో క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ పాల్గొన్నారు. ప్రముఖ మ్యూజిక్ డ్రం ప్లేయర్ శివమణి ప్రత్యేక వాయిద్య ప్రదర్శనను , ప్రఖ్యాత గాయని సుధా రఘునాథన్ గీతాలను ఆలపించారు. వీరితోపాటు సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి, జాతీయ అధ్యక్షుడు నిమిష్పాండే పాల్గొన్నారు.

## నా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితంచేసిన సాయి బాబా మన వెంట ఉంటే భయం ఉండదు : సచిన్ టెండూల్కర్

**అనంతపురం, నవంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** భగవాన్ సత్యసాయి బాబా మన వెంట ఉంటే భయం అనేది ఉండదని, నా శారీరక, మానసిక ఆరోగ్యం పై సత్యసాయి బాబా బోధనలు ఎంతో ప్రభావితం చేశాయని భారతరత్న అవార్డు గ్రహీత, మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లో బుధవారం జరిగి నభగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవంలో ఆయన పాల్గొని బాబా పట్ల తనకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని, దివ్యానుభూతులను ఎంతో హృదయపూర్వకంగా పంచుకున్నారు. సభలో వేదికపై ప్రధాని నరేంద్ర మోది, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితర ఎందరో ముఖ్యుల సమక్షంలో భక్తులను, విద్యార్థులను ఉద్దేశిస్తూ సచిన్ టెండూల్కర్ తన సందేశాన్ని ఈ విధంగా కొనసాగించారు... సత్యసాయి బాబాకు నా ప్రణామాలు. ఆయన నాకు చిన్నతనం నుంచే ఒక దైవసంబంధం లాంటి అనుభూతిని ఇచ్చార"ని తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ చెప్పారు. "నాకు ఐదేళ్ల వయసులో ఉండగా ఎక్కడికైనా వెళ్లినా‘ఈ బాలుడు బాల సత్యసాయి బాబాలా ఉన్నాడ్లు అని అందరూ చెప్పేవారు. ఆ మాటలు అప్పట్లో వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా, తరువాత బాబాతో ఏర్పడిన అనుబంధం ఆ మాటలకు అర్థం చూపింది." 1990లలో వైట్‌ఫీల్డ్‌లో భగవాన్ సత్యసాయి బాబా దర్శనం పొందిన సందర్భాన్ని సచిన్ ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటూ "మనం అడగకపోయినా మన మనసులో ఏముందో, ఏ సందేహం వుందో బాబా ముందుగానే చెప్పేవారు. ఇది నమ్మశక్యం కాకపోయినా.. నేను అనుభవించిన సత్యం." శారీరక, మానసిక ఆరోగ్యంపై బాబా ఇచ్చిన బోధనలు తన జీవితాన్ని ప్రభావితం చేశాయని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో రూ.9.28 కోట్లతోఆర్వో ప్లాంట్లు

### - 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం

**విజయవాడ,నవంబరు 19,పభాతవార్త ప్రతినిధి:** సంక్షేమ వసతి గృహాలు,గురుకులాల్లో కలుషిత నీటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు సురక్షిత నీటిని అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు సహా 49 ఎస్సీ గురుకులాలు,రెండు అంబేద్కర్ స్టడీ సర్కిళ్ళలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్చలు చేపట్టింది. ఇందుకు రూ.9.29 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో ఎస్సీ వసతి గృహానికి రూ.2 లక్షల చొప్పన మొత్తం 311 వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.6.22 కోట్లు విడుదల చేసింది. గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున అధిక సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకోసం ఒక్కో దానికి రూ.6లక్షల చొప్పున కేటాయించింది. 49 గురుకులాలు రెండు స్టడీ సర్కిళ్ళకు మొత్తం రూ.3.06 కోట్లు విడుదల చేసింది. వీటన్నింటినీ 45 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# తిరుమల సమాచారం

## కార్తికమాసంలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం



**తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌రోడ్డుని నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామికి బుధవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఏడాది స్వాతితిరునక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేపడతారు. ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె,చందనం ,పసుపుతో విశేషంగా అభిషేకిరంచారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పోటు పేష్కార్ మునిరత్నం, అర్చకులు పాల్గోన్నారు.

## వెంకన్నసేవలో విద్యాదీశతీర్థస్వామి



**తిరుమల,నవంబర్ 19ప్రభాత వార్తప్రతి నిధి:** కార్తీకమాసం స్వాతితిరునక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం వ్యాసరాజమఠం మఠాధిపతి విద్యా దీశతీర్థస్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన స్వామికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ సాంప్రదయంగా స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న స్వామి తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీఅన్నప్రసాదంకు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,నవంబర్ 19ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాతలు విరివిగా విరాళాలి స్తున్నారు. బుధవారం ఉదయం తమిళ నాడు వేలూరుకు చెందిన డార్లింగ్ గ్రూఫ్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళీ వెంకటసుబ్బు ఎస్వీ అన్నప్రసాదంకు 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు.

## ముత్యపు పందిరిపై శ్రీ మహాలక్ష్మి



**తిరుచానూరు, నవంబర్ 19, ప్రభాతవార్త** తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు ముత్యపు పందిరిపై శ్రీ మహాలక్ష్మి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్ర నామార్చన నిత్యర్చన నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపుచేసి స్వర్ణ పుష్ప మణి మాణిక్యాలతో సర్వాంగ సుందరంగా ధనలక్ష్మి అలంకారంలో ముత్యపు పందిరిపై కొలువు తీర్చారు. తిరుమాడ వీధులలో గజరాజులు నడుస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ ముత్యపు పందిరిలో శ్రీ మహాలక్ష్మి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి కృప కటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో వాహన సేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, యుఒ అనిల్ కుమార్ సింగల్, జేఈఒ వీరబ్రహ్మం సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, ఏవీఎస్ఒ రాధాకృష్ణ మూర్తి, ఆర్జిత ఇన్స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 30నుండి శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం రద్దు



**తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, మరుసటిరోజు ద్వాదశి కావడంతో బాటు తిరుమల ఆలయంలో పదిరోజులు పాటు వైకుంఠద్వారాలను తెరచి ఉండనుండటంతో ఆ రోజుల్లో అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్రహహోమం రద్దుచేసినట్లు టిటిడి తెలిపింది. డిసెంబర్ 30వతేదీ నుండి 2026 జనవరి 8వరకు ఆన్‌లైన్‌లో హోమానికి సంబంధించి టిక్కెట్లు కూడా జారీచేయలేదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. తిరుపతి అలిపిరిలో ప్రతిరోజూ ఉదయంశ్రీనివాస దివ్యానుగ్రహ హోమం చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ హోమంలో గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి పాల్గొంటున్నారు.హోమం అనంతరం ఈ టిక్కెట్‌పై రోజువారీగా తిరుమలలో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కల్పిస్తారు. ఆలయంలో శ్రీవారిని దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. వైకుంఠద్వారాలు తెరచివుంచే రోజులు ఈ హోమం భక్తులకు అందుబాటులో ఉండదు.

## అమెరికాలో ఆంధ్రా మహిళ హత్య కేసులో ట్విస్ట్

### - నిందితుడిని పట్టించిన ల్యాప్‌టాప్

**విజయవాడ.నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికాలో దాదాపు 8ఏళ్ళ కితం హత్యకు గురైన ఏపీ మహిళ హత్యకేసులో అసలు నిందితుడిని అక్కడి పోలీసులు గుర్తించారు.అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా అనే మహిళ 2017లో తన కుమారుడితో సహా దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న అధికారులు ఎనిమిదేళ్ళ తర్వాత అసలు నిందితుడుని గుర్తించారు. అసలేమయ్యిందంటే...ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నర్రా హనుమంతరావు అనే వ్యక్తి అమెరికాలోని న్యూజెర్సీలో భార్య శశికళ,కొడుకు అనీష్ సాయితో కలిసి నివసించేవాడు. 2017మార్చి 23న హనుమంతరావు విధులు ముగించుకుని వచ్చేసరికి...మాపుల్ షేడ్ లోని వారి అపార్ట్‌మెంట్‌లో భార్య,కొడుకు రక్తపు మడుగులో పడిఉండటాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వీరి మరణాలకు భర్త నర్రా హనుమంతరావే కారణమని...అతడికి ఒక కేరళ మహిళకు మధ్య ఉన్న వివాహేతర సంబంధంతోనే భార్యాబిడ్డలను హత్య చేసినట్లు మృతురాలి బంధువులు ఆరోపించడంతో అతడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఘటనాస్థలంలో లభించిన డిఎన్ఎ హనుమంతరావు డీఎన్ఏతో సరిపోకపోవడంతో అతడిని విడుదల చేశారు. హనుమంతరావు సహోద్యోగి హమీద్‌తో గొడవలు ఉన్నట్లు విచారణలో భాగంగా అధికారులు గుర్తించారు. ఈ హత్య కేసులో హమీదుకు సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న సమయంలో హత్య జరిగిన ఆరు నెలల అనంతరం అతను భారత్‌కు తిరిగి వెళ్ళినట్లు గుర్తించారు.

## టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

### పెందుర్తిలోని రైల్వే పనుల్లోని ఒరిగిన విద్యుత్ స్తంభం, రైలు ఆపడంతో తప్పిన ప్రమాదం

**విశాఖపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త** పెందుర్తి వద్ద టాటానగర్ ఎక్స్ ప్రెస్ కు పెను ప్రమాదం తప్పింది. రైల్వే గ్యాంగ్ రైలు రోడ్డు పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లతో కలిగిన విద్యుత్ స్తంభ పక్కకి ఒరిగిపోయింది. అదే రోడ్లో టాటానగర్ ఎక్స్ ప్రెస్ పెందుర్తి దాటుతుంది అయితే టాటా నగర్ ఎక్సెస్ లోకో పైలట్ ఈ ప్రమాదాన్ని ముందుగా గమనించి రైలును ఆపేశారు.

దీంతో రైలు బండిలో ఉన్న ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారు. దీన్ని గమనించిన రైల్వే అధికారులు హుటా హుటిన ఆ విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# భారత్ చేతిలో హాసీనా భవిత!

సొంత దేశంలో కల్లోలానికి కారకురాలై పరాయి పంచన కాలం వెళ్లదీస్తున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణదండన విధించింది.ఇదేమీ ఊహించనిది కాదు. అధికారంలో ఉన్నా లేకున్నా చట్టానికి ఎవరూ అతీతులు కారన్నది న్యాయ పరిభాషలో, ప్రాథమిక సూత్రంగా వర్తిస్తుంది. లోకకళ్యాణం కోసం దేశాధినేతలు తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజాదరణ పొందకపోవచ్చు. కానీ అంతమాత్రాన వాళ్లు దేశ విధ్వంసానికి పాల్పడుతున్నారని చెప్పడం సాహసమే అవుతుంది. హాసీనా ఏదో అల్లాటప్పా రాజకీయాలు చేసుకునే చిన్నస్థాయి కుటుంబం నుంచి వచ్చిన మహిళ కాదు.ఆ దేశ ఏర్పాటులో, నిర్మాణంలో ప్రగతిలో పాలు పంచుకున్న బంగ్లాజాతి పిత షేక్ ముజిబుల్ రహ్మాన్ కూతురు. ఎంతో కొంత దేశభక్తి లేకుండా ప్రధాని బాధ్యతలు స్వీకరించారంటే నమ్మలేం. ఆ కుటుంబం చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు. 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా అవతరించేందుకు ముజిబుర్ చేసిన కృషి ఎనలేనిది. ప్రజల్లోంచి ఉద్యమాలు వచ్చినప్పుడు వాటిని సానునయంగా పరిష్కరించడమో, అది సాధ్యం కానప్పుడు వాటిని అణచివేయడమో ప్రభుత్వాలు చేయగలిగిన పని. ఆమె కూడా అదే చేశారు. అయితే కొన్ని నిర్ణయాలు ప్రజలకు రుచించకపోయి ఉండవచ్చు. వాటినే బూచిగా చూపి విపక్షాలు కూడా జనాన్ని చైతన్యవంతుల్ని చేసి ముందుకురికించే శ్రమ తీసుకున్నారేమో అనిపిస్తుంది. బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తింది. అదే ఉద్యమానికి దారి తీసింది. జూలై 15న విద్యార్థులు ఉవ్వెత్తున చేసిన తిరుగుబాటును ఉక్కుపాదంతో అణచివేయాలని హసీనా తీర్మానించారు. అయితే ఎక్కడో లౌక్యం, చాణక్యం బెడిసికొట్టి 1400 మంది మృతికి ఆ నిర్ణయం కారణమైంది. మానవత్వాన్ని మరచి ఎంతో మంది బలైపోవడానికి ఆమె నిర్ణయం దారి తీసినందుకు జనాగ్రహం వ్యక్తమైంది. ఉద్యమాన్ని అణచివేత వ్యూహాలకు కర్త, కర్మ, క్రియా హసీనాయేనని ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం అభియోగాలు మోపింది. కాగా ఉద్యమ సమయంలో ఉద్యమకారులపైకి హసినా తమ సొంత పార్టీ అవామీ లీగ్ కార్యకర్తలను కూడా ఉసికొల్పారని అభియోగం. ప్రజాస్వామ్య పునాదుల పునరుద్ధరణకు తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే తాత్కాలిక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ మాత్రం హసీనాకు పడిన మరణ శిక్ష సబబే అని వ్యాఖ్యానించారు. కాగా ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత తీర్పుయని, ఒక అనామిక ప్రభుత్వం ఒత్తిడితో వెల్లడైన తీర్పుగా హసీనా పేర్కొన్నారు. 1975లో సైనిక తిరుగుబాటులో తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులు, మరికొందరు కుటుంబ సభ్యులు కూడా హతమయ్యారు. అనంతరమే ఆమె దేశ రాజకీయాల్లోకి ప్రవేశించాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ ట్రిబ్యునల్ ఆనాటి హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు కూడా మరణశిక్ష విధించారు. మాజీ ఐజి చౌదరి అబ్దుల్లా అల్ మమూల్‌కు ఐదేళ్ల శిక్ష పడింది. ఒక దేశంలో కానీ, ఒక రాష్ట్రంలో కానీ పాలకుల పట్ల విపక్షాలు తీవ్ర ఆగ్రహంతో ఉద్యమించినప్పుడు, వారిని నయానో, భయానో దారిలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించడమూ జరిగేదే. అది ప్రభుత్వ బాధ్యత. తాత్కాలిక ప్రభుత్వం కూడా ఆనాటి ఉద్యమకారులకు చేసిందేమీ లేదు. కానీ హసీనాకు శిక్షపడిందంటేనే అది వారికి న్యాయం జరిగినట్లు భావించాలనిచెబుతోంది. ఇదిలా ఉంటే హసీనాకు శిక్ష అయితే వేయగలిగారు కానీ ప్రస్తుతం ఆమె ఇండియా ఆశ్రయంలో ఉంది. ఎక్కడో రహస్యంగా దాక్కోలేదు. భారత ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. బంగ్లాలో నిరసనకారులను చిత్రహింసలకు గురిచేయడం నిరాయుధ విద్యార్థులపైకి మారణాయుధాలతో దాడి చేసిన చర్యలకు జవాబుదారీగా ఆమెను ట్రిబ్యునల్ అభిశంసించింది. విద్యార్థులపై దాడి జరిపేటట్లుగా హసీనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిందని మరో ఆరోపణలున్నాయి. ఏదిఏమయినా ముస్లిం దేశాలలో అధికారపక్షాన్ని తిరుగుబాటుతో కూలదోయటమనేది తరచు జరిగే ప్రక్రియ. గతంలో ఆయాప్రభుత్వాలను సైన్యమే కూలదోసేది. ప్రస్తుత బంగ్లాదేశ్ విషయం వేరు. ఇక్కడ ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసిన సైన్యం కూడా మాటపడాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా భారత్‌లో ఉన్న ఆమెను ఎలాగైనా స్వదేశానికి రప్పించుకొని మరణశిక్ష అమలు చేయాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం కొత్త వ్యూహాలు పన్నుతోంది. బంగ్లాదేశ్‌లో మరణశిక్ష విధించబడిన షేక్ హసీనాను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికేభారత్‌కు విజ్ఞప్తిచేసింది. భారత్,బంగ్లాదేశ్‌ల మధ్య ఉన్న ఒప్పందం మేరకు షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను తమకు అప్పగించడమే తక్షణ కర్తవ్యమని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు కర్తవ్యబోధ చేస్తోంది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలు కాపాడే దిశగా శాంతి ప్రజాస్వామ్యం స్థిరత్వం కలిగేటట్లు తమ దేశనిర్ణయాలు ఉంటాయని భారత్ ప్రకటించింది. ఈ రెండు దేశాల మధ్య ఉన్న ఒప్పందంలోని ఆర్టికల్ '6' ప్రకారం హత్య, ఉగ్రవాదం, వంటి తీవ్రమైన నేరాలు మినహా రాజకీయ స్వభావమున్న నేరాల్లోని నిందితులకు అప్పగించకుండా భారత్‌తిరస్కరించే అవకాశముంది. పరస్పర అప్పగింత సందర్భాలలోను 1962ఒప్పందంలోని సెక్షన్ 29ప్రకారం రాజకీయ ప్రేరేపిత ఒప్పందాలకు తిరస్కరించే అధికారం భారత్‌కు ఉంది. హసీనా భవితవ్యం ఇప్పుడు భారత్ దేశ నిర్ణయం మీద ఆధారపడి ఉంది.

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటికంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.



ఎడ్వర్డ్

మనిషి అన్నవాడు ఈ భూప్రపంచంలో తామరాకు లాగా జీవించాలి. తామర నీటిలో పెరుగుతున్నప్పటికీ దానికి తడి అంటదు.



స్వామి వివేకానందుడు

# ప్రజావాక్కు



## నిధుల కొరత

వాతావరణ మార్పులుగ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్ ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమేకాదు, అది వాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రకబాధ్యతలపైఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం. ప్యారిస్ఒప్పందానికి పునాదిఅయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకు ఒకే రకం బాధ్యతలనుపెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. పారిశ్రామికీకరణ ద్వారా శతాబ్దాలుగా అధిక ఉద్గారాలు విడుదల చేసిన అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించకపోవడం వాతావరణ చర్చల్లో ఏర్పడుతున్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేస్తుంది. నిధుల కొరతపరిష్కారం కాకుండా ఉద్గార తగ్గింపులపై ఒత్తిడి చేయడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్యాయం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రెస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మిసొమ్ము చేసుకొంటున్నారు.ఒక్కొక్క మందులషాప్‌లో ఫార్మాసిస్ట్‌లేడు.పర్యవేక్షణలేదు నిబంధనల ప్రకారం ప్రతిమందుల దుకాణంలోఅర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. యాంటీబయాటిక్ మందుల అమ్మకాలకు సంబంధించిన హెచ్1రిజిస్టర్‌ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

## పేదరికాన్ని నిర్మూలించాలి

కేరళ ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు దుర్భర పేదరికం నిర్మూలన చేసాం అని ప్రకటిస్తే ఎంత బాగుంటుంది. కేరళ మోడల్‌లో చేసిందేమిటి కనీస అవసరాల గుర్తింపు చేసి స్థానిక సంస్థల్కుబలంగ్కాపనిచేయడమేకదూ.అయితే తెలంగాణ వంటి రాష్ట్రాలు కేరళ మెడల్‌ను అవలంభించడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టడానికి కావాల్సిన ప్రణాళికలు సెస్ సంస్థ ద్వారా వేయించాలి.

- భారత అవినాష్, జనగామ

## సమాజానికి కొత్త సవాలు

ఈరోజుల్లో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలనుఇది అందిస్తోంది.అయితే అదేసమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది.ముఖ్యంగా వదంతులు,అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా వేదిక అవుతోంది. నిజా నిజాలు తెలియకుండానే ప్రజలు షేర్‌చేయడం వల్ల చిన్న సంఘటనలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి. కొన్నిసార్లు హింసాత్మక ఘటనలకు కూడా ఇది కారణమవుతోంది. వ్యక్తిగత జీవితాన్ని ఇంటర్నెట్‌లో అనవసరంగా ప్రదర్శించడం వల్ల గోప్యత కోల్పోవడం, మోసపూరిత చర్యలకు బలికావడం వంటి సమస్యలుపెరుగుతున్నాయి.అదేవిధంగా యువతసోషల్ మీడియా ఆకర్షణలో మునిగిబాధ్యతలు విస్మరించేపరిస్థితి ఏర్పడుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## మాటల కందని మహావిషాదం

ఇస్లాం మత ఆచారం ప్రకారం ముస్లిములకు అయిదు ప్రధాన సూత్రాలుంటాయి. అవి భగవంతుడైన అల్లా మీద నమ్మకం, ప్రార్థన,ఉపవాసం,దానం,జీవితంలోఒకసారయినా వారి పవిత్ర స్థలమైన మక్కా యాత్ర చేయడం.ఇందులో అన్నింటినీ తమకు అందుబాటులో నున్నచోట ఆచరించవచ్చు.కానీ హజ్ యాత్రకు సౌదీ అరేబియాకు వెళ్ళితీరాలి.ఈ నెల17వ తారీఖున అక్కడకు వెళ్ళినవారు మక్కా నుండి మదీనా బస్సులో వెడుతుండగా రాత్రి వేళ అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడడంతో అందులో ప్రయాణిస్తున్న 45 మంది సజీవ దహనం అవడం ప్రజలందరి హృదయాలను కలచివేసింది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## తెలంగాణలో తార స్థాయికి అవినీతి

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదోఒకప్రాంతంలో ప్రభుత్వఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. తాజాగా మెదక్ జిల్లా టెక్మాల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎసిబికి చిక్కడం అందర్నీ షాక్ గురిచేసింది.లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలని పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పడం రావడం లేదు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాలల హక్కుల పరిరక్షణ కాగితాలకే పరిమితం!

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనం దరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమ లుచేశారు.ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మికవ్యవస్థను నిర్మూలిం చడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొల గించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించబడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. 1989, నవంబరు 20న బాలల హక్కులపై సంప్రదాయ ఆచరణను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవిఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మిక శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాలలోపు



పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసిపిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి.పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పనిచేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాలలోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని,శక్తికిమించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగంఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్నిఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులుగానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలుప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5నుండి 15 సంవత్సరాల లోపు వయసుగల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు.పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మానివేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకుకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలుచేశారు.ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొన సాగుతూనే ఉన్నారు. బాల కార్మికవ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. ●

# ఎఐతో భాషాభివృద్ధి సాధ్యమేనా?


వి. వరద రాజు

చక్రం పురాతన ఆవిష్కరణ. కొత్త రాతి యుగంలో మెసెపుటోమియన్లు కనుగొన్నారు. రవాణాకు చక్రం, ఇరుసులే ముఖ్యం. ఈ రెండు వాళ్ళ సృష్టే. ఇవి రవాణా గతినే మర్చివేసాయి. ప్రగతి చక్రాన్ని ఫర్ మని త్రిప్పాయి. ఆవిరి, ముద్రణా యంత్రాలు సమాజాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాయి. విద్యుత్, కంప్యూటర్ కనుగొన్నాక అభివృద్ధి ఊహకు అందని తీరాలకు చేరింది. గుండు సూది మొదలు కంప్యూటర్ వరకు ప్రతి ఆవిష్కరణ మానవ జీవితాన్ని ఎంతో వేగవంతం చేసాయి. తేలిక పరిచాయి. అధిక సుఖమయం కావించాయి. అయినప్పటికి ఈ మార్పులు మధ్య ఒక మానవ అనుభవం మాత్రం ఏ మాత్రం మార్పు లేకుండా అలాగే నిశ్చలంగా నిలిచి వుంది. అది భాష. భావాన్ని వ్యక్తం చేసేదే (సాధనం) భాష. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. తరువాత ఉత్తరం వచ్చింది. ఫోన్ దూరాన్ని చేరిపేసింది. అదనంగా మెయిల్, వాట్సాప్, ఇలా మెసేజ్ చేసే సాధనాలు చాలా వచ్చాయి. నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో వున్నాయి. ఎన్ని సాధనాలు వచ్చినా భాష మారలేదు. అలానే వుంది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే కానీ ప్రేరణ అలానే నిలిచివుంది. కృత్రిమ మేధా ఇప్పుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరిగి రాస్తోంది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తోంది. వ్యాసాలు రచిస్తోంది, సంగీత బానీలు కడుతోంది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధా ట్యూటరుగా, అనువాదకునిగా, ఆశ్చర్యకరంగా ఒక సహచరునిగాను వ్యాహరిస్తున్నది. తర్కం, స్థిర వ్యస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజనీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఎఐ ద్వారా తక్షణమే ఎవరైనా పొందవచ్చు. భాష వేరే కోవకు చెందింది. దీనికి నియమాలు ఉంటాయి.అంతేకాకుండా ఒక భాష ఆ జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఎఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం,వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదంసరిగానే ఉంటుంది. ఐతే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. యంత్రం ఆ ఉద్వేగ అనుభూతి చెందదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఎఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగాఉంటుంది. కానీ పేలావం అనిపిస్తాయి. మనిషి మాటలో వినిపించే పలు స్వరాలు, లయ, మాధుర్యాలు వినిపించవు. అనువాదం అంటే ఒక భాష నుండి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైందని భాషవేత్తలు చెబుతారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలూ ఉంటాయి. అలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకోంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలనిపిస్తాయి. తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. ఇవన్నీ విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తుంది. ఈ బంధం భాష నేర్చుకోవడంలో మెలుకువలు తెలియజేస్తుంది. ఈ సజీవ శిక్షణ ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు. కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడి సరిచేస్తాయి.వ్యాకరణం వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసన్ని అందిస్తాయి.టీచర్లకు బాగా ఉపయోగపడతాయి.లెసన్ ప్లాన్ రాసుకోవచ్చు,విద్యార్థులు నుండి వేగంగా అభిప్రాయాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకోనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషా పటిమ ధారళంగా మాట్లాడడం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే అలవడుతుంది.సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనేఉంటాయి.యాస, మర్యాద పూర్వక సంభషణా స్వరాలు మెల్లగా అనుభవంతో మారుతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లాయలోపాల్గొనలేదు. వినడం,అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు. ఇదే నిజమైన భాష ప్రావీణ్యత సాధనా మార్గం.గత మూడు దశాబ్దాలుగా పట్టణీకరణ జోరక్కెంది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు బాగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచుకోవాలంటే ఇంగ్లీష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఎఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెను ముప్పు కలిగిస్తుంది.భాష నేర్చుకోవలసిన అవసరంలేదనే భావన మనలో నాటుతుంది. అందుకే టెక్నాలజీని నేర్చు, వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం అనుకుంటే పొరపాటు. ఈ ప్రపంచాన్ని మరో దృష్టికోణంతో దర్శించడం.భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమైవుంటాయి. ఇదే నిజ భాషా పండిత్య సాధనకు సోపానం. ●

# పల్లెల ప్రగతియే దేశాభివృద్ధికి సూచిక

డా.పోలం సైదులు

గ్రామంలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి అభివృద్ధి చెందుతుందన్నారు మహాత్మ గాంధీ. అందుకే గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో స్వయం పాలన గావించడానికి పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.ఎప్పుడైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయో అప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశగా పయనిస్తాయి. గ్రామాభివృద్ధి అనేది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహాయ సహకారాలతో ముడిపడి గ్రామపాలన గావించే గ్రామ ప్రథమపౌరుడు (సర్పంచ్)పై ఆధారపడి ఉంటుంది. బీసీల 42శాతం రిజర్వేషన్స్ కారణంగా న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో కాస్తా ఆలస్యమైన ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ప్రభుత్వం నవంబర్ 17న జరిగిన కేబినెట్ సమావేశంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 1నుండి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించి, డిసెంబర్ రెండవ వారంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వేసి స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. గ్రామాలలో విభిన్న రాజకీయపార్టీలకు చెందిన నాయకత్వం రిజర్వేషన్ పరంగా అభ్యర్థులను ఖరారుచేసి ఇప్పటికే ఎవరికివారు అంతర్గత ప్రచార కార్యకలాపాలలో నిమగ్నమై ఉండటం గమనించవచ్చు. ఈ ఎన్నికలలో ఎన్నో వింతలను అంటే ఒకే కుటుంబానికి చెందిన ఇరువురి వ్యక్తులను అన్నా తమ్ముడు,అన్న చెల్లి, తల్లి కొడుకు, అత్త కోడలు బరిలో నిల్చోవడం లాంటి సంఘటనలను చూడవచ్చు. అలాగే ఈ ఎన్నికలలో ఒకవైపు అధికారపార్టీ తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి, మరొకవైపు ప్రతిపక్షపార్టీ బలోపేతం కావడానికి ప్రయత్నంలో భాగంగా డబ్బుఏరులై పారనుంది. ఓటర్లను ఆకర్షించడానికి చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ఎన్నో నెరవేరలేని హామీలుస్తూ, బ్రతిమిలాడుతూ, భయపెడుతూ, బహుమతులనిస్తూ ప్రచారం చేస్తుంటారు. వాస్తవానికి గ్రామాలలో ఎన్నికయ్యే సర్పంచ్ పైననే గ్రామాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. గ్రామ ప్రథమ పౌరుడంటే ఇంటికి పెద్దదిక్కువలే గ్రామానికి పెద్ద. గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి నిరంతరం వారి క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతుండాలి.అంతేగానీ ఏదో హోదాకోసమో ఆర్థికపరమైన వ్యాపారంగా భావించి లక్షలలో ఖర్చుపెట్టి వడ్డీతో సహా సంపాదించుకోవాలనో ఎన్నికలలో పోటీచేయవద్దు. గ్రామప్రజలు సైతం పార్టీలు, కులాలు, మతాలకతీతంగా డబ్బుకు ఎలాంటి ప్రాధాన్యతనివ్వకుండా, సేవాదృక్పథం కలిగి గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకున్ని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఏదిఏమైనప్పటికి ఫిబ్రవరి మాసం నుండి యావత్తు తెలంగాణ రాష్ట్రమంతట నూతనంగా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుమెంబర్లు నియామకం కాబోతున్నారు.కావున వారి విధుల నిర్వహణ,అభివృద్ధిపై సరైన అవగాహన ఏర్పర్చుకొని, గతంలోచరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను



పరిశీలిస్తూ అవగతం చేసుకుంటూ, ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామపంచాయతీకి గ్రామ ప్రథమపౌరురాలిగా ఎన్నికై గ్రామంలోని వీధులన్నీ సిమెంట్ రోడ్లతో నిర్మించి, ప్రతివీధికి భూఅంతర్భాగం ద్వారా మురికి కాలువలను నిర్మించి,ప్రతి ఇంటికి మరుగుదొడ్లు కట్టించి,పిల్లలకు పాఠశాలలను,అంగన్వాడీ కేంద్రాలను,గ్రామపంచాయితీ భవనాన్ని, గ్రంథాలయాన్నీ నిర్మించి 2008లో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి) శ్రీమతి ప్రతిభా పాటిల్ గారి చేతుల మీదుగా నిర్మల గ్రామ పురస్కారాన్నీ అందుకున్నారు.అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్రప్రభుత్వం నుండి 'శుభ్రం' అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమ పౌరులకు ఆదర్శం.అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామ చంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం, మహారాష్ట్రలోని అహ్మదనగర్ జిల్లాలోని హైవేర్ బజార్‌లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిస్తే గ్రామ సభలను విజయవంతంగా జరిపి,పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ, ఆ సభలలో గ్రామంలోని ప్రతి ఒక్కరిని హాజరయ్యేటట్లు చేసి,గ్రామాభివృద్ధికి కృషిచేశారు. గంగాదేవిపల్లిలో 18రకాల వివిధ కమిటీలను గ్రామసభ ద్వారా శుద్ధమైన త్రాగునీరు కమిటీ,పారిశుద్ధ కమిటీ, ఆరోగ్యా కమిటీ, సమాచార కమిటీలు మొదలగు వాటిని ఏర్పాటు చేసి ఎవ్వరికి ఏ విషయంలో సమస్య వచ్చినా, తగిన కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విధంగా యంత్రాంగాన్నీ ఏర్పాటుచేసి అభివృద్ధికి దోహదపడటం జరిగింది. పాఠశాలకు వెళ్ళే వయసు వచ్చిన బాలబాలికలను పాఠశాలలలో చేర్పించేటట్లు యంత్రాంగాన్ని తయారుచేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేస్తూ విజయవంతంకావడం. ప్రతిఇంటికి పరిశుభ్రమైన త్రాగునీరు అందేటట్లు చూడటం. జనాభా నియంత్రణలో భాగంగా దంపతులను ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతోచాలని ప్రోత్సహిస్తూ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ చేయించడం. గ్రామంలోని ప్రతి పసిపిల్లలకు ప్రభుత్వం తరుపున అందించే పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికి అందేటట్లు చూడటం. గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకులో ఖాతా తెరిచి నగదు నమోదు చేసుకోవడానికి ప్రోత్సహించడం.గ్రామంలో పారిశుద్ధానికి అధిక ప్రాముఖ్యతనిస్తూ,ఎవ్వరికి ఎలాంటి అంటూ రోగాలు రాకుండా జాగ్రత్తపడటం. గ్రామంలో అందరి సమేతంగా మద్యపానాన్ని నిషేధించి అభివృద్ధిలో పరుగులు తీసేవిధంగా తీర్చిదిద్దడంఅనేది యావత్తు రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాల గురించి సర్పంచ్ బరిలో ఉన్నటువంటి అభ్యర్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరీ ముఖ్యంగా గ్రామాలలో జరిగే ఈ పంచాయితీ ఎన్నికలలో స్నేహపూరిత పోటీని కలిగివుండాలే తప్పా, ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా ఛాలెంజ్‌గా తీసుకోని అధిక ధనాన్ని ఖర్చుచేసి, మద్యాన్ని ఏరులై పారిస్తూ,తను నష్టపోయి, ఇతరులను ఇబ్బందులపాలు చేయకుండా చూసుకోవాల్సిన భాధ్యత వారిపైనే ఉన్నది. గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షిస్తూ, వీలైతే ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థపరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం. ఎలాంటి కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ,పంచాయితీ ఎలక్షన్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంటూ ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకొని గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం. ●

## నవోదయ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల డిసెంబర్ 13న పరీక్ష జరుగుతుందని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్ కోసం హెచ్‌టీటీపీఎస్:// సీబీఎస్ఈ ఐటీఎంఎస్. ఆర్‌సీఐఎల్. జీవోవీ. ఇన్/ఎన్‌వీఎస్/ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే విద్యాలయ ఆఫీసు నందు వివరాల కోసం సంప్రదించవచ్చు అని ఆయన తెలిపారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కొమరోలు - హైదరాబాదు బస్సును పునరుద్ధరించాలి

**కొమరోలు, నవంబర్ 19 ప్రభాతవార్త**

కొమరోలు హైదరాబాదు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల ప్రజలు కొమరోలు నుండి నేరుగా హైదరాబాదుకు ప్రయాణించేందుకు గత మూడు నెలల క్రితం గిద్దలూరు ఆర్టీసీ డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సునుఏర్పాటు చేశారు. ఈ బస్సు ప్రతిరోజు కొమరోలు నుండి సుమారు ప్రతిరోజు రాత్రి 8:45కు బయలుదేరి తాటిచెర్ల మోటు మీదుగా హైదరాబాదులోని బీహెచ్‌ఈఎల్ మీదుగా రామచంద్రపురంకు మరుసటి రోజు ఉదయం 5 గంటలకు చేరేది. తిరిగి సాయంత్రం 7:20కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5గంటలకు కొమరోలు చేరేది. రిజర్వేషన్ సౌకర్యం సైతం ఉండడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఈ ఆర్టీసీ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకునేవారు. కాగా ప్రారంభించిన కొంతకాలానికె గత నెలలో ఈ సర్వీస్‌ను రద్దు చేయడంతో,ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు అధిక వ్యయ ప్రయాసలకోర్చి ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొమరోలు నుండి నేరుగా హైదరాబాదుకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## పుట్టవారిపాలెం అయ్యప్ప పడి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మంత్రి గొట్టిపాటి





**సంతమాగులూరు నవంబర్ 19 ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అయ్యప్ప పడి పూజాకార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పుట్టవారిపాలెం సర్పంచ్ మరియు మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు సన్నెబొయిన గురుబ్రహ్మం ఆహ్వానం మేరకు అయ్యప్ప పడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రవికుమార్ భక్తులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు సన్నెబొయిన గురుబ్రహ్మంతోపాటు మాజీ ఎంపీపీ సన్నెబొయిన ఏడుకొండలు తోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఏపీలో నియోజకవర్గాల పునర్విభజన.. కేంద్రం గ్రీన్ సిగ్నల్..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏపీలో నియోజకవర్గాల పునర్విభజనపై మరో సారి చర్చ ప్రారంభమైంది. బీహార్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించింది. దీంతో కేంద్ర ప్రభుత్వ పరంగా నిర్ణయాలు శరవేగంగా తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా జమిలీ ఎన్నికలతో పాటు నియోజకవర్గాల పునర్విభజన అంశం మరో సారి తెరపైకి వచ్చింది. అయితే రాజకీయంగా ముందుగా ఎన్డీఏ పక్షాలకు ప్రయోజనం కల్పించే విషయాలను మాత్రమే పెద్దపీట వేయాలని కేంద్రం భావిస్తుంది. అందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని అంచనా వేస్తుంది. ఇదే గాని జరిగితే ఏపీలో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉంది. విభజన సమయంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. అయితే విభజన జరిగి పుష్కరకాలం అవుతుంది. కానీ అటువంటిది ఏమి లేకుండా పోయింది అయితే ఇప్పుడు ఎన్డీఏ కూటమిలో టీడీపీ కీలక భాగస్వామ్యం కావడం రాజకీయంగా అనుకూలమైనవాతావరణం ఉండటంతో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం పూను కుంటుందన్న టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీస్థానాలు ఉన్నాయి. 25 పార్లమెంట్ స్థానాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మరో 50 సీట్లు పెరిగే అవకాశం ఉంది. 225 అసెంబ్లీ సీట్ల వరకు వచ్చే ఛాన్స్ కనిపిస్తుంది. పార్లమెంట్ స్థానాలకు సంబంధించి 5 నుంచి 7 పెరిగే అవకాశాలు ఉన్నాయి.అదే జరిగితే దాదాపు మరో 6 పదవులు పెరిగే అవకాశం ఉంది. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా చాలా మంది అవకాశాలు కోల్పోయారు. అటువంటి వారు పునర్విభజనతో కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు అవుతుందని భావిస్తున్నారు. తమకు తప్పకుండా ఛాన్స్ వస్తుందని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి దేశంలో జనగణన జరగాల్సి ఉంది. చివరి సారిగా 2011లో జరిగింది. ప్రతి పదేళ్లకు ఒక సారి జనగణన జరగడం అనవాయితీగా వస్తుంది. కానీ 2021లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా వాయిదా పడింది. ఇప్పటి వరకు జనగణన పూర్తి చేయలేకపోయారు. అది జరిగితే గాని కులగణన చేయలేరు. అయితే ఇప్పుడు జనగణన జరిగితే కాని నియోజకవర్గాల పునర్విభజన చేయలేరని వార్తలు వచ్చాయి. అయితే దేశంలో ప్రజల కోసం ఎప్పుడైనా పాలనాపరమైన అంశాల్లో చేర్పులు మార్పులు చేసుకోవచ్చని రాజ్యాంగం చెప్తుంది. అందుకే ఇప్పుడు కూడా జనగణన లేకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేయవచ్చనే అంశం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమికి అనుకూల వాతావరణం ఉండడంతో నియోజకవర్గాల పునర్విభజన చేయవచ్చనే వార్తలు వస్తున్నాయి. అసెంబ్లీ నియోజవర్గాలతో పాటు పార్లమెంటు నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఏపీ నుంచి బీజేపీ ఆరు ఎంపీ సీట్లను పొత్తులో భాగంగా తీసుకుంది. అసెంబ్లీ సీట్ల పరంగా 10 సీట్లు మాత్రమే తీసుకున్న బీజేపీ పార్లమెంటు స్థానాల విషయానికి వచ్చే సరికి సింహభాగం ప్రయోజనాలను కోరింది.ఇప్పుడు కూడా పునర్విభజన ద్వారా పార్లమెంటు సీట్లు పెరిగితే అది బీజేపీకే లాభం. తప్పకుండా చంద్రబాబు పార్లమెంటు స్థానాలను అయితే ఇచ్చేస్తారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటం చంద్రబాబుకు ముఖ్యం. కేంద్రంలో అధికారంలోకి రావడం బీజేపీకి ప్రధానం.అందుకే పరస్పర ప్రయోజనా లకు అనుగుణంగా రెండు పార్టీలు అడుగులు వేస్తాయి. సహకరించేందుకు జనసేన సైతం సిద్ధంగా ఉంది. పునర్విభజన జరిగి తీరుతుందని సంకేతాలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..?

## అమ్మవారికి ప్రత్యేక పూజలు



**చీరాల, నవంబర్ 19, ప్రభాతవార్త**

పాతూరు శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం వద్ద పాతూరు ఏరియా మహిళలందరూ కలిసి వన సమారాధన, ఉసిరిచెట్టు పూజ చేసుకుని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్కమంలో గ్రామంలోని మహిళలంతా భక్తిశ్రద్దలతో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రలు అయ్యారు. ఈ కార్యక్రమంలో పందిళ్ళపల్లి గ్రామ వాసి అయినటువంటి గుంటూరు నీరజ న్యూరో కేర్ హాస్పిటల్ అధిపతి డాక్టర్ నీరజ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకా గ్రామంలోని అనేక మంది పెద్దలు ఆలయ కమిటీ వారు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### - ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



**సీఎస్‌పురం, నవంబర్ 19, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గంలోని గ్రీన్ ఫీల్డ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మేఘా కాంట్రాక్టర్ పీవీ కృష్ణాఎడ్డికి సూచించారు. మండలంలోని అంబవరం- కొత్తపల్లి గ్రామాల సమీపంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారంపరిశీలించారు. అనంతరం మేఘా కాంట్రాక్టర్ పీవీ కృష్ణారెడ్డికి అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేను బైరవకోన ఆలయ ట్రస్టు చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసి రోడ్డు పనుల పురోగతిని వివరించారు. రోడ్డు నాణ్యతపై ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి వివరంగా విచారించారు.పనుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని, నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డుపనులను మరింత వేగవంతం చేయాలని, ప్రజలకు త్వరగా ప్రయోజనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మేఘా కాంట్రాక్టర్ పీవీ కృష్ణారెడ్డిని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో బైరవకోన ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బైరవకోనలో శానిటేషన్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



**సీఎస్‌పురం, నవంబర్ 19, ప్రభాతవార్త**

జిల్లాలో ప్రసిద్ది చెందిన శైవ పుణ్యక్షేత్రం బైరవకోనను బుధవారం సందర్శించి శానిటేషన్ ఏర్పాట్లను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు , ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. జలపాతం ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడికి వచ్చిన భక్తులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరువాత ఆలయ పరిసరాలు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వంశీ కృష్ణారెడ్డితో చర్చించారు. పరిశీలన అనంతరం శ్రీ బైరవేశ్వరస్వామి, శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారితో పాటు నగరేశ్వరస్వామి వివిద శివలింగాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, బైరవకోన మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ గుంటిమడుగు వెంకట రామరాజు, అంబవరం కొత్తపల్లి సర్పంచ్ ముప్పాళ్ళ శ్యామలమ్మ, ముప్పాళ్ళ వెంకట నరసరాజు, మద్దులూరి వెంకటరాజు, ముప్పాళ్ళ నారాయణ రాజు, అర్చకుల బృందం ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల తలసరి ఆదాయం పెంచడమే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం



**చీరాల, నవంబర్ 19, ప్రభాతవార్త**

చీరాల మండలం బోయినవారిపాలెం రైతు ఏవ కేంద్రం వద్ద అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద రైతులకు రెండో విడత ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఆర్డీవో చంద్రశేఖర్, చీరాల ఎమ్మార్వో , చీరాల పీఏసీఎస్ చైర్మన్ కోటి మోహన్‌కృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుదంటి చంద్రమౌళి, చప్పిడి పోలయ్య, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతన్నలకు ఈ పథకం ద్వారా లబిన చేకూరుతుందన్నారు. ఒక్కో రైతు బ్యాంకు అకౌంట్‌లో రెండో విడత రూ.7వేలు జమ అవుతాయని తెలిపారు. ఈ ఏడాది ఆగష్టు 2వ తేదీ తొలి విడత నిధులు విడుదల కాగా, రెండో విడత నిధులను రైతన్నల ఖాతాలకు బదిలీ చేయడం జరుగుతుందని అన్నారు. రైతుల తలసరి ఆదాయం పెంచడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు.

## మార్కాపురం డ్వాక్రా బజార్‌లో వివోఎల సమీక్ష సమావేశం





**మార్కాపురం రూరల్, నవంబరు 19, ప్రభాతవార్త**

మార్కాపురం ఎస్సీ, బీసీ కాలనీ వెలుగు కార్యాలయం డ్వాక్రా బజార్‌లో ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు వివోఎల నెలవారీ సమీక్ష సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు ఏపిఎండి. పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి స్త్రీనిధి డిజిఎం అల్లు ఉమామహేశ్వరరావు హాజరై మాట్లాడారు. మండలంలోని స్త్రీనిధి ఎన్ పి ఏ రికవరీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశిస్తూ, మహిళా సంఘ సభ్యులకు స్త్రీనిధి రుణాలు మరింత వేగంగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్త్రీనిధి ఏ జి ఎం ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ సంఘాలన్నింటిలోని సభ్యులందరికీ స్త్రీనిధి రుణాలపై అవగాహన కల్పించి, వారి ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు జీవనోపాధి కార్యక్రమాల కోసం 11 శాతం వడ్డీతో రుణ సదుపాయం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. మార్కాపురం క్లస్టర్ ప్రత్యేక అధికారిగా నియమితులైన డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ (నాన్ ఫామ్) దర్శనం దానం మాట్లాడుతూ, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం పి ఎం ఈ జి పి, పిఎం ఎఫ్ ఎం ఈ పథకాల ద్వారా 35 సబ్సిడీతో ..2 లక్షల నుండి ..20 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకాలపై గ్రామస్థాయిలో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఎం డి. పిచ్చయ్య మాట్లాడుతూ, ప్రాజెక్టు డైరెక్టర్ సూచించిన సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీలు, హెల్దీ, ఫైనాన్స్ తదితర అంశాలపై ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.తక్కువప్రగతి చూపుతున్న వివోఎలకు పనితీరు మెరుగుపరుచుకోవాలని, మార్పు కనబడనట్లయితే ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. మంచి పనితీరు చూపుతున్న వివోఎలను ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సీసీలు వి. నాగయ్య, కె. రామగోపాలరెడ్డి, ఎస్. వెంకటేశ్వర్లు, డి. మనోకుమారి, మండలంలోని వివోఎలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినీలు



**వేటపాలెం, నవంబర్ 19, ప్రభాతవార్త**

వేటపాలెం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినీలు రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని తెలియజేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో కనిగిరి మండలం కంచర్లవారిపాలెం జిల్లా పరిషత్ నందు గురువారం నాడు అండర్-14 అండర్-17 కబడ్డీసెలక్షన్స్ నిర్వహించారు. అండర్-14 విభాగంలో ఎల్.వైష్ణవి, షేక్ నస్రిన్, అండర్-17 విభాగంలో కే.గాయత్రి, పి.హిమబిందు, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుండి 24 వరకు అండర్-14 అండర్-17 కబడ్డీ పోటీలు మచిలీపట్నం, కర్నూలులో న్విహించబడతాయి.ఈ సందర్భంగా హైస్కూల్ పీఈటీలు జే.దేవబిక్షం, జే.శ్రావణి ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

## డిగ్రీ, బీటెక్ చదువుతున్న వారు ఐడియల్ కంప్యూటర్స్ నుండి అద్భుత అవకాశం



**కనిగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త**

డిగ్రీ, బీటెక్ చదువుతున్న విద్యార్థులతో పాటు ఇప్పటికే డిగ్రీ లేదా బీటెక్ పూర్తి చేసిన యువతీ, యువకులు కేవలం రూ.1000లకే ఐడీఎల్ కంప్యూటర్స్ ఫ్రాంఛైజీ పొదవచ్చని కనిగిరి ఐడీఎల్ కంప్యూటర్స్ డైరక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ ఫ్రాంచైజీ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో మీకు నచ్చిన ఏ ఊరులోనైనా స్వంతంగా కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించుకునే అవకాశం ఉంటుంది. తక్కువ పెట్టుబడితోనే మీ సొంత వ్యాపారం ప్రారంభించి లక్షల రూపాయలు సంపాదించుకునే అవకాశం ఉండటం విశేషం. ఫ్రాంఛైజీ కోసం కేవలం రూ.1000 చెల్లిస్తే లైఫ్ టైమ్ ఫ్రాంఛైజీ లభిస్తుందని, ఎటువంటి రీన్యువల్ ఫీజులు లేవని ఆయన తెలిపారు. సెంటర్ ప్రారంభించడానికి కావాల్సిన పూర్తి గైడెన్స్, టెక్నికల్ సపోర్టు శిక్షణా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సువర్ణావకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు , కొత్త వ్యాపారాన్ని ఆరంభించాలని భావించే వారు తప్పక వినియోగించుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9441126340 నంబర్ నందు సంప్రదించాలని ఆయన కోరారు.

## అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధులు విడుదల - ఏవో సరిత



**వేటపాలెం, నవంబర్ 19, ప్రభాతవార్త**

స్థానిక చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం అన్నదాత సుఖీభవ రెండవ విడత రూ.7వేలు విడుదల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడువర్చువల్‌గా పాల్గొన్న కార్యక్రమం పందిళ్ళపల్లి రైతు సేవ కేంద్రంలో కార్యక్రమం మండల వ్యవసాయాధికారి సరిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షులు పల్లప్రోలు శ్రీనివాసరావు, పందిళ్ళపల్లి సెక్రటరీ మాల్యాద్రి, సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్ సౌజన్య, డిజిటల్ అసిస్టెంట్ ఉష, వెల్ఫేర్ అసిస్టెంట్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మైనంపాడులో రూ.18 కోట్ల 48 లక్షల అన్నదాత సుఖీభవ చెక్కు ఆవిష్కరణ



**సంతనూతలపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో బుధవారం నాడు సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌కు సంబంధించి రెండో విడతగా 18 కోట్ల 48 లక్షల రూపాయలు చేసే చెక్కును రైతులు, అధికారులు, మధ్య ఒంగోలుడివిజన్ వ్యవసాయ వ్యవసాయశాఖ ఏడీఏ బి.రమేష్‌బాబు, నియోజకవర్గ స్పెషల్ అధికారి సీహెచ్ జ్యోతి, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య చైర్మన్ మండవ జయంతిబాబు, సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల వ్యవసాయాధికారిణి ఏ.పావని, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, సర్పంచ్ డి.రమణ, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మొదట తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ప్రధాని నరేంద్ర మోడీ లైవ్ కార్యక్రమంను, కడప జిల్లా కమలాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లైవ్ కార్యక్రమాలను రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వీక్షింప చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో 27,036 మంది రైతులకు 18 కోట్ల 48 లక్షల రూపాయలను ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండలాల వ్యవసాయాధికారులు పావని, భాస్కర్, వెంకటరావు, స్వర్ణలత, తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, బ్రహ్మయ్య, ఎంపీడీవో సురేష్బాబు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్ టీడీపీ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, సిండికేట్ రైతు సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ, మైనంపాడు గ్రామ అభివృద్ధి నాయకులు ఆళ్ల సుబ్బారావు, ఉప సర్పంచ్ గుండవరపు సుబ్బాఆవు, వీర్నో మధు, మండల టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మార్కెట్ కమిటీ డైరక్టర్ కేవీ శ్రీలత, ఎన్ఎస్‌పీడీసీ సంఘం అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు, వ్యవసాయశాఖ గ్రామాల సహాయకులు, టీడీపీ నాయకులు కూకట్ల శరత్‌బాబు,నాదెళ్ల ఆంజనేయులు, శ్రీనివాసరావు,నువ్వుల మీరయ్య,మారెళ్ళ శ్రీనివాసరావు,ఆళ్ల రంగయ్య,బ్రహ్మయ్య,నల్లూరి వెంకటరావు, వై.ఆంజనేయులు, మైనంపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు హరికృష్ణ, పలు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# వారెవ్వా క్యాసవారీ హై..

### - ఒంగోలులో రమ్‌రమ్ మంటున్న మహిళా ర్యాపిడోలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులో 50 మహిళా ర్యాపిడో స్కూటీ డ్రైవర్లు, బ్యాంకు రుణాల ద్వారా స్కూటీలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. మహిళలు, యువతులు,బాలికలు రాత్రి వేళ ఒంటరిగా ప్రయాణించే సమయంలో మహిలలు నడిపే ర్యాపిడో స్కూటీలుఎక్కువగా ఇష్టపడు తున్నారు. నగరాల్లో ప్రయాణమంటే ఆటోలు, లేదా బస్సులు.. అయితే ఇప్పుడు కొత్తకొత్త రవాణా సాధనాలు వచ్చేశాయి.వాటిని ప్రత్యేకంగా ఈ స్కూటీ రవాణా వ్యవస్థ పెద్ద పెద్ద నగరాల నుంచి పట్టణాలకు కూడా విస్తరిస్తోంది. అందులో పురుషులు నడిపే ర్యాపిడో బైక్‌లు ఎక్కాలంటే మహిళలకు కొంత ఇబ్బందికరమే. అయితే ఇప్పుడు ఆ ఇబ్బంది కూడా లేకుండా ఒంటరి మహిళలుఎక్కడికైనా వెళ్ళాలంటే క్షణాల్లో మహిళా ర్యాపిడో డ్రైవర్లు ప్రత్యక్షమై పోతున్నారు. ఇంకేముంది మహిళలే డ్రైవ్ చేసి ర్యాపిడో స్కూటీలు ఎక్కి ఎంచక్కా ఒంటరి మహిలలు ఊరంతా చుట్టేస్తున్నారు. ఇదే తరహాలో ఒంగోలులో 50 మహిళా ర్యాపిడో స్కూటీ డ్రైవర్లు ఇటు సేవలు అందిస్తూ అటు స్వయం ఉపాధి పొందుతూ ఔరా అనిపిస్తున్నారు. ఒంగోలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా సంస్థ ద్వారా యువతులు బ్యాంకు రుణాలు పొంది 50 స్కూటీలు కొన్నారు. మరి కొంత మంది మహిళలు 12 ఎలక్ట్రికల్ ఆటోలు కొనుగోలు చేశారు. ఈ వాహనాలను ర్యాపిడోకు అనుసంధానం చేసి ఔత్సాహిక యువతులను ప్రోత్సహించారు. ఒక్క ఒంగోలు నగరంలో ఇలా మొత్తం 62 మంది యువతులు,మహిళలు స్కూటీలు,ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్నారు. నెలకు 10 నుంచి 20 వేల వరకు సంపాదిస్తున్నారు.ఇక్కడ విశేషమేమంటే ఒంటరిగా ప్రయాణించే మహిళలు,యువతులు,బాలికలు ఒంగోలులోకొత్తగా అందుబాటులోకి వచ్చిన మహిళలు డ్రైవ్ చేసి ర్యాపిడి స్కూటీలను ఎక్కువగా ఇష్టపడు తున్నారు.డ్రైవ్ చేసేది,సవారీ ఎక్కేది ఇద్దరూ మహిళలే కావడంతో ఒంగోలు రోడ్లపై మహిళా ర్యాపిడోలు రయ్ రమ్మని దూసుకుపోతున్నారు. కిలోమీటరుకు 3 నుంచి 5రూపాయల వరకు ఛార్జీలు వసూళ్లు చేస్తున్నారు.ఈ సేవలు అర్ధరాత్రి 12గంటల వరకు అందుబాటులో ఉండటంతో ప్రధానంగా రాత్రి వేళా ఒంటరిగా ఆటోల్లో వెళ్లేందుకు భయపడిన మహిళలు,ఇప్పుడుమహిళా ర్యాపిడోలను చక్కగా వినియోగించుకుంటున్నారు.



## మండలంలో 8871 మంది రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ది



**సంతమాగులూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీ భవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా 8871 మంది రైతులకు రు. 5.581 కోట్లమేర లబ్ది చేకూరినట్లు మండల వ్యవసాయాధికారి షేక్‌సైదా తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోడీలు బుధవారం రైతుల ఖాతాలకు విడుదల చేసిన నిధులు అన్నదాత సుఖీ భవ పథకం కింద 8871 మందికి రు.4.41 కోట్లు, పీఎం కిసాన్ కింద 6850 మందికి రు.1.37 కోట్లు నేరుగా రైతులఖాల్లోకి జమ అయ్యాయన్నారు. మండలంలోని 20 రైతు సేవా కేంద్రాలలో ముఖ్యమంత్రి నిధుల విడదల కార్యక్రామాన్ని రైతులతో కలసి అధికారులు వీక్షించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వనయవసాయాధికారి షేక్ సైదా, మండల అభివృద్ధి అధికారి జ్యోతిర్మయి, తాహశీల్దార్ కె.రవిబాబు, అన్ని గ్రామసచివాలయాల రైతు సహాయక సిబ్బంది రైతులు పాల్గొన్నారని తెలిపారు.

### గ్రంధాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి ఘన నివాళి



**సంతమాగులూరు ,నవంబర్ 19, ప్రభాతవార్త**
సంతమాగులూరు శాఖా గ్రంధాలయంలో స్వర్గీయ భారత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరా గాంధీ . జయంతి సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి గ్రందాలయ పాలకుడు బాదం విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రందాలయ వారోత్సవాలు ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, ముగ్గులపోటీలు, కుర్చీలాటలు నిర్వహియారు.

**నేడు వారోత్సవాలు ముగింపు :**
వారోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం గత వారంరోజులుగా విద్యార్థులకు జరిగిన పోటాలలో విజేతలకు బహుమతులు ఆహ్వానితుల ద్వారా అందజేయడం జరుగుతుందని బాస్కరరెడ్డి తెలిపారు.

## కొత్తపాలెం పోలేరమ్మ ఆలయంలో గంటలు హుండీ చోరీ



**బల్లికురవ, నవంబర్ 19, ప్రభాతవార్త**
మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని గుడి గంటలు హుండీలను దొంగలు అపహరించారు. ఆ పక్కనే ఉన్న అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీని సైతం ఎత్తుకెళ్లారు. సమీపంలోని రహదారి పక్కనే దీన్ని పడవేశారు. ఆలయ పూజారి మంగళవారం రాత్రి యధావిధిగానే తలుపులు వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చిల్లర దొంగల ఆట కట్టించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై నాగరాజు అన్నారు. పని చేయని కర్మాగారాలలో కేబుల్ వైర్లు, గుడులలో గంటలు కోడిపుంజులు దొంగతనాలు చిల్లర దొంగల పనేనని త్వరలో వీరిని వీరిని గుర్తించి ఆట కట్టిస్తామన్నారు.

### సంక్షేమ హాస్టల్ పక్కా భవనాలు నిర్మాణం కొరకు స్థల సేకరణ అధికారులు చేయాలి

**- ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి**



**వెలిగండ్ల, నవంబర్ 19, ప్రభాతవార్త**
వెలిగండ్లలో ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్లో పక్కా భవనాలు నిర్మించుటకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని సేకరించాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామన మహాలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ వెలిగండ్లలో సంక్షేమ హాస్టళ్ల చాలా సంవత్సరాల నుంచి ప్రైవేటు భవనాల్లో నడుపుతున్నారని సరైన సౌకర్యాలు లేవు. కాబట్టి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించుటకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని అధికారులు స్థలాన్ని త్వరగా సేకరించాలని ఎమ్మెల్యే అన్నారు. విద్యుత్ శాఖ వారు రైతులకు సేవ చేయాలి అలా కాకుండా వేరే రకంగా వారిని ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆ విధంగా జరిగితే వారిపై చర్యలు తప్పక తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రభుత్వ భవనాలు మంజూరు చేస్తే అవి తప్పక నిర్మించేటట్లు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా ఏ ఒక్క భవనం నిర్మించకుండా వెనక్కి వెళ్ళటం జరగకూడదని ఆయన సభా ముఖంగా అన్నారు. మోటుపల్లి, జాళ్ళపాలెంలో సచివాలయం నిర్మించుటకు సర్పంచ్‌లు, రెవెన్యూ అధికారులు స్థలాన్ని సేకరించాలని ఎమ్మెల్యే అన్నారు. కనిగిరి నుండి వెలిగండ్ల వరకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని సీఎస్‌పురం బస్సులు వెలిగండ్ల మీదుగా కనిగిరి మళ్లించాలని వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సర్వీసులు ఎక్కువగా పెంచే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఆర్టీసీ డీఎం హాజనరు కావాలని అలా కాకుండా సాధానం చెప్పలేని ఉద్యోగులు హాజరైతే సభలో అడిగే ప్రశ్నలకు ఎవరు జాబు చెప్తారని ఎమ్మెల్యే అన్నారు. వెలిగండ్లలో నిరుద్యోగ యువత కోసం ఐటీ శాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడి కంపెనీలు తీసుకురావడానికి సహకరిస్తానని ఇక్కడ రైతులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే అన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు వై.భారతి, తాతపూడి సుగుణ, ఎంపీడీవో గంగాధర్, తహాసీల్దార్ వాసు, ఏవో శిల్ప, పశు వైద్యాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ పవన్, పంచాయతీ రాజ్ బ్రహ్మయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుక



**జరుగుమల్లి, నవంబర్ 19, ప్రభాతవార్త**
జరుగుమల్లి గ్రంధాలయం నందు 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆరవ రోజు మహిళా దినోత్సవం సందర్భంగా స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు వి.విజయ లక్ష్మీ, డి.ధనలక్ష్మీ, ఎస్‌కే షకీరాబేగం, ఏ.అనంతలక్ష్మీ, కే.ఆశా లత, కే.అమరేశ్వరి, పి.ప్రవంతి, ఏవీ రాములమ్మ, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తదుపరి గ్రంధ పాలకురాలు చేతుల మీదుగా మహిళలకు బహుమతులు ఇవ్వడం జరిగింది.

## అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలి

**- ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి**



**వెలిగండ్ల, నవంబర్ 19, ప్రభాతవార్త**
అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పౌష్టికాహారంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ఏ రోజుకారోజు పిల్లల బరువులను చూస్తూ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అంగన్‌వాడీ పాఠశాలలు కాన్వెంట్ స్కూళ్లకు సమానంగా ఆంగ్ల బోధన చేయాలని తెలిపారు. ఏమైనా సమస్యలు తన దృష్టికి తెస్తే అవి పరిష్కరించే విధంగా చేస్తానన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల కేంద్రాల్లో స్థలాలు ఇస్తానని గతంలో చెప్పి ఉన్నానని ఆ మాటలను త్వరలో తప్పక నెరవేరుస్తానని అన్నారు. జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి తెలిపిన విధంగా ఐసీడీఎస్ ప్రాజెక్టులో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడానికి అధికారులకు సూచించి త్వరలో పూర్తి చేయిస్తానన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫ్రీ స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఆశాబేగం,ఎంపీపీ రామన మహాలక్ష్మి,జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, సర్పంచ్ తాతాపూడి సురేష్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ రైతుల జాబితా విడుదల




**బల్లికురవ, నవంబర్ 19, ప్రభాతవార్త**
అన్నదాత సుఖీభవ ప్రధానమంత్రి కిసాన్ రెండవ విడత నగదు రైతుల ఖాతాలకు విడుదల సందర్భంగా బుధవారం మండలంలోని గుంటుపల్లి గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద రైతుల జాబితా విడుదల చేశారు. మండలంలోని 9150 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా రూ.4.58 కోట్లు, ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా 8367 మంది రైతులకు 1.67 కోట్లు వారి యొక్క బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం బుధవారం జమ చేసింది. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జి మల్లినీడి గోవిందరావు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే అన్నదాతల కుటుంబాలలో ఆనందమే లక్ష్యంగా మహాకూటమి ప్రభుత్వం రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 రైతులకు రెండు విడతలుగా 6310 కోట్ల సాయం అందించారంటే అన్నదాతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత వెన్నుదన్నుగా ఉంటున్నాయో, ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రైతు కుటుంబంలోనూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రవి నాయక్, వీఆర్వో అశోక్, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి**

**- నియోజకవర్గంలో 42303 మంది రైతులకు 28.42 కోట్ల నిధులు విడుదల**



**వెలిగండ్ల, నవంబర్ 19, ప్రభాతవార్త**
రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని శాసనభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం వెలిగండ్లలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఏడాదికి 6000 మూడు విడతలుగా, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పేరుతో ఏడాదికి రూ.14000 రూపాయలు మూడు విడతలుగా ఇస్తున్నారని తెలిపారు. ఈ పథకం కింద కనిగిరి నియోజకవర్గంలో ఆరు మండలాలకు 42300 మంది రైతులకు గాను అన్నదాత సుఖీభవ పథకం కింద 21.15 కోట్లు, పీఎం కిసాన్ కింద 7.27 కోట్లు అన్నారు. మొత్తం 28.42 కోట్లు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఈ మొత్తం రైతుల ఖాతాలో జమైనట్లు వారు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నా వంతు కృషిగా గడచిన 18 నెలల కాలంలో 600 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందని అన్నారు. ఎంతో కాలంగా నిలిచిపోయి ఉన్న హైవే రోడ్డు నిర్మాణం ద్వారా నియోజకవర్గ కేంద్రమైన కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడం అయిందని అన్నారు. ఎన్నికల యువతకు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని యువతకు నియోజకవర్గంలోనే ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రిని, లోకేష్‌ను అభ్యర్థించి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో బయోగ్యాస్ ప్లాంట్‌తో పాటు, ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు కృషి చేశానన్నారు. అలాగే ఎంతో కాలంగా నిలిచిపోయి ఉన్న గన్నవరం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు తన వంతు కృషి చేస్తూనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, జిల్లా బీసీ అధికార గవదకట్ల హరికృష్ణ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అక్కి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు బొబ్బా రమణారెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, మండల రైతు అధ్యక్షులు కీసర రమణారెడ్డి, కర్ణాటక భాస్కర్‌రెడ్డి, సాన జయపాల్‌రెడ్డి, ఒంగోలు శ్రీనివాసులు, ఏరువ చెంచిరెడ్డి, మినిగ కాశయ్య, పిన్నిక బాల కోటయ్య, బొబ్బ తిరుపతిరెడ్డి, సోము చౌడారెడ్డి, చిలకల వెంకటేశ్వరరెడ్డి, బొబ్బ రమణారెడ్డి, గంజి రాజశేఖర్‌రెడ్డి, సంపత రాజ గోపాల్, గజ్జల రమణారెడ్డి, గజ్జల లక్ష్మణ్‌రెడ్డి, అక్కే వెంకట రమణ, మాజీ సర్పంచ్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు షరీఫ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బొబ్బా రమణారెడ్డి, మండల రైతు అధ్యక్షులు కేసరి రమణారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ ఎంతో ప్రాముఖ్యమైంది

**- భవిత సెంటర్‌ను తనిఖీ చేసిన విద్యాశాఖాధికారి వెంకట భాస్కర్**



**పుల్లలచెరువు, నవంబర్ 19, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రతి సోమవారం, బుధవారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎం.వెంకట భాస్కర్ అన్నారు. స్థానిక భవన కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు ను డాక్టర్ అంకారావు ఆధ్వర్యంలో నిర్వహించ బడింది. ఈ క్యాంపుకు వివిధ గ్రామాల నుంచి పది మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. ఎంఈఓ ఫిజియోథెరపీ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఫిజియోథెరపీ, ట్రాన్స్‌ఫోర్ట్ అల్వెన్స్, గర్ల్స్ స్టైఫండ్ అకౌంట్ నందు జమ అయ్యాయని ఆయన తెలిపారు. అంతే కాకుండా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఏర్పాటు చేయబడినదే భవిత కేంద్రం అని అన్నారు. ఈ కేంద్రంలో సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యను అందించడంతో పాటు, వారి మానసిక, శారీరక ఎదుగుదలకు సహాయం చేస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు వసతులు, అవసరమైన స్టడీ మెటీరియల్స్, ఫిజియోథెరపి వంటి సదుపాయాలను కల్పిస్తారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పూర్ణయ్య, అల్లూరి శ్రీను, ఐఈఆర్పీ రంజిత్, పాఠశాల సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో ఇందిరా గాంధీకి ఘన నివాళి



**నాగులుప్పలపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడులోని శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా 6వ రోజు మహిళా దినోత్సవంను పురస్కరించుకునిమాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని గ్రంధాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రంధపాలకుడు ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జే.మోహన్‌లక్ష్మీ, తెలుగు ఉపాధ్యాయురాలు కే.సునీత, పి.పుష్పలత, ఎలిమెంటరీ స్కూల్ ఉపాధ్యాయురాలు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఇందిరాగాంధీ నాయకత్వం, దేశ అభివృద్ధిలో ఆమె పాత్ర, మహిళా సాధికారిత కోసం ఆమె తీసుకున్న చర్యలు వంటి అంశాలపై ప్రసంగించి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అనంతరం బాలికల కోసం మహిళా సాధికారిత అనే అంశంపై వ్యాసరచన పోటీనిర్వహించగా విద్యార్థినులు చురుకుగా, ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను రాశారు. ఆ తరువాత వినోదాత్మకంగా కుర్చీల పోటీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

### గోదా రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి దేవస్థానంలో దీపాలంకరణ సేవ



**నాగులుప్పలపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**
మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న కేశవ క్షేత్రం అయిన గోదా రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి దేవస్థానంలో దీపాలంకరణ సేవ జరిగింది. గ్రామ భక్తులు, ప్రజలు పాల్గొని దీపాలంకరణ సేవను జయప్రదం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రలయ్యారని అర్చక స్వామి ఎన్వీఎస్ పవన్ కుమార్ అచార్యులు తెలియజేశారు.

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు విడుదల



**హనుమంతునిపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**
పెట్టుబడి సహాయం కింద రైతులకు అందించే అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండవ విడత నిధులను మండలంలోని 6542 మంది రైతులకు ఒక్కొక్కరికి 7 వేలు చొప్పున 4 కోట్ల 44 లక్షల రూపాయలను వారి బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం బుధవారం నాడు విడుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి వనమా రవి కుమార్ తెలిపారు. ఈ పథకానికి జులై 31వ తేదీ లోపు అర్హత పొందిన రైతులకు రెండవ దఫా నిధులను ప్రస్తుతం మంజూరు చేయడం జరిగిందని, జులై 31వ తేదీ తర్వాత అర్హత పొందిన రైతులకు మూడవ విడతలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నగదు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని అన్ని రైతు సేవ కేంద్రాలలో ప్రదర్శించి రైతులకు తెలియజేశారన్నారు. అర్హత కలిగిన పథకం యొక్క లబ్ది పొందని రైతులు వారి సమస్యల పరిష్కారంకు గ్రామ వ్యవసాయ సహాయకులను లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సందర్శించవచ్చని తెలిపారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



**హనుమంతునిపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**
మండల పరిధిలోని సీతారాంపురం సచివాలయాన్ని ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల కోసం ప్రతి రోజు ఎన్ని అర్జీలు వస్తున్నాయని, ఎన్ని అర్జీలు పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మహిళా పోలీసు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

### నల్లగండ్లలో కోటి సంతకాల సేకరణ



**హనుమంతునిపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు హనుమంతునిపాడు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ గురు ప్రసాద్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కస్తాల బాలాజీ తదితర మండల నాయకుల సూచనలతో బుధవారం మండల పరిధిలోని నల్లగండ్ల గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ బత్తుల శ్రీనివాసరెడ్డి, హనుమంతునిపాడు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వేసపోగు సుందర్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయడం వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల వైఎస్సార్‌సీపీ సెక్రటరీ యోహాషువ, సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ విజయరాజు, విక్టర్ నాగరాజు, చిన్న బబు, ప్రసంగి ఏసులు, యాకోబు, దానియేలు, జైపాల్, బెన్నీ, ఏప్రియం, లాజర్, కళ్యాణ్, నాని, లక్కీ, ఇస్సాకు, అభి, దేవసహాయం, చిట్టిబాబు, మనోజ్, డాని జాకబ్, ఏబ్లేస్, జాను, దాసు, ఇశ్రాయేలు, బాలకోట పౌలు, చిన్న పౌలు, లక్ష్మయ్య, యోహాను, పోలయ్య, ఏసేబు, గంగయ్య, రోశయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వరం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్

**- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**మార్టూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
రైతు జీవితానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ- పీఎంకిసాన్ పథకాలు వేలాది కుటుంబాలకు వరంగా మారాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మార్టూరు మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి రైతులతో ముచ్చటించారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రకృతి సేద్యం అవగామన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకు కూరలు, కూరగాయల స్టాల్‌ని పరిశీలించి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. సబ్సిడీపై రైతుకు మినీ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే అందజేశారు. స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరా సంస్థ ఆధ్వర్యంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. మొక్కజొన్న పంటకు మద్దతు ధర ఉందని, రైతులు అధైర్య పడకుండా సాగు చేయాలన్నారు. నియోజకవర్గంలో 37,861 మంది రైతులకు గాను, రూ.25.83 కోట్ల రూపాయలు ఈ పథకం ద్వారా లబ్ది జరిగిందని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వం ఎంతో పవిత్రంగా బాధ్యతగా ఈ ఫ్రోగ్రాం చేస్తుందని తెలిపారు. రైతుల కష్టాలు కొంతైనా తీర్చేందుకు రైతులకు చేదోడు వాదోడుగా ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రైతు బాగుంటేనే దేశం, రాష్ట్రం బాగుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని, అందువల్లే రూ.100 కోట్ల విలువ చేసే పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చొరవ చూపారని ఎమ్మెల్యే ఏలూరికి తెలిపారు. ఇంకా మిగిలిన కొంత పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గోడౌన్‌లలో ఖాళీ లేకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో ఆయిల్ ఫామ్ పంటకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, అందుకు మార్టూరు, బల్లికురవ మండలాలు ఈ పంటకు అనుకూలంగా ఉన్నాయన్నారు. మన ప్రభుత్వం వచ్చిన వంఎటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశామని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మార్టూరు మండలానికి ఆయిల్ ఫామ్ పంటకు ప్రోత్సాహకం ఇచ్చేలా అనుమతులు ఇచ్చిందన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలు ఇవ్వటంతో పాటు 90 శాతం డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ ఇవ్వడం, 50 శాతం ట్రాక్టర్ సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని, వ్యవసాయ అధికారులు రికార్డు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. రైతు ఒక్కరు కూడా నష్టపోకుండా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, మార్కెఫెడ్ డీఎం కరుణ, ఏడీఏలు సుదర్శన్‌రావు, ప్రవీణ, ఎంఆర్ఓ ప్రశాంతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ హనుమంతు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, రంగయ్య చౌదరి, నాయుడు హనుమంతరావు, పీఏసీఎస్ చైర్మన్ హనుమంతరావు దాసరి, నాయకులు ఆదినారాయణ, రజాక్ జనార్ధన్, ఫారుక్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వలపర్ల గ్రామంలోని పాఠశాలలు తనిఖీ



**మార్టూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
వలపర్ల గ్రామంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి ఎంసీహెచ్ వస్రామ్ నాయక్ ఆధ్వర్యంలో మండల అకాడమిక్ ఫోరమ్ తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు నిపుణులు పాఠశాలలోని వివిధ అంశాలను, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. తదుపరి పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలన చేసి, పాఠశాల సిబ్బందికి తగు సూచనలు చేశారు. సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2కే.ప్రేమలత, జి.కళ్యాణి, సీహెచ్ శ్రీరామ్మూర్తి, బి.నాగేశ్వరరావు, శేషగిరి, బి.యోహాషువ, కే.రామాంజనేయులు, పాఠశాల హెచ్ఎం కే.మధుసూదనరావు, సీఆర్పీ టి.తిరుపతమ్మ, పాల్గొన్నారు.

## టీచ్ టూల్ ట్రైనింగ్ ముగింపు



**ముండ్లమూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
జడ్పీహెచ్ఎస్ ముండ్లమూరు నందు నవంబర్ 18,19వ తేదీలలో టీచ్ టూల్ రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమం ఉదయం 9.30గంటలకు నుండి సాయంత్రం 5.30 గంటలకు జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 27 మంది టీచ్ టూల్ అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా మండల విద్యాశాఖ అధికారి షేక్ కాలేషావలి, రిసోర్స్ పర్సన్స్‌గా షేక్ మస్తాన్ భాష, నూకతోటి అరుణ కుమారి వ్యవహరించారు. గతంలో టీచ్ టూల్ శిక్షణ తొమ్మిది రోజుల పాటు పొందిన వారికి ప్రస్తుతం రెండు రోజుల ట్రైనింగ్ జరుగుతుందని ఎంఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని 3 పీరియడ్స్, 9 ఎలిమెంట్స్, 26 బిహేవియర్స్‌ను క్లాస్ రూమ్‌లో ఏ విధంగా పరిశీలన చేయవచ్చో రిసోర్స్ పర్సన్స్ వివరించారు. ఈ రెండు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రౌండ్ లెవల్‌లో అమలు చేసి ఉపాధ్యాయులలోని నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులను తీర్చిదిద్ది విద్యావిధానం మన మండలాన్ని అగ్ర స్థానంలో నిలబెట్టాలని ఎంఈఓ షేక్ కాలేషావలి ట్రైనింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ముండ్లమూరు ప్రధానోపాధ్యాయులు ఎల్.మాధవిలత, జడ్పీహెచ్ఎస్ ఉమామహేశ్వరపురం ప్రధానోపాధ్యాయులు బి.మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు ట్రైనింగ్ జరిగిన విధానం సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఫీల్డ్ లెవల్లో అమలు పరుస్తామని తెలియజేశారు.

7_7.qxd 11/20/2025 12:13 AM Page 1



## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 6 వ రోజు




**అద్దంకి , నవంబరు 19, ప్రభాతవార్త**

అద్దంకిలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా బుధవారం అద్దంకి గ్రంధాల శాఖలో 6వ రోజు మహిళా దినోత్సవం కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళలు అన్ని రంగాల నుండి వచ్చిన మహిళలు గ్రంథాలయం పట్ల వారుకున్న అభిరుచి, గ్రంథాలయాలు అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమమునకు రచయిత్రి,విశ్రాంత భారతీయ స్టేట్ బ్యాంకు ఉద్యోగిని పాలపర్తి జ్యోతిష్మతి అధ్యక్షత వహించినారు. భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. సింగరకొండ ప్రసన్న ఆంజనేయ స్వామి టెంపుల్ పాలకమండలి సభ్యురాలు ధూళిపాల వెంకటరత్నం మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో ఇప్పటివరకు గ్రంథాలయ భవనం లేకపోవడం మన దురదృష్టమని త్వరలోనే మనరాష్ట్ర విద్యుత్‌శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ చొరవతో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించుకుంటామని, ఏ రంగంలో రాణించాలన్న చదువే ఆయుధమని ఆమె అన్నారు. వాసవి వనిత క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ గ్రంధి నాగరాజ కుమారి గారు మాట్లాడుతూ నేడు మహిళలు ప్రతి రంగంలో ముందుకొస్తున్నారని అందుకు పోటీ తత్వమే ముఖ్య కారణమని ఇస్రో, రక్షణ రంగా లాంటి శాఖలలో కూడా పనిచేస్తున్నారంటే ధైర్య సాహసాలలో ఎవరికి తక్కువ కాదు అని చదువు పట్ల ఇంకా శ్రద్ధ చూపి రాబోయే రోజుల్లో అన్ని రంగాలలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని, భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ధైర్య సాహసాలు మహిళలకు ఆదర్శమని అన్నారు. ఈరోజు కార్యక్రమంలో ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల నుండి విద్యార్థినులు పాల్గొనగా వారికి గ్రంథాలయాలు ఉపయోగాలు పై వ్యాసరచన పోటీ పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా మహిళలు బాలికలు అందరికీ కూడా కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఒక్కరికి ఉసిరి, తులసి, నందివర్ధనం మొక్కలను, ప్రోగ్రాం ఆర్గనైజర్, పర్యావరణ ప్రేమికులు మన్నం త్రిమూర్తులు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి గ్రంథాలయ శాఖ అధికారి సిఎల్‌వి వసుంధర దేవి, మున్సిపల్ కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ, ఎక్స్ కౌన్సిలర్ కాకాని అమృతలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, వరలక్ష్మి, కాకుమాను అంజలీదేవి, సిహెచ్ అంజలీదేవి,నక్క కెర్జియారాణి, చిలుకూరి విజ్ఞాన్ గ్రేసి, బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**సింగరాయకొండ, నవంబర్ 19,ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థిని చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి జి.మధుసూదన్‌రావు సూచించారు.బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి జి. మధుసూదనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ల్యాబ్ రికార్డులను, చికిత్సా విభాగాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో డాక్టర్ ఆయేషా ఆధ్వర్యంలో జరుగుతున్న మెడికల్ క్యాంపును సందర్శించారు.విద్యార్థులకు సీజనల్ వ్యాధుల నిరోధక చర్యలు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ నెల 17 నుంచి 30 వరకు జరగనున్న జాతీయ కుష్ఠ నివారణ దినోత్సవంపై విద్యార్థులకు వివరాలు అందించారు. భోజనానికి ముందు తప్పనిసరిగా పాటించాల్సిన హ్యాండ్ వాష్ ప్రాక్టీస్‌ను విద్యార్థులకు చూపించారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రత అంశాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. రమాదేవి, కమిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య, ఆరోగ్య పరిరక్షకులు సయ్యద్ మసూద్ అలీ,ఆరోగ్య విస్తరణ అధికారి కళ్యాణి, భాస్కర్, విజయమ్మ, టి. శ్రీనివాసులు, స్టాఫ్ నర్స్ రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెరువుకు సప్లై ఛానల్ ద్వారా నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



**మార్కాపురం, నవంబరు 19, ప్రభాతవార్త**

గుండ్లకమ్మ నది నుంచి మార్కాపురం చెరువుకు నీటిని తరలించే సప్లై ఛానల్‌ను అధికారులు మూసివేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవాండ్ల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కాపురం చెరువు అలుగు ద్వారా బోడపాడు గ్రామ చెరువుకు నీరు చేరే అవకాశం ఉన్నప్పటికీ, గుండ్లకమ్మ వద్ద సప్లై ఛానల్ గేట్లను మూసివేయడంతో మార్కాపురం చెరువుకు నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. ఫలితంగా బోడపాడు చెరువుకు నీరు చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ కారణంగా గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని వెంటనే సరిచేయడానికి గుండ్లకమ్మ గేట్లను తక్షణం తెరచి సప్లై ఛానల్ ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించాలని, దాంతో బోడపాడు చెరువును నింపేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని వినతిపత్రం ద్వారా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య, మండల అధ్యక్షుడు ఒర్సు అడివయ్య, మండల కార్యదర్శి గంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బోడపాడు గ్రామస్థులు రూపనగుడి శ్రీనివాసరెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, సీపీఎం మార్కాపురం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం



**మార్కాపురం, నవంబరు 19, ప్రభాతవార్త**

మార్కాపురం ఆర్‌టిఓ చందన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఓం సాయి విద్యానికేతన్ విద్యార్థినులు ఆర్‌టిఓ అధికారులను సన్మానించడం జరిగింది. స్థానిక ఓం సాయి వికాస్ విద్యానికేతన్ 7, 8, 9 తరగతుల విద్యార్థినులు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఆర్‌టిఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆర్‌టిఓ చందన, వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావును కలిసి వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఓ చందన మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థినీ సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకొని, జీవితంలో ఒక గోల్ సెట్ చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఒక స్త్రీ ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కుటుంబంలోని తల్లిదండ్రులు, అన్నదమ్ముల ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి రాధారాణి, ఉపాధ్యాయినీ బృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయినీ బృందాన్ని పాఠశాల కరస్పాండెంట్ పీవి శ్రీనివాసరావు ప్రశంసించారు.

## బెడుసు పల్లె గ్రామంలో స్వామిత్వ ఫేస్ - 2 గ్రామసభ



**కొమరోలు, నవంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో బుధవారం స్వామిత్వ ఫేస్ -2 గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీవో సానికొమ్ము సత్యంమాట్లాడుతూ గ్రామకంఠం భూముల పై యజమానులకు ఎలాంటి హక్కు లేకపోవడం, రిజిస్ట్రేషన్లు కాకపోవటం, బ్యాంకులు లోన్లు ఇవ్వకపోవడం తదితర సమస్యలపై ప్రభుత్వం స్వామిత్వ అనే రీసర్వే ప్రాజెక్ట్ ద్వారా గ్రామకంఠ భూములను హక్కు కల్పించి యజమానికి అందుకు సంబంధించిన భూ హక్కు పత్రాలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామసభలో యజమానుల ఆస్తుల వివరాలు చదివి వినిపించి,అభ్యంతరాలు, అంగీకార పత్రాలు పొందడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభలో సర్పంచ్ బోయిళ్ళ కాశమ్మ, వీఆర్వో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగంపల్లెలో స్వామిత్వ గ్రామసభ



**కొనకనమిట్ల, నవంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని నాగంపల్లి గ్రామ పంచాయతీ యొక్క స్వామిత్వ గ్రామ సభ బుధవారం జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.ఈశ్వరమ్మ పర్యవేక్షణలో ఈ సభ నిర్వహించారు. స్వామిత్వకు సంబంధించిన అంశాలపై ఆమె మాట్లాడారు.ఈవోఆర్డీ శ్రీదేవి, పంచాయతీ అధికారి తిరుపతి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిజిటల్ వ్యవసాయంపై అవగాహన సదస్సు



**సీఎస్‌పురం, నవంబర్ 19, ప్రభాతవార్త**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం 2025 కార్యక్రమంలో భాగంగా బుధవారం శీలంవారిపల్లి గ్రామంలో డిజిటల్ వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. అందులో భాగంగా వ్యవసాయానికి సంబంధించిన వివిధ మొబైల్ అప్లికేషన్స్ ఎలా ఉపయోగించుకోవాలి, తద్వారా వివిధ సాగు, ఇతర మార్కెటింగ్ పద్దతులు, వివిధ ప్రభుత్వ పథకాలను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మధుబాబు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ పి.స్టెఫీ, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పీవీపల్లి సచివాలయం ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో



**పుల్లలచెరువు, నవంబర్ 19, ప్రభాతవార్త**

సచివాలయంలో తనిఖీలో భాగంగా పిడికిటి వానిపల్లి సచివాలయంను బుధవారం ఎంపీడీవో సంజీవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజు విధుల్లోకి వచ్చే సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రతి ఒక్కరు టైంకు హాజరు కావాల్సిందేనని ఆయన ఘాటుగా హెచ్చరించారు. అలాగే సచివాలయం పరిధిలో పెండింగ్‌లో ఉన్న సిటిజన్ ఈకేవైసీ, బయోమెట్రిక్, కౌసల్యం సర్వే, హౌస్ టాక్స్ కలెక్షన్, స్వామిత్వ పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా పెండింగ్ ఉన్న అన్ని సర్వేలను వెంటనే పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ఇంటి పన్ను, ఇతర పన్నులను సకాలంలో వసూళ్లు చేయాల్సిందిగా ఆదేశించడమైంది. గ్రామ పరిధిలో ఉన్న అన్ని గృహములను కొలతలునిర్వహించి సరియైన హద్దులు ఏర్పరిచి గృహ యజమానులకు సమిత్వ కార్డ్స్ ఇవ్వడానికి పూర్తి రికార్డ్ త్వరగా తయారు చేయాల్సిందిగా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే శానిటేషన్ కార్యక్రమంలో సకాలంలో అనగా ఉదయం 9గంటల లోపల పూర్తి చేయాల్సిందిగా ఆయన కోరారు. ప్రతి రోజు మంచినీటి సోర్స్ వద్ద క్లోరినేషన్ చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. సచివాలయం సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజలకు సక్రమంగా అన్ని ప్రభుత్వ సర్వీసులను అందించాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం వెళ్లే భక్తులకు దోర్నాలలో వసతి సౌకర్యాలు ఏర్పాటుకు స్థల పరిశీలన



**పెద్దదోర్నాల, నవంబర్ 19, ప్రభాతవార్త**

శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పోతుగంటి రమేష్ నాయుడు ప్రత్యేక చొరవతో టీటీడీ ఈవో తో సంప్రదింపులు జరిపి ఆయన సూచనల మేరకు శ్రీశైలం వెళ్లే భక్తులకు మరింత సౌకర్యాలు అందించేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఈ క్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి కమిటీ సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి బుధవారం దోర్నాల సందర్శించి భక్తుల వసతి సదుపాయాల ఏర్పాటుకు అనుకూలమైన శ్రీశైలం దేవస్థానం చెందిన భూములను పరిశీలించారు. అన్ని సదుపాయాలతో కూడిన వసతుల సౌకర్యాలను దోర్నాలలో ఏర్పాటు చేస్తే శ్రీశైలం వెళ్లే భక్తులకు శ్రేయస్కరంగా ఉంటుందని భావించిన సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి ఏమి చేస్తే బాగుంటుందనే విషయాలను పరిశీలించి టీటీడీ ఈవో, శ్రీశైలం ట్రస్టు బోర్డు చైర్మన్ తో చర్చించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రస్టు బోర్డు కమిటీ సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డితో పాటు శ్రీశైలం దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మొగుళ్ళపల్లె సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**యర్రగొండపాలెం, నవంబర్ 19, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి మరణించగా పార్థివ దేహానికి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వెంకటేశ్వరరెడ్డి లాంటి మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి, మాజీ సర్పంచ్ ఒంగోలు మూర్తిరెడ్డి, మాజీ ఎంపీపీలు బాల గురవయ్య, విజయభాస్కర్, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గురిజేపల్లిలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం

### ముఖ్యమంత్రి నిధుల విడుదల కార్యక్రమం ప్రత్యక్ష వీక్షణం




**యర్రగొండపాలెం, నవంబర్ 19, ప్రభాతవార్త**

రైతులకు పంట పెట్టుబడి సహాయంగా అందిస్తున్న అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రెండో విడత నిధులు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ ప్రభుత్వం జమ చేయనుంది. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, ఏపీ ప్రభుత్వం రూ.5వేలు రైతులకు ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా యర్రగొండపాలెం మండలం గురిజేపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేయనున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసార వీక్షిణం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎరిక్షన్‌బాబు అధికారులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. అనంతరం వ్యవసాయశాఖ వారు యర్రగొండపాలెం నియోజకవర్గంలో విడుదలైన అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ పథకంకు సంబంధించిన డబ్బుల చెక్కును ఇరవై ఆరు కోట్ల ఇరవై ఎనిమిది లక్షల తొంబై ఎనిమిది వేల చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకులు వేగినాటి శ్రీనివాస్, గురిజేపల్లి పార్టీ నాయకులు కందుల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పనులు గుర్తింపుకు గ్రామసభ



**రాచర్ల, నవంబర్ 19 ,ప్రభాతవార్త**

ప్రజల భాగస్వామ్యంతో ఉపాధి పనులను గుర్తించేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నామని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో ఆర్ మహాలక్ష్మి అన్నారు. మండలంలోని ఎడవల్లి గ్రామంలో బుధవారం ఆమె గ్రామసభ నిర్వహించి రైతులతో మాట్లాడారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ గురించి ప్రజలకు వివరించి గ్రామ సభలో గ్రామస్తులు సూచించిన పనులపై చర్చించి తీర్మానం చేస్తామని తీర్మానించిన పనులను చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ జె నాగేశ్వరరావు, రామాపురం సొసైటీ బ్యాంకు చైర్మన్ భవనం పుల్లారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ ఇరగనబోయిన లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి జి.సరస్వతి దేవి, వీఆర్వో ఎస్.రంగయ్య, టిఏకె శ్రీనివాసులు, ఎఫ్ఏ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయండి

**కొండపి, నవంబర్ 19 ,ప్రభాతవార్త**

కొండపి మండల కార్యాలయం ముందు ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ బస్సు ప్రయాణికులు కోరుతున్నారు. కొండపి నుండి టంగుటూరు ఒంగోలు వెళ్లే ప్రయాణికులు బస్ స్టాండ్ వరకు వెళ్లేందుకు ఇబ్బంది పడటంతో పాటు అక్కడికి వెళ్లిన తిరిగి తాసిల్దార్ కార్యాలయం ముందు నుండి వెళ్లడం జరుగుతుందని ప్రయాణికులు తెలిపారు.గతంలో తాసిల్దార్ కార్యాలయం ముందు బస్ షెల్టర్ ఉండేదని అక్కడ నుండే టంగుటూరు ఒంగోలు వెళ్ళు ప్రయాణికులు బస్సు ఎక్కి వెళ్లే వారిని తెలిపారు. ప్రస్తుతం బస్టాండ్ వరకు నడిచి, వెళ్లడం ఇబ్బందికరంగా ఉందని అక్కడ అక్కడకు వెళ్లి బస్సు ఎక్కిన అప్పటికి తాసిల్దార్ కార్యాలయం ముందునుండే వెళ్లడం జరుగుతోందని అన్నారు. కావున ఆర్టిసి అధికారులు పరిశీలించి ప్రయాణికుల సౌకర్యార్థం తాసిల్దార్ కార్యాలయం వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

## టీడీపీ నేత బొమ్మినేని హాకీ క్రీడాకారులకు దుస్తులు, క్రీడా సామాగ్రి పంపిణీ



**సంతనూతలపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం ఎండ్లూరు పంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాధమిక ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి నేత, జిల్లా టీడీపీ నాయకులు బొమ్మినేని రామాంజనేయులు పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిహాకీ పోటీలకు ఎంపికైన సందర్భగా వారికి క్రీడా దుస్తులు, క్రీడా సామాగ్రిని పంపిణీ చేసి, ప్రయాణ ఖర్చులను అందించారు. వీరు ఈనెల 22,23,24వ తేదీలలో తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరగబోయే ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ నాయకులు బొమ్మినేని రామాంజనేయులు ఇరవై జతల క్రీడా దుస్తులు ఎంపికైన ఏడుగురు క్రీడాకారులకు అవసరమైన హాకీ సామాగ్రిని వారికి అవసరమైన ప్రయాణ ఖర్చులను అందజేశారు.పాఠశాల అభ్యున్నతకు పాటుపడుతున్న జిల్లా టీడీపీ నాయకులు బొమ్మినేని రామాంజనేయులను ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషిరెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. టీడీపీ నేత బొమ్మినేని రామాంజనేయులు మాట్లాడుతూ క్రీడాకారులకు స్కూల్ విద్యార్థులకు సంబంధించి అన్ని విధాలుగా అండగా ఉంటానని క్రీడాకారులు భాగా ఆటలు ఆడి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ వంకాయలపాటి ప్రియాంక, మాజీ ఆర్మీ ఉద్యోగి కే.రామారావు, ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తిరుమలశెట్టి రవికుమార్, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సహకార జెండాను ఆవిష్కరించిన సొసైటీ చైర్మన్ విజయమ్మ

### - రూ.30 కోట్లతో సొసైటీతో లావాదేవీలు



**సంతనూతలపాడు, నవంబర్ 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సొసైటీ ఆవణలో 72వ సహకార వారోత్సవాలలో భాగంగా బుధవారం నాడు సహకార జెండాను సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయమ్మ మాట్లాడుతూ సిండికేట్ రైతు సొసైటీ పరిధిలో 30 కోట్ల రూపాయలతో లావాదేవీలు కొనసాగుతున్నట్లు తెలిపారు. సొసైటీ అభ్యున్నతకు ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. సొసైటీ పరిధిలో 12 కోట్ల రూపాయలు మేరకు డిపాజిట్‌లు కలవన్నారు. 15 కోటన లరూపాయలు మేరకు వివిధ రుణాలను అందించినట్లు చైర్మన్ విజయమ్మ వెల్లడించారు. రెండు కోట్ల రూపాయల మేరకు రైతులకు తక్కువ ధరలకు ఎరువులు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా వీటిలో 8 కోట్ల రూపాయల మేరకు బంగారు రుణాలు అందించినట్లు చైర్మన్ విజయమ్మ పేర్కొన్నారు. సొసైటీ ప్రాంగణంలో ముందు వైపున గల వంతెన నిర్మాణానికి ఈ మేరకు ఎస్టిమేట్స్ ఇంజనీరింగ్ అధికారులు వేసినట్టు వారం రోజుల్లో పనులు ప్రారంభం కానున్నట్లు చైర్మన్ విజయమ్మ తెలిపారు. తద్వారా రైతులకు సంబంధించిన ఎరువులను లారీ ద్వారా నేరుగా గోడౌన్‌లోకి వెళ్ళనున్నట్లు ఆమె తెలిపారు. సొసైటీ పరిధిలో 2700 మంది సభ్యులు, 13 గ్రామాల పరిధిలో ఉన్నారన్నారు. సొసైటీని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తమ త్రీ మెన్ కమిటీ ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చైర్మన్ విజయమ్మ వెల్లడించారు. రైతు అభ్యున్నతే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం అభివృద్ధి కమిటీ చైర్మన్ కూకట్ల శరత్‌బాబు, సొసైటీ ఇన్‌ఛార్జి మేనేజింగ్ డైరక్టర్ గోగినేని హేమంత్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్లు మల్లవరపు రామకృష్ణారెడ్డి, పెరుగు రాము, ఒంగోలు సబ్ డివిజన్ కోఆపరేటీవ్ అసిస్టెంట్ రిజిస్టర్ నర్రా సురేంద్రబాబు, టీడీపీ నాయకులు వలేటి తిరుపతిస్వామి, సొసైటీ ఉద్యోగులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసరాలేని అభాగ్యులకు అన్నదానం



**కొండపి, నవంబర్ 19 ,ప్రభాతవార్త**

ఎటువంటి ఆసరా లేని భిక్షాటనతో జీవనం కొనసాగిస్తున్న పలు అనాధలకు మేడికొండ మాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. రిటైర్డ్ ఏఎస్ఐ కీ. శే.మేడికొండ మాలకొండయ్య 5వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడైన హైకోర్టు లాయర్ మేడికొండ కొండలరావు సమక్షంలో టంగుటూరులోని రోడ్లపై భిక్షాటన కొనసాగిస్తున్న అనాధలను గుర్తించి వారికి భోజనంప్యాకెట్లను అందించి వారి ఆకలి తీర్చారు.ఆకలిగా ఉన్నవారికి అన్నదానం ఆహారం అందించడమే భౌతికంగా దూరమైన వారికి మనం అందించే నిజమైన నివాళులు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య సతీమణి యశోదమ్మ కుమార్తె పైనం విజయలక్ష్మి కోడలు రజనీకుమారి చేతుల మీదుగా అన్నదానాన్ని నిర్వహించారు.

## కొత్తపట్నంలో టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్




**కొత్తపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త**

కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగ్ల,బుధ వారాలలో రెండు రోజులు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.ఈ ట్రైనింగ్ కి మాస్టర్ ట్రైనర్‌గా కొప్పోలు కిషోర్ కుమార్ వ్యవహరించారు. రెండు రోజులు ప్రోగ్రాంలో ఉపాధ్యాయులుతో కలిసి చక్కగా నిర్వహించారు. మొత్తం ఉపాధ్యాయులు 25 మంది, మాస్టర్ ట్రైనర్ కొప్పోలు కిషోర్ కుమార్ మండల విద్యాశాఖ అధికారులు 1 2 శ జి. తులసి కుమారి, పద్మావతి ఉన్నారు. మండల విద్యాశాఖ అధికారి తులసి కుమారి మాట్లాడుతూ ఈ టీచ్ టూల్ అందరికీ అందుబాటులో ఉండే సాధారణ తరగతి గది పరిశీలన సాధనం అని తెలిపారు.తరగతి గదులలో బోధనా పద్ధతులు మరియు బోధన నాణ్యత యొక్క ప్రస్తుత పరిస్థితి లోని స్పష్టమైన దృశ్య స్థితిని అందించడానికి రూపొందించబడిన ఒక నిర్దిష్ట విద్యావిధానమే టీచ్ టూల్స్ అని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అత్తోటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ అభ్యాసాలను లక్ష్యంగా చేసుకునే కార్యక్రమం యొక్క ఫలితాలను అంచనా వేయడానికి పర్యవేక్షణ మరియు మూల్యాంకన సాధనంగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. వ్యక్తిగత ఉపాధ్యాయ సామర్థ్యాలు, బలహీనతలను గుర్తించడానికి మరియు ఉపాధ్యాయుల లక్ష్యాలకు సహకారం అందించడానికి వృత్తిపరమైన ఈ రోజు అభివృద్ధిలో భాగంగా కూడా ఉపయోగపడు తుందన్నారు.జిల్లాలో 24నుంచి ప్రతి పాఠశాలలో టీచ్ టూల్ అబ్జర్వేషన్ ప్రారంభమవుతాయనీ తెలియజేశారు.జిల్లా విద్యాశాఖ అధికారి అత్తోటి కిరణ్ కుమార్ బుధవారం కొత్తపట్నం మండలం లోని టీచ్ టూల్ ట్రైనింగ్ సెంటర్ ని విజిట్ చేయటం జరిగింది. ఒక గంట ఉండి అబ్జర్వేషన్ చేసి సంతృప్తి వ్యక్తం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహించరాదు



**రాచర్ల, నవంబర్ 19, ప్రభాతవార్త**

సచివాలయం సిబ్బంది విధుల్లో అలసత్వం వహించరాదని ఎంపీడీవో ఎస్ వెంకట్రామిరెడ్డి అన్నారు. రాచర్ల సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని అటెండెన్స్ రికార్డును పరిశీలించి సిబ్బంది వివరాలను స్థానిక కార్యదర్శి ఎంవి నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో 7మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కొందరు లేకపోవడంతో లేనివారు ఎక్కడా అని అడిగి తెలుసుకున్నారు. ఉండేది తక్కువ సిబ్బంది వారు కూడా కార్యాలయంలో అందుబాటులో లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కచ్చితంగా కార్యాలయంలో అందుబాటులో ఉండాలని తెలిపారు. చేయవలసిన పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు గొల్లపల్లి హై స్కూల్ విద్యార్థులు ఎంపిక

### - హర్షం వ్యక్తం చేసిన పాఠశాల సిబ్బంది



**త్రిపురాంతకం, నవంబర్ 19, ప్రభాతవార్త**

డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ లో భాగంగా మార్కాపురంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల యందు గొల్లపల్లి విద్యార్థులు మంచి ప్రతిభను కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనారు. అండర్ 14 బాలికల కబడ్డీ విభాగంలో ఎస్ కల్పన, బాలుర విభాగంలో వై అబ్రహం ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ విధంగా విద్యార్థులు వారి ఆట తీరులో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయికి చేరుకోవడం అభినందనీయమని విద్యార్థులను అభినందించారు. అలాగే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, ఆటలో వారికి తగిన సూచనలు మెలకువలు నేర్పి విద్యార్థులను ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రధాన కారకులైన ఫిజికల్ డైరెక్టర్ ఎస్ రాధాపై ప్రత్యేకంగా ప్రశంసల జల్లులు కురిపించారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ ఎస్ రాధ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరుగుని క్రీడలలో ప్రతిభ కనబరచి రాణించి రాష్ట్రస్థాయికి చేరుకోవాలని సూచించి విద్యార్థులను ఆశీర్వదించి అభినందించారు. ఈ సమావేశంలో పాఠశాల సిబ్బంది, పీఎంసి చైర్మన్, గ్రామస్తులు విజేతలైన విద్యార్థులను ఇందుకు ప్రధాన భూమికను పోషించిన ఫిజికల్ డైరెక్టర్ రాధాను ఎంతగానో అభినందించారు.

8_8.qxd 11/20/2025 12:15 AM Page 1



# మహిళా సేవామూర్తులకు సన్మానం



**ఒంగోలు- ప్రభాతవార్త**
58వ గ్రంథాలయ వారోత్సవాలు , జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం ఎన్నారై గ్లోబల్ ఫోరం ఆంధ్ర ప్రదేశ్ మహిళాభ్యుదయసమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ, సాంస్కృతిక రంగాలలోవిశేష సేవలందిస్తున్న ఇద్దరు మహిళామూర్తులను ఘనంగా సన్మానించారు.సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ గారు మాట్లాడుతూ ఉక్కుమహిళగా పేరుపొందిన మన మాజీ ప్రియతమ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ గారు దేశ మహిళందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలుగు లిపిని కాపాడుకుందాం అనే పేరుతో సూర్యకుమారి భాషను రేపటి తరానికి అందించడానికి స్వచ్ఛందంగా చేస్తున్న సేవలను కొనియాడారు.వేదికను అలంకరించిన ప్రముఖులు కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీమతి సుజాత,మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, న ర సం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి,డాక్టర్ సుధాకర్, ఇన్చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ తదితరులు ప్రసంగిస్తూ జాతికి ఇందిరాగాంధీ అందించిన సేవలను, సన్మాన గ్రహీతలైన లలితా శ్రీనివాస్,మారేపల్లి సూర్యకూమారి తెలుగు భాషకు చేస్తున్న సేవలనుప్రశంసించారు. అనంతరం విశిష్ట సేవామూర్తులుశ్రీమతి మారేపల్లి సూర్యకూమారి, శ్రీమతి లలితా శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు.

## శివం శరణాలయంలో బౌద్ధ భిక్షువులు బౌద్ధ హీన్‌చే అన్నదానం
## నిస్సహాయులకు ఆర్థిక సాయం...
### ఘనంగా శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి పుట్టినరోజు వేడుకలు



**ఒంగోలు- ప్రభాతవార్త**
ఒంగోలు సంతపేటలోని శివం శరణాల యంకు విచ్చేసిన శ్రీలంక కు చెందిన బౌద్ధ భిక్షువులు బౌద్ధహాన్‌కు శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీదేవి వేద పండితులుచేపూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడిశ్రీహరి జన్మదిన సందర్భంగా బౌద్ధీ హీన్, పారిశ్రామికవేత్త మండవమురళీకృష్ణల ఆధ్వర్యంలో శ్రీహరి పుట్టినరోజు వేడుకలు శివం శరణాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధహిన్ మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా నిరుపేదలకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండవమురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీహరి ఆకలి కడుపులు ఆమడ దూరంలో ఉన్న పసిగట్టి అన్నలా అన్నం పెట్టి ఆదరిస్తున్నాడని పేదల ఆకలి తీరుస్తున్న శివ భక్తుడు శివం ఫౌండేషన్ శ్రీహరి అని ఆయన చేసే సేవా కార్యక్రమాల్లో నా సహకారం ఉంటుందని తెలిపారు వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శివం ఫౌండేషన్ శ్రీహరి మాట్లాడుతూ సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను .అనాధలకు మానవతా హృదయంతో సేవ చేయడం నా అదృష్టం మానవసేవే మాధవ సేవగా భావించి అనాధలకు వృద్ధులకు అంకితభావంతో సేవ చేస్తున్నాను నా జీవితంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మీ అందరి సహకారంతో సాగాలన్నదే నా జీవిత లక్ష్యం అని తెలిపారు.ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ గొల్లపూడి శ్రీహరి పుట్టినరోజు సందర్భంగా నిస్సయిలైన ఐదు పేద కుటుంబాలకు 40వేల రూపాయలు ఆర్థిక సాయం తోపాటు బియ్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు.వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మిశెట్టి రమాదేవి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు కోసూరి శ్రీదేవి .చౌదరి. రాజ్యలక్ష్మి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త టీచర్స్‌కు సెలవులు మంజూరు చేయాలి

**ఒంగోలు- ప్రభాతవార్త**
నూతన ఉపాధ్యాయులకు లీపు యాపు లో సెలవులు కనిపించక పోవడం వలన కొంత మంది డి.డి.ఓలు మంజూరు చేయ నందున తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని, సంబందిత అధికారులు వారికి అర్హత గల సెలవులు మంజూరు కొరకు తగిన చర్యలు తీసుకోవాలని ఎ.పి.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటరావు, గౌరవాధ్యక్షులు ఎ.అమ్మయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి యన్. లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.కీర్తి ,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ కుమార్, ఐఫియా కౌన్సిలర్ పి. వి. సుబ్బా రావు ఒక ప్రకటనలో విద్యా శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఎ.పి.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి యస్.చిరంజీవి రాష్ట్ర విద్యా శాఖ కు విజ్ఞాపన పత్రం ఈ నెల 3 వ తేదీన ఇచ్చినప్పటికి, నేటికీ లీపు యాప్‌లో నమోదు చేయలేదని, వెంటనే నమోదు చేయాలని కూడా రాష్ట్ర విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు.యన్.లక్ష్మీ నారాయ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.పి.టి.ఎఫ్ పాల్గొన్నారు.

## ప్రమాదం భీమా క్రింద 5 లక్షలు రూపాయులు చెక్ అందజేత



**ఒంగోలు - ప్రభాతవార్త**
ఒంగోలునగర పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన మొలకపల్లి వెంకటేశ్వర్లు గారు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగినది. ఈరోజు వారి భార్య నారాయణమ్మ గారికి టీడీపీ ప్రమాద భీమా క్రింద 5 లక్షలు రూపాయలు చెక్ వారికి అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమం లో నగర అధ్యక్షులు బండారు మదన్, క్లస్టర్ ఇంచార్జి కామేపల్లి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు రామాంజనేయులు, యూనిట్ కన్వినర్ రాయపాటి బాబురావు మరియు తదితరులు పాల్గొన్నడం జరిగినది.

## రవాణాశాఖ దివ్యాంగులకు ఎల్.ఎల్.ఆర్(LLR) క్యాంపు

**ఒంగోలు క్రైమ్,నవంబర్ 19,ప్రభాతవార్త**
రవాణాశాఖ కమిషనర్ వారి కార్యాలయము, ప్రకాశం జిల్లాగౌరవనీయులు జాయింట్ కలెక్టర్ , అదనపు జిల్లా మేజిస్ట్రేట్, ఒంగోలు, ప్రకాశం జిల్లా వారి ఉత్తరువుల ప్రకారము ఉప రవాణా కమిషనర్ శ్రీమతి ఆర్ సుశీల గారి ఆధ్వర్యములో దివ్యాంగులకు ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ నందు గల పి.జి.ఆర్.ఎస్ (PGRS) హాల్ నందు ఎల్.ఎల్.ఆర్(LLR) క్యాంపు ఈ నెల 21.11.2025 న నిర్వహించి అర్హులకు స్పాట్ బుక్ చేయబడును.కావున ఎల్.ఎల్.ఆర్ (LLR) కొరకు స్లాట్ బుక్ చేసుకొను దివ్యాంగులు వారి ఒరిజినల్ ఆధార్ గ్రూప్, ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికేట్, ఫారం IA తీసుకొని (PGRS) హాల్ నందు తేది 21.11.2025 ఉదయం 09.30 నిలకు హాజరు కావలసినదిగా కోరడమైనది. 21.11.2025 ని స్లాట్ బుక్ చేసుకున్నవారికి తేది 22.11.2025 ని కంప్యూటర్ నందు ఎల్.ఎల్.ఆర్ (LLR) వారికి కేటాయించిన సమయము ప్రకారం (PGRS) హాల్ నందు నిర్వహించబడును.కావున దివ్యాంగులు అందరు ఈ అవకాశమును వినియోగించవలసినదిగా కోరడమైనది.

### చిన్న కల్లమల్ల ఎస్సీ కాలనీ సమస్యలపై డిపిఒ ఆకస్మిక తనిఖీ ఎం. వెంకటేశ్వరరావు
### - కాలువలను వెంటనే పూడికలు తీయాలని, వాటర్ సమస్య పరిష్కారానికి ఆదేశాలు



**సింగరాయకొండ, నవంబర్ 19,ప్రభాతవార్త**
మండలంలోని చిన్న కల్లమల్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా డి.పి.ఓ. వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కాలనీవాసి చొప్పర శివ చేసిన ఫిర్యాదుతో కాలనీలో కాలువలు పూడికలు తీయకపోవడం, తాగునీటి సమస్య ప్రధానంగా ఉందని తెలిపారు.స్థల పరిశీలన అనంతరం డిపిఒ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ కాలువలను తక్షణమే శుభ్రం చేసి పూడికలు తీయాలని ఆదేశించారు. దెబ్బతిన్న కాలువలను వెంటనే మరమ్మత్తులు చేయాలని, మరియు దెబ్బతిన్నట్లయితే కొత్త కాలువల నిర్మాణంచేయడం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్యను పరిష్కరించడానికి త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ డి. జయమణి, ఈఓఆర్డి రమేష్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



**దర్శి, నవంబర్ 19, ప్రభాతవార్త**
శాఖా గ్రంథాలయం దర్శి నందు వారోత్సవాలలో భాగంగా ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయులు నర్సిరెడ్డి వెంకటేశ్వర్లు, లావణ్య,పలినమ్మ,వరలక్ష్మి, విద్యార్థిని, విద్యార్థులు, గ్రంథపాలకులు పాల్గొన్నారు.


## శివస్వాముల ఆధ్వర్యంలో వైభవంగా పడీ పూజా మహోత్సవం





**కనిగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త**
కనిగిరి సమీపంలోని కొండపై ఉన్న పురాతన శివాలయంలో మంగళవారం రాత్రి శివస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన పడి పూజా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణమంతా భజనలతో, హారతులతో దీపాల వెలుగులతో భక్తిరసమయ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేడుకకు ప్రధాన అతిధులుగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ప్రముఖ ఆర్యవైశ్యులు,శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం అధ్యక్షులు కొప్పరపుసత్యాలు, రాచపూటి వెంకటేశ్వర్లు,అద్దంకి పెద్దరంగబాబు,తాళ్లూరి మహేష్ దంపతులు, విజయ మార్కండేయ శ్రీ దేవస్థానం చైర్మన్ వెంకటేశ్వర్లు, గోపాల్ సిండికేట్ అధినేత గోనుగుంట పవన్‌కుమార్, వెలుగూరి చంద్రశేఖర్,మాజీ విజయ మార్తాండేశ్వరి దేవస్థానం చైర్మన్ గొంట్ల మల్లిఖార్జున, ప్రముఖ జర్నలిస్టు ముత్తుముల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో శివభజనలు, అష్టోత్తర శతనామ పఠనలు, దీపారాధనలతో ఈ కార్యక్రమం భక్తి భావనతో నిండిపోయింది. శివస్వాములు ఈ సందర్భంగా భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తూ శివరాధన మనసును పవిత్రం చేస్తుంది. సమాజంలో శాంతి సౌభాగ్యం పెంపొందిస్తుందని తెలిపారు.

## కనిగిరిలో శ్రీకృష్ణ మందిరం గోశాల ఏర్పాటుకు
## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ వినతి పత్రం అందజేత



**కనిగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణం అభివృద్దిలో వెనుకబడినప్పటికి భక్తి, ఆధ్యాత్మికత అంశాలలో ఎప్పటికప్పుడు ముందంజలో ఉంటుందని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ షేక్ పేర్కొన్నారు. ఇస్కాన్ సంస్థ ఉపాధ్యక్షులు చైతన్య రూపేష్ ప్రభుకి బుధవారం నందన మారెళ్ళలో జరిగిన కార్తీక వనభోజనం ఉత్సవంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ప్రస్తావిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ఇస్కాన్ సంస్థ కుల, మత, జాతి, ప్రాంతీయ పరిమితులకు అతీతంగా నిర్వహిస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలు ఎంతో మహోన్నతమని ఆయన ప్రశంసించారు. కనిగిరి ప్రాంతంలో శ్రీకృష్ణ భక్తులు అధిక సంఖ్యలో ఉన్నందున ఇక్కడ శ్రీకృష్ణ పరమాత్ముని దేవాలయం, గోశాల స్థాపన అత్యవసరం అని అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. పట్టణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కనిగిరిలో ఇస్కాన్ ఆధ్వర్యంలో దేవాలయం, గోశాల నిర్మాణానికి ఇస్కాన్ సంస్థ ముందుకు రావాలని కోరారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే పట్టణ ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కనిగిరి ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ చేసిన ఈ విజ్ఞప్తిని ఇస్కాన్ సంస్థ పరిశీలించి ముందడుగు వేస్తుందనే నమ్మకం వ్యక్తమవుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కార్యకర్తల నమ్మకానికి కొత్త చిరునామా
## - బొల్లా నరసింహారావు





**పామూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆశీస్సులతో ఇటీవల మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బొల్లా నరసింహారావు బాధ్యతల స్వీకరణతోనే పార్టీ బలోపేతానికి వేగాన్ని పెంచారు. దివంగత సీనియర్ నేత బొల్లా మాల్యాద్రి చౌదరి చూపిన రాజకీయ మార్గాన్ని అనుసరిస్తూ నాయకులు, కార్యకర్తలను అక్కున చేర్చుకుంటూ నరసింహారావు సాగిస్తున్న పనితీరు పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపుతోంది. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరి వెన్నంటే నేను ఉన్నాను అనే సందేశాన్ని నిరంతరం కార్యకర్తల్లోకి భరోసా ఇస్తూ బలమైన నెట్‌వర్క్‌తో మళ్లీ చైతన్యం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న కృషి మండలంలో పార్టీ బలం పెరగడానికి దోహదం చేస్తోంది. క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, కేఎస్ఎస్ సభ్యులతో సమయానుకూలంగా సమన్వయం చేస్తూ అట్టడుగున ఉన్న కార్యకర్తకు కూడా సమాచారాన్ని చేరేలా పని చేస్తున్నారు. బ్రాండ్‌గా నిలిచిన బొల్లా మాల్యాద్రి చౌదరి లోటును తనయుడు భర్తీ చేస్తూ, ప్రజల్లో, నాయకుల్లో, కార్యకర్తల్లో చెరగని ముద్ర వేస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తున్న నరసింహారావు భవిష్యత్తులో తండ్రి వారసత్వానికి తగ్గట్టుగా రాజకీయంగా మరింత ఎదుగుతారనే నమ్మకం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## తల్లిబిడ్డను కాపాడిన ఎస్సై



**దర్శి, నవంబర్ 19, ప్రభాతవార్త**
దర్శిలో రెండేళ్ల బిడ్డతో కలిసి మహిళ కురిచేడు రోడ్డులోని సాగర్ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే అటుగా వెళ్తున్న ఎస్సై మురళి గమనించి స్థానికుల సహాయంతో సాగర్ కాలువలో కొట్టుకుపోతున్న తల్లి బిడ్డను బయటకు తీసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బిడ్డ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సకాలంలో స్పందించిన ఎస్సై తల్లిబిడ్డను కాపాడారు. ఆత్మహత్యాయత్నం పాల్పడిన మహిళను పోలీసులు విచారిస్తున్నారు.

# అనుమాన స్పదంగా యువకుని మృతి



**వేటపాలెం, నవంబర్ 19, ప్రభాతవార్త**
వేటపాలెం మండల పరిధిలోని బాలాజీ నగర్‌లో బెల్లం హరిబాబు(32) అనే వ్యక్తి బుధవారం అనుమాన స్పద రీతిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. భార్య వెంకటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం మద్యం ఎక్కువగా సేవించి ఇంటికి వచ్చిన హరిబాబు అపస్మారక స్థితిలో ఉండి నోటీ వెంట నురగ వచ్చిందని, హుటాహుటీన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించానని, అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరివీలించిన అనంతరం హరిబాబు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు. అనంతరం మృతదేహాన్ని మృతుని గ్రామమైన ఉప్పుగుండూరు తరలిస్తుండగా సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్సై జనార్ధన్ మృతదేహాన్ని స్వాధీనం పరుచుకుని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన ఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కనిగిరి వైసీపీ శ్రేణులు
### - 2029 లో జగన్‌ను మళ్లి సీఎం చేయడం మా లక్ష్యం





**కనిగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కనిగిరి వైసీపీ నాయకులు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ పెరుగు మురళికృష్ణ యాదవ్, యేరువారిపల్లి మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, సీఎస్‌పురం వైసీపీ నాయకులు శేఖర్ కూడా జగన్‌ను భేటీ అయ్యారు. కనిగిరి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు పార్టీ పరిస్థితులు గురించి నేతలు జగన్‌కు వివరణ ఇచ్చారు. పార్టీ బలోపేతం దిశగాఅహర్నిశలు కృషి చేస్తామని వారుతెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి నాయకులు, వైసీపీ సీనియర్ నేతలు పులివెందుల సతీష్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలను దుశ్శాలువా కప్పి సత్కరించారు. కనిగిరి నియోజకవర్గ ఆజకీయ స్థితిగతులపై నాయకులు సమరినంచిన నివేదికలను పార్టీ ఉన్నత నేతలు సానుకూలంగా స్వీకరించారు. 2029లో జరగనున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడం తమ ప్రధాన లక్ష్యం అని కనిగిరి వైసీపీ నేతలు స్పష్టం చేశారు.

## 26న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



**రాచర్ల, నవంబర్ 19 ప్రభాతవార్త**
మండలంలోని జేపీ చెరువు గ్రామంలో ఈ నెల 26వ తేదీన శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని కార్య నిర్వాహకులు, నంది అవార్డు గ్రహీత కళారత్న పత్తి ఓబులయ్య బుధవారం తెలిపారు. 25వ తేదీ బుధవారం పూజా కార్యక్రమాలు, 26వ తేదీ గురువారం విగ్రహ ప్రతిష్ట అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు భక్తులు హాజరై ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందాలని పత్తి కుటుంబ సభ్యులు కోరారు.

# జాతీయ దత్తత మాస ఉత్సవాలు



**దర్శి, నవంబర్ 19, ప్రభాతవార్త**
ప్రత్యేక అవసరాలకు సంబంధించిన పిల్లల దత్తత నినాదంతో జిల్లాలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా బాలల అభివృద్ధి అధికారి పరిమళ అధ్యక్షతన కార్యక్రమం దర్శి ప్రాజెక్టులో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి సువర్ణ పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టులో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపైదిశ నిర్దేశాలను తెలియజేశారు. అంగన్‌వాడీలు వారికి సంబంధించిన పలు అంశాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్లకు సంబంధించిన విధులను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం రక్షణ అధికారి శ్రీలక్ష్మీ దత్తతకు సంబంధించిన అంశాలను వివరించారు. జిల్లా న్యాయ పర్యవేక్షణ అధికారి రత్న ప్రసాద్, బాలలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098 ద్వారా బాల బాలికలకు కలిగే ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ వెంకటరావు, సూపర్‌వైజర్లు సుభాషిణి, సునీత, ఇందిరా పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని
### కలిసిన కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త కైపు



**దర్శి, నవంబర్19, ప్రభాతవార్త**
విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డిని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కైపు వెంకట కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇద్దరు సుదీర్ఘంగా చర్చించారు. తాజా రాజకీయ పరిస్థితులు,నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలు, కొన సాగుతున్న కార్యచరణ భవిష్యత్తు ప్రణాళికలు తదితర విషయాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఈ భేటీలో షర్మిలారెడ్డి కీలక సూచనలు అందించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలపై గళం విప్పాలని, కాంగ్రెస్ పార్టీని మరింత బలపర్చే దిశగా కృషి చేయాలని కైపు వెంకటకృష్ణారెడ్డికి సూచించారు.

## ఆరుబయటే సమస్యలను పరిష్కరిస్తున్న దర్శి తహశీల్దార్ శ్రావణ్ కుమార్



**దర్శి, నవంబర్ 19, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని ప్రజలు బాధితులు వివిధ సమస్యల తోటి తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న ప్రజలని తహసీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆరు బయటే సమస్యలతోటి వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ సమస్యలకు సంబంధించిన అధికారుల్ని వెంటనే పిలిపించి ఆ సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తున్నారు. ఆఫీసుముందు వేచి చూడాల్సిన అవసరం లేకుండా స్వయంగా ప్రజల వద్దకే పాలన అంటూ వచ్చిన సంబంధిత బాధితులను వారి సమస్యలను వెంటనే పరిష్కరించి పంపించడం జరుగుతుంది. దీంతో పలువురు బాధితులు తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

### కమీషనర్ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న
# టీడీపీ నాయకులు బేతపూడి రామారావు



**ముండ్లమూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
ఒంగోలు నగర కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావుకు రీజనల్ డైరక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ ఎంపీగా ఉద్యోగన్నతి లభించింది.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావుని బుధవారం ముండ్లమూరు మండల టీడీపీ నాయకులు బేతపూడి రామారావు, అనుచరులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో ప్రేథమస్థానంలో ఒంగోలు కార్పొరేషన్ రావడంతో వెంకటేశ్వర రావు ప్రత్యేక గుర్తింపు దక్కిందని సాధించారని, ఈ సందర్భంగా ఆయన భవిష్యత్తులో మరెన్నో పదవులను అధిరోహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ సెలక్షన్‌లో ప్రతిభ చూపిన విద్యార్ధులు



**ముండ్లమూరు, నవంబర్ 19, ప్రభాతవార్త**
అంతర్ జిల్లాల 69 ఎస్‌జీఎఫ్ఐ అండర్ 17, 14 సాఫ్ట్‌బాల్ సెలక్షన్ లో ఉమామహేశ్వరపురం బాలికలు ప్రతిభ చూపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైనంపాడులో నవంబర్ 18న జరిగిన అండర్ 14 విభాగంలో 7 గురు, అండర్ 17 కేటగిరిలో ముగ్గురు, జడ్పీహెచ్ఎస్ ఉమామహేశ్వర పురం బాలికలు ఎంపిక కావడం జరిగింది. అదే విధంగా అండర్-14 విభాగంలో స్టాండ్ బై గా 2 ఎంపిక కావడం జరిగింది. అండర్-17 విభాగంలో స్టాండ్ బై గా 1 ఎంపిక కావడం జరిగింది. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మీరావలి వ్యాయామ ఉపాధ్యాయులు పి.తిరుపతిస్వామి, పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్ధులను అభినందించారు.

# పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం



**దర్శి, నవంబర్ 19, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని కేవీకేలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయ ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అదే విధంగా ప్రధానమంత్రి ఆశయాలకు అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ సైంటిస్ట్, ఏఆర్ఎస్, దర్శి వ్యవసాయంలో రసాయనాలకు ప్రత్యామ్నాయ మార్గాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు, ఉద్యాన పరిశోధన స్థానం దర్శి వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టి.మానస, డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## 437 మద్యం సీసాలు ధ్వంసం



**దర్శి, నవంబర్ 19, ప్రభాతవార్త**
దర్శి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుకున్న 437 మద్యం సీసాలను ప్రకాశం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.అయేషాబేగం, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు ప్రకాశం జిల్లా వారి ఉత్తర్వులు మేరకు బుధవారం ధ్వంసం చేశారు. అనంతరం అయేషాబేగం ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన పెండింగ్ కేసుల యొక్క పురోగతిని సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కే.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి



**సీఎస్‌పురం, నవంబర్ 19, ప్రభాతవార్త**
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని కార్యాలయంలో బుధవారం మండలం లోని రెడ్డిగారికొత్తపల్లె సర్పంచ్ అంబాల చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్థితిపై వివరించారు. కాగా పార్టీ పటిష్టతకు కష్టపడి పని చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు సర్పంచ్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

20-11Pg5- final 9_20-11Pg5- final.qxd 20/Nov/25 12:06 AM Page 1





బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని కాంగ్రెస్ అభిమానులు నివాళులర్పిస్తున్న దృశ్యం

# నా తల్లిని బంగ్లాకు అప్పగిస్తే మిలిటెంట్లు చంపేస్తారు!

## హసీనా కుమారుడు సాజీబ్‌వాజెద్ ఆందోళన



**న్యూఢిల్లీ, నవంబరు 19:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తల్లిని బంగ్లాదేశ్‌కు అప్పగిస్తే అక్కడి మిలిటెంట్లు ఆమెను చంపేస్తారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తన తల్లికి భద్రత కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సరిహద్దుల్లో ఉగ్రవాదం పెరిగిపోతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని భారత్‌ను హెచ్చరించారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాజీబ్ మాట్లాడుతూ తన తల్లిని అప్పగించాలన్న బంగ్లాదేశ్ ప్రభుత్వ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుత బంగ్లా ప్రభుత్వం న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. తన తల్లిపై తప్పుడు కేసులు బనాయించారని, 17 మంది న్యాయమూర్తులను తొలగించి, పార్లమెంట్ ఆమోదం లేకుండానే చట్టాలను సవరించి విచారణ జరుపుతున్నారని విమర్శించారు. కనీసం డిఫెన్స్ లాయర్లను కూడా కోర్టులోకి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ మా అమ్మ ప్రాణాలను కాపాడింది. ఆమె బంగ్లాదేశ్ విడిచిపెట్టకపోయి ఉంటే, మిలిటెంట్లు ఆమెను చంపేసేవారని సాజీబ్ అన్నారు. ప్రస్తుత యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, హసీనా హయాంలో అరెస్టయిన వేలాది మంది ఉగ్రవాదులను విడుదల చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలు బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపారు. బంగ్లా ఉగ్రవాదంపై ప్రధాని మోదీ కూడా తీవ్ర ఆందోళనతో ఉన్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. తన తల్లిని అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం చేసిన అభ్యర్థనను భారత్ తిరస్కరిస్తుందన్న నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.




# ఉచితంగా ఎఐ కోర్స్

## కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, నవంబర్ 19:** కృత్రిమ మేధకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు, ఉద్యోగులకు దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఒక కోర్సును రూపొందించింది. 'యువ ఎఐ ఫర్ ఆల్' పేరిట దీన్ని అందిస్తుండడం విశేషం. ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించారు. ఈ కోర్సు వ్యవధి 4.5 గంటలు. దీన్ని పూర్తి చేసిన వారికి ఎఐపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. కోర్సులు చాలా సరళంగా, నిజ జీవితంలో ఉపయోగించే ఉదాహరణలతో రూపొందించారు. ఇది ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్, ఐజిఒటి కర్మయోగి సహా మిగిలిన ప్రముఖ ఎడ్‌టెక్ పోర్టళ్లలో అందుబాటులో ఉంది. దీని పూర్తిచేసిన వారికి భారత ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్ కూడా లభిస్తుంది. ఈ కోర్సులో మొత్తం ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ఎఐ అంటే ఏమిటి? ఎలా పనిచేస్తుంది? విద్య, సృజనాత్మకత, ఉద్యోగాలను ఎఐ ఎలా మారుస్తోంది? ఎఐ టూల్స్‌ను భద్రంగా, బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించుకోవాలి? నిజజీవితంలో ఎఐ వాడే విధానం, ఎఐ భవిష్యత్తు.. రాబోయే అవకాశాలు. రిజిస్టర్ చేసుకునే విధానం : అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. హోమ్ పేజ్ కుడివైపు 'ఎన్‌రోల్‌పై క్లిక్ చేయాలి. గూగుల్ లేదా లింక్డిన్ ఖాతా ద్వారా అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. పేరు, పుట్టినతేదీ, జెండర్ వంటి వివరాలు ఎంటర్ చేయాలి. మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఒటిపితో ధ్రువీకరించాలి. అపార్ ఐడి ఇవ్వాలి. చెక్‌బాక్స్‌లో టిక్ చేసి సబ్మిట్ చేయాలి.


# సౌదీ ప్రిన్స్ క్షమాపణ చెప్పాల్సిందే: ఖషోగ్గీ భార్య



**వాషింగ్టన్, నవంబరు 19:** సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికాలో పర్యటిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సమావేశమై పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ అమెరికా పర్యటనపై జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి భార్య హనన్ ఎలాత్ర్ ఖషోగ్గి తీవ్రంగా మండిపడ్డారు. తనను వ్యక్తిగతంగా కలుసుకుని క్షమాపణ చెప్పాలని మహమ్మద్ బిన్ సల్మాన్ ను డిమాండ్ చేశారు. భర్త మరణంతో తాను కోల్పోయిన జీవితానికి పరిహారం ఇవ్వాలన్నారు. ఇందుకు సహకరించాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హనన్ ఎలాత్ర్ ఖషోగ్గి ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు. 2018 లో ఇస్తాంబుల్ లోని దౌత్య కార్యాలయం వద్ద జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సౌదీ ఏజెంట్లే కారణమని, సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ ఆదేశాల మేరకే వారు ఈ ఆపరేషన్ నిర్వహించారని ఆరోపణలు వినిపించాయి.

# ఎన్నికల సంఘంపై ఆరోపణలు రాజ్యాంగ వ్యవస్థలపై దాడి

- రాహుల్‌గాంధీకి 272 మంది ప్రముఖుల లేఖ
- సంతకం చేసిన వారిలో రిటైర్డ్ జడ్జిలు, మాజీ సైనికాధికారులు, రాయబారులు




**న్యూఢిల్లీ, నవంబరు 19:** కేంద్ర ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడమంటే రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేసినట్లేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు. ఇసిపై ఆరోపణలు భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాలపై దాడి చేయడమేనని అభిప్రాయ పడ్డారు. ఓట్ల చోరీ జరుగుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆయన విధానాలను విమర్శిస్తూ ఈ లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖపై 16 మంది రిటైర్డ్ జడ్జిలు, 123 మంది మాజీ అధికారులు, 133 మంది మాజీ సైనికాధికారులు, 14 మంది మాజీ రాయబారులు సంతకాలు చేశారు. ప్రజాస్వామ్యం, దాని పునాదులపై దాడి జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ, ఓట్ల చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయని చెబుతూ నమ్మశక్యం కాని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారన్నారు.

# బీహార్‌లో నేటి నుంచి కొత్త సర్కార్

**- ఎన్‌డిఎ శాసనసభా పక్ష నేతగా నితీశ్ ఎన్నిక - పదోసారి సిఎం కానున్న జెడియు అధినేత - డిప్యూటి సిఎంలుగా సామ్రాజ్ చౌదరి, విజయ్ సిన్హా - ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకానున్న ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు - డిప్యూటీ సిఎం పదవి కావాలని ఎల్‌జెపి పట్టు**



**పాట్నా, నవంబరు 19:** బీహార్‌లో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్‌ను ఎన్‌డిఏ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఎన్‌డిఏ ఎమ్మెల్యేల సమావేశంలోనూ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ అరిఫ్ అహ్మద్ మొహమ్మద్ ఖాన్ వద్దకు వెళ్లిన నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. గవర్నర్ దానిని ఆమోదించారు. తరువాత నితీశ్ కుమార్, ఎన్‌డిఏ నేతలు నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో గురువారం పాట్నాలోని చారిత్రిక గాంధీ మైదానంలో సిఎంగా నితీశ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయడం ఇది 10వసారి. సిఎంతోపాటు డిప్యూటీ సిఎంలుగా సామ్రాట్ చౌదరి, విజయ సిన్హాలు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎన్‌డిఏ వర్గాలు వెల్లడించాయి. మంత్రులు ఎంతమంది ప్రమాణ స్వీకారం చేయబోతున్నారనేది మాత్రం బహిర్గతం కావడం లేదు. అంతకుముందు జెడియు ఎమ్మెల్యేలు తమ శాసనసభపక్ష నేతగా నితీశ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. సచివాలయంలోని సంవాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నితీశ్ కుమార్‌ను శాసనసభ పక్ష నేతగా విజయ్ చౌదరి, ఉమేష్ కుష్వాహ ప్రతిపాదించగా, పార్టీ నేతలు మద్దతు తెలిపారు. మరోవైపు బిజెపి శాసనసభా పక్షనేతగా తారాపుర్ ఎమ్మెల్యే సామ్రాట్ చౌదరిని ఎన్నుకున్నారు. ఉప నేతగా విజయ సిన్హాను ఎన్నుకున్నారు. బిజెపి కేంద్ర పరిశీలికుడిగా హాజరైన ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఈ విషయాన్ని ప్రకటించారు. కాగా రేపు పట్నాలోని గాంధీ మైదానంలో సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం జరగనుంది. అంతకుముందు స్పీకర్ పదవితో సహా కీలక మంత్రి పదవుల కేటాయింపుపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. స్పీకర్ పదవి కోసం బిజెపి, జెడియు గట్టిగా పట్టుబట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత అసెంబ్లీలో బిజెపికి చెందిన నంద్‌కిశోర్ యాదవ్ స్పీకర్‌గా ఉన్నారు. జెడియు పార్టీకి చెందిన నరేంద్ర నారాయణ్ యాదవ్ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. అయితే ఈసారి కూడా స్పీకర్ పదవిని దక్కించుకోవాలని బిజెపి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, మంత్రివర్గ కూర్పుపై భాగస్వామ్య పక్షాల మధ్య ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి ఫార్ములాకు ఎన్‌డిఏలోని పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 89, జెడియు 85 భారీగా సీట్లు రావడంతో ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఓ మంత్రి పదవి కేటాయించానే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ ఫార్ములా ప్రకారం బిజెపికి 15 లేదా 16, జెడియుకు 14, ఎల్ జేపీ (రామ్‌విలాస్) పార్టీకి 3, ఆర్‌ఎల్‌ఎం, హెచ్‌ఏఎంలకు ఒక్కోటి చొప్పున మంత్రి పదవులు లభించే అవకాశం ఉంది. ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షం ఎల్‌జెపి ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. కూటమిలోని పార్టీలందరికీ కేబినెట్‌లో చోటు కల్పిస్తున్నప్పటికీ డిప్యూటీ సిఎం కావాలని బిజెపి పెద్దల ముందు ఎల్‌జెపి అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. అయితే, దీనిపై బిజెపి నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

# చిన్న మార్పులతో పాత చట్టాన్నే అమలుచేస్తున్న కేంద్రం!



**ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టంపై సుప్రీం సీరియస్**

**న్యూఢిల్లీ, నవంబరు 19:** ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టం2021 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ చట్టంలో నియామకాలు, సర్వీసు కండీషన్లు, పదవీ కాలాలకు సంబంధించిన కొన్ని నిబంధనలను గతంలో సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసిందని, చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగిస్తున్నాయని, అధికార వికేంద్రీకరణ సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయని, అలాంటి వాటిని తిరిగి ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ చట్టాన్ని తాము సరిచూశామని, గతంలో కోర్టు రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తెచ్చారని పేర్కొంది. ఇది రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని స్పష్టంచేసింది. ట్రిబ్యునళ్ల సభ్యుల పదవీకాలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను ఈ సందర్భంగా కోర్టు పునరుద్ధరించింది. ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్, కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ సభ్యులు 62 ఏళ్లు వచ్చేవరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. ఇక ట్రిబ్యునళ్ల ఛైర్ పర్సన్లు/అధ్యక్షుల రిటైర్మెంట్ వయసు 65 ఏళ్ల వరకు ఉంటుందని వెల్లడించింది.

అదే సమయంలో ఈ అంశంపై జాతీయ ట్రిబ్యు నల్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించింది. 2021లో తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణల (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సహా కొన్ని అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రద్దయ్యాయి. వీటితో పాటు పలు ట్రిబ్యునళ్ల జ్యుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరిగాయి. అయితే, ఈ చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా తీర్పు వెలువరించింది.

# షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఖైబర్‌ఫఖ్తూన్‌క్వా సిఎం ధ్వజం



**పెషావర్, నవంబరు 19:** పాకిస్థాన్ ప్రభుత్వంపై ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది సంచలన ఆరోపణలు చేశారు. తమ ప్రావిన్స్ లో పాకిస్థాన్ ప్రభుత్వమే ఉగ్ర దాడులు చేయిస్తోందని ఆయన ఆరోపించారు. పొరుగున ఉన్న ఆఫ్ఘనిస్థాన్ తో ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ కు సత్సంబంధాలు నెలకొనడంపై ఇస్లామాబాద్ ఆగ్రహంగా ఉందని, దీనిని చెడగొట్టడానికే ఖైబర్ ప్రావిన్స్ లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన మండిపడ్డారు. శాంతి ప్రయత్నాలను, చర్చలను అడ్డుకోవడమే దీని వెనకున్న అసలు ఉద్దేశమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం సోహైల్ అఫ్రిదిని ఉటంకిస్తూ పలు కథనాలువెలువడ్డాయి. సోహైల్ అఫ్రిది కిందటి నెలలోనే ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పాకిస్థాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీకి చెందిన నేత. ఇటీవలి కాలంలో ఖైబర్ ప్రావిన్స్ లో చోటుచేసుకుంటున్న ఉగ్ర దాడులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాక్ ప్రభుత్వమే ఈ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఇటీవల పష్తూన్ తహాఫుజ్ మూమెంట్ (పీటీఎం) సభ్యులు కిడ్నాప్ కు గురైనట్లు తెలుస్తోంది. దీనిని అఫ్రిది తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రపంచ దేశాలు సహించకూడదని ఆయన పేర్కొన్నారు. శాంతి ప్రయత్నాలకు భంగం కలిగించేవారిని ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తామని సోహైల్ అఫ్రిది హెచ్చరించారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లో ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో సైనిక బలగాలు సామాన్యులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని సీఎం అఫ్రిది ఆరోపించారు. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో సైనికులు సామాన్యులపై దౌర్జన్యం చేస్తున్నారని, సొంత ప్రజలనే చంపేస్తున్నారని విమర్శించారు.

కాగా, పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోని తిరా లోయలో ఇటీవల పాక్ వైమానిక దాడులు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని వార్తలు వెలువడ్డాయి. సొంత ప్రజలపైనే పాక్ సైన్యం దాడి చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనను ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం సోహైల్ అఫ్రిది గుర్తు చేశారు.

# గ్రామీ అవార్డుకు దలైలామా నామినేట్



**ధర్మశాల, నవంబరు 19:** నోబెల్ బహుమతి గ్రహీత దలైలామా మొట్టమొదటి సారి గ్రామీ అవార్డుకు నామినేట్ అయ్యారు. ఆధ్యాత్మిక ప్రవచనాలకు చెందిన దలైలామా ఆల్బమ్ ఆ పోటీలో ఉన్నది. 'ద రిఫ్లెక్సన్స్ ఆఫ్ హిజ్ హోలీనెస్ ద దలైలామా' అన్న టైటిల్‌తో ఉన్న ఆల్బమ్ గ్రామీలకు పోటీపడుతున్నది. 90 ఏళ్ల వయసులో దలైలామా ఆ అవార్డుకు నామినేట్ కావడం ఓ మైలురాయిగా భావిస్తున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నారేషన్, స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ కేటగిరీల్లో దలైలామా ప్రవచనాల ఆడియో పోటీపడుతున్నది. 2026 ఫిబ్రవరి 1న లాస్ ఏంజిల్స్‌లో 68వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నది. కరుణ, ఆత్మ శాంతి, భావోద్వేగాల గురించి దలైలామా చేసిన ప్రసంగాలకు సరోద్ వాయిద్యకారుడు అంజద్ అలీ ఖాన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. అంజద్ కుమారుడు అమన్ అలీ బంగాష్, అయ్యాన్ అలీ బంగాష్ కూడా మ్యూజిక్ కంపోజ్ చేశారు. దలైలామా ఆల్బమ్ కోసం అంతర్జాతీయ కళాకారులు ఆండ్రా డే, మ్యాగీ రోజర్స్, టోనీ సుకార్, టెడ్ నాష్, దేబీ నోవా, రూఫస్ వెయిన్‌రైట్ పనిచేశారు.

# అల్‌ఫలా గ్రూప్ చైర్మన్‌కు 13రోజులు ఇడి కస్టడీ

## చారిటబుల్‌ట్రస్టుకు రూ.415 కోట్లు విరాళాలు!

### మరింత సమగ్ర దర్యాప్తుచేయనున్న ఎన్‌ఐఎ, ఇడిలు

**న్యూఢిల్లీ, నవంబరు 19:** అల్ ఫలాహ్ గ్రూపు ఛైర్మెన్ జావద్ అహ్మద్ సిద్ధికీని సిటీకోర్టు వచ్చేనెల ఒకటవ తేదీవరకూ అంటే 13 రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతించింది. అల్ ఫలాహ్ ఛారిటబుల్ ట్రస్టు మనీల్యాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అడిషనల్ సెషన్స్ జడ్జీ షీతల్ చౌదరీ ప్రధాన్ బుధవారం రాత్రి ఒంటి గంటకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎంపీఎల్‌ఏ చట్టంలో సెక్షన్ 19 కింద సిద్ధిక్‌ను అరెస్టు చేశారు. ఈడీ రిమాండ్ కోసం అతన్ని రాత్రిపూట కోర్టుకు తీసుకెళ్లారు. అల్ ఫలాహ్ గ్రూపుపై విచారణ చేపట్టిన తర్వాత ఈడీ ఈ చర్యలు తీసుకున్నది. ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఏజెన్సీ చర్యలు మొదలుపెట్టింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ కాలేజీ విద్యార్థులను, పేరెంట్స్‌ను తప్పుదోవ పట్టించినట్లు గుర్తించారు. నాక్ అక్రిడిటేషన్ ఉన్నట్లు నమ్మించారని ఆరోపించారు. 1956 యూజీసీ చట్టంలోని సెక్షన్ 12(బీ) కింద యూజీసీ అనుమతి ఉన్నట్లు కూడా ఆ యూనివర్సిటీ తప్పుగా చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రూపు ఛైర్మన్ జావద్ అహ్మద్ సిద్ధిక్‌కు విరాళాల రూపంలో 415 కోట్లు అందినట్లు ఈడీ పేర్కొన్నది. తన ట్రస్టుకు చెందిన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి అక్రమ రీతిలో ఆ నిధులను సమీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గల్ఫ్‌లో ఫ్యామిలీ సభ్యులు స్థిరపడడం వల్ల అక్కడికి పారిపోయే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. ఫరీదాబాద్‌లో రోజంతా జరిగిన తనిఖీల తర్వాత అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు ఛైర్మన్ సిద్ధిక్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఢిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలా విశ్వవిద్యాలయం వ్యవహారాలపై అటు దర్యాప్తుసంస్థలు, ఇటు విద్యాశాఖ, నాక్ అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు 10 మంది కనిపించకుండా పోయినట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కనిపించకుండా పోయిన వ్యక్తుల ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అని వస్తున్నాయి. ఇందులో ముగ్గురు కశ్మీరీలు ఉన్నారని తెలుస్తోంది. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో అరెస్టైన నిందితులకు ఈ విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్నట్లు విచారణలో బయటపడింది. తాజాగా, పదిమంది కనిపించకుండా పోవడం గమనార్హం.

ఢిల్లీలోని పేలుడు ఘటనతో ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ కారు పేలుడు కేసులో ఈ విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు వైద్యులు సహా తొమ్మిది మంది అరెస్టయ్యారు.

ఈనెల 10వ తేదీన జరిగిన ఎర్రకోట కారు పేలుడు ఘటనతో వర్సిటీకి లింకు ఉన్న కారణంగా ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. తప్పుడు అక్రెడిటేషన్, గుర్తింపు చూపిస్తూ విద్యార్థులు, పేరెంట్స్ నుంచి ఆ వర్సిటీ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ రూపంలోనే 415 కోట్లు సేకరించినట్లు తెలుస్తున్నది. పరారీ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అతన్ని కస్టడీలోకి తీసుకున్నట్లు ఈడీ పేర్కొన్నది. 1990 నుంచి అల్ ఫలాహ్ వర్సిటీ అంచలంచెలుగా ఎదిగిందని, ఇప్పుడు ఓ పెద్ద విద్యాసంస్థగా మారినట్లు తెలిపింది.


# సంక్షిప్తంగా..

## అన్మోల్ బిష్ణోయ్‌ని అరెస్టు చేసిన ఎన్‌ఐఎ




**న్యూఢిల్లీ, నవంబరు 19:** కరడు గట్టిన నేరస్థుడు లారెన్స్ బిష్ణోయ్ సోదరుడైన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను ఎన్‌ఐఏ అరెస్ట్ చేసింది. అమెరికాలో ఉంటున్న అన్మోల్‌ను అక్కడి అధికారులు భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో అతడిని నేడు భారత్‌కు తీసుకొచ్చారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్‌కాగానే ఎన్‌ఐఏ అతడిని అరెస్ట్ చేసింది. అరెస్టుకు సంబంధించిన ఫార్మాలిటీస్ అన్నింటినీ అక్కడికక్కడే పూర్తి చేసి అదుపులోకి తీసుకుంది. అతడిని హై సెక్యూరిటీ మధ్య అక్కడి నుంచి తీసుకెళ్లింది. అన్మోల్ బిష్ణోయ్‌ని అలియాస్ భానుగా పిలుస్తారు. అనేక కేసుల్లో అన్మోల్ బిష్ణోయ్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. పంజాబీ సింగర్ సిద్ధూ మోసేవాల్ హత్య కేసులో అన్మోల్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. అతడిపై మొత్తం 18 కేసులు నమోదు అయ్యాయి.

## సబర్మతి జైలులో ఢిల్లీ పేలుళ్ల ఉగ్రవాదిపై తోటి ఖైదీల దాడి




**అహ్మదాబాద్, నవంబరు 19:** ఆముదం గింజల నుంచి అత్యంత ప్రమాదకర విషం (రైసిన్) తయారు చేసి అమాయకుల ప్రాణాలు తీయాలని చూసిన ఉగ్రవాది అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ పై జైలులో దాడి జరిగింది. అహ్మద్ ను యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం విదితమే. ప్రస్తుతం అతడు గుజరాత్ లోని సబర్మతి జైలులో హైసెక్యూరిటీ బ్యారక్ లో ఉన్నాడు. అయితే, ఏం జరిగిందనే విషయంపై పూర్తి సమాచారం లేనప్పటికీ అహ్మద్ పై తోటి ఖైదీలు దాడి చేసి తీవ్రంగా కొట్టారని తెలుస్తోంది. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని, ఖైదీలు ఎందుకు దాడి చేశారనే విషయంపై ఆరా తీస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. ఖైదీలు మూకుమ్మడిగా దాడి చేయడంతో అహ్మద్‌ను కాపాడేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

## బిఎండబ్ల్యు కారు ఢీకొని భారత సంతతి గర్భిణి మృతి




**సిడ్నీ,నవంబరు 19:** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అదుపుతప్పిన ఓ కారు ఢీ కొట్టడంతో భారత సంతతికి చెందిన 8 నెలల గర్భిణి మరణించింది. భర్తతో కలిసి వాకింగ్ చేస్తున్న సమయంలో కారు ఢీ కొట్టడంతో ఈ ఘోరం జరిగింది. భారత సంతతికి చెందిన సమన్విత ధరేశ్వర్ సిడ్నీలోని ఓ ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీలో సిస్టమ్ అనలిస్ట్ గా పనిచేస్తున్నారు. భర్త, మూడేళ్ల బాబుతో పాటు సిడ్నీలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భవతి. ఈ క్రమంలోనే కిందటి వారం భర్త, కొడుకుతో కలిసి సమన్విత వాకింగ్ కు వెళ్లారు. ఆ సమయంలో ఓ బీఎండబ్ల్యూ కారు అతివేగంగా దూసుకొచ్చింది. అదుపుతప్పి పార్కింగ్ లాట్ లోని మరో కారును ఢీ కొట్టింది. దీంతో ఆ కారు కదిలి ముందున్న సమన్వితను బలంగా తాకింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సమన్వితను వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మరణించింది.


## వైట్‌హౌస్‌లో ట్రంప్ విందు - మస్క్ హాజరు



**వాషింగ్టన్, నవంబరు 19:** ట్రంప్– మస్క్‌ల మధ్య విభేదాలు తలెత్తడంతో దూరంగా ఉంటున్నారు. అయితే, ఈ గొడవల తర్వాత తొలిసారిగా ఎలాన్ మస్క్ వైట్‌హౌస్‌లో అడుగుపెట్టడం రాజకీయ, వ్యాపార వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా పర్యటనకు వచ్చిన వేళ, ఆయన గౌరవార్థం అధ్యక్షుడు ట్రంప్ వైట్‌హౌస్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ట్రంప్ ఆహ్వానం మేరకు ఎలాన్ మస్క్ ఈ విందులో పాల్గొన్నారు. మస్క్‌తో పాటు పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో, ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు కూడా హాజరయ్యారు. ప్రభుత్వ విధానాలపై విభేదించి సలహా మండలి నుంచి వైదొలిగిన మస్క్, ఇప్పుడు మళ్లీమస్క్ విందులో పాల్గొన్నారు.

20-11P g6exHMNWJQE 10_20-11P g6exHMNWJQE.qxd 19/Nov/25 11:41 PM Page 1





# చంద్రబాబు 'తిరుగులేని శక్తి'

- ఆనంద్ మహీంద్రా ప్రశంసిస్తూ ట్వీట్
- త్వరలో మిమ్మల్ని ఎపికి ఆహ్వానిస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు రీట్వీట్

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: మహీంద్రా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దృక్పథాన్ని, విధానాలను ప్రశంసించిన అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో చంద్రబాబు రాష్ట్రంలో పెట్టుబడులకు సులభతరమైన వాతావరణం కల్పించేందుకు "ఎస్క్రో సిస్టమ్"ను ప్రవేశపెడతామని ప్రకటించారు. రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకుని, ప్రతి పెట్టుబడిదారుకు హామీ ఇచ్చిన ఇన్సెంటివ్స్‌ను తక్షణమే చెల్లించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ వీడియోను ఎక్స్‌లో పంచుకున్న మహీంద్రా చంద్రబాబును ప్రశంసించారు. "ఈ మనిషి తిరుగులేని శక్తి.. దశాబ్దాలుగా ఆయన అభివృద్ధి విధానాలకు అకర్షితుడ్ని అవుతున్నారు. కొత్త, ముందుకు తీసుకెళ్లే విధానాలు మాత్రమే కాకుండా, తాను, తన చుట్టూ ఉన్నవారందరి ప్రమాణాలను ఎప్పుడూ పెంచుతూ ఉంటారు" అని ప్రశంసించారు. ఈ పోస్టు వైరల్ అయింది. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్‌గా, భారతదేశీయ పారిశ్రామిక రంగంలో ప్రభావవంతమైన వ్యక్తిగా ఆయన అభిప్రాయాలు ఎప్పుడూ చర్చనీయాంశాలు ఉంటాయి. ఆనంద్ మహీంద్రా ప్రశంసలపై చంద్రబాబు స్పందించారు. భారతదేశం అద్భుతమైన వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని నేను గట్టిగా నమ్ముతున్నాననని.. మన బాధ్యత నిరంతరం నూతన ఆవిష్కరణలు చేయడమన్నారు. ప్రజల విస్తారమైన వ్యవస్థాపక శక్తిని అన్‌లాక్ చేయడానికి కొత్త మార్గాలను సృష్టించాల్సి ఉందన్నారు. తాను ఈ ప్రయత్నంలో తన వంతు పాత్ర పోషిస్తున్నాననని చంద్రబాబు తెలిపారు. గత కొన్ని దశాబ్దాలుగా మీ మద్దతు మరియు భాగస్వామ్యం అమూల్యమైనవి. త్వరలో మిమ్మల్ని ఆంధ్రప్రదేశ్‌కు స్వాగతించడానికి తాను ఎదురు చూస్తున్నాననని.. పెట్టుబడుల విషయంలో తగ్గేది లేదని హింట్ ఇచ్చారు.

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

- సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే పెట్టుబడులు
- దేశ భవిష్యత్తుకు యువత చేయి చేయి కలపాలి
- నారా భువనేశ్వరి




కుప్పం, నవంబరు 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరుగుతున్న రాష్ట్రాభివృద్ధిని ఎవరూ ఆపలేరని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా బుధవారం ద్రవిడ వర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి నారా భువనేశ్వరి ప్రసంగించారు. ఎపి రాష్ట్రం సన్‌రైజ్ రాష్ట్రం అన్నారు. సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ తన బాధ్యతలను నెరవేర్చుతున్నారన్నారు. సిఎం చంద్రబాబు ఒక విజన్‌తో రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తున్నారన్నారు. పారిశ్రామికవేత్తలతో కూడా సిఎం చంద్రబాబు మాకోసం కాదు, రాష్ట్రం కోసం రావాలని కోరుతున్నారని పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన సిఐఐ సదస్సులో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలకు అవకాశం రావడం జరిగిందన్నారు. మంత్రి లోకేష్ రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో వైజాగ్‌కు గూగుల్ సంస్థను తెచ్చారన్నారు. ఇప్పటికే వైజాగ్‌లో టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలు వచ్చాయన్నారు. మిట్టల్ గ్రూప్ సైతం రూ.1.40లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రూ.9400 కోట్లతో నెల్లూరులో బిపిసిఎల్ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. కుప్పంలో సైతం ఇటీవలే రూ.2203 కోట్లతో ఏడు పరిశ్రమలు, 23,330 ఉద్యోగాలకు సంబంధించి సిఎం శంకుస్థాపన చేసిన విషయం గుర్తుచేశారు. దేశ భవిష్యత్తుకు యువత చేయి చేయి కలపాలని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

### 2029లోగా అమరావతి నగరం పూర్తి

రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం 2029లో పూర్తవుతుందని సిఎం సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ 2026లో, పోలవరం ప్రాజెక్టు 2027నాటికల్లా పూర్తవుతాయన్నారు. యువత దేశ భవిష్యత్తు కోసం పనిచేయాలన్నారు. మనమంతా భారతీయులం అనే విషయం మరువరాదన్నారు. ద్రవిడ వర్సిటీని దివంగత ఎన్టీఆర్ స్థాపించారని ఈ విశ్వవిద్యాలయాన్ని యూనిక్ వర్సిటీగా చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారు అడిగిన ప్రశ్నలకు నారా భువనేశ్వరి సమాధానం ఇచ్చారు. అంతకుముందు వర్సిటీలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య ఎం. దొరస్వామి, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**- మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్**

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికార యంత్రాంగం దృష్టిలో పెట్టుకోవాలని, అందుకు తగ్గట్టుగా సంక్షేమ ప్రణాళికలు ముందుకు తీసుకెళ్లాలని ఆ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్ సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్షను మంగళవారం నిర్వహించారు. ఉర్దూ అకాడమీ, కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్ధ వినియోగం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధికి రుణాలు తదితర కార్యక్రమాల అమలుపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా చేపట్టిన పనుల పురోగతిని, వివిధ భవన నిర్మాణ పనుల పూర్తికి నిధుల వినియోగం, ప్రధాన మంత్రి విరాసత్‌క సంవర్ధన్ (పిఎం వికాస్), ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పిఎంజెవికె), జాతీయ మైనార్టీల అభివృద్ధి ఆర్థిక సంస్థ పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం, హజ్‌యాత్ర (2026)కు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సిఇఒ మహ్మద్ అలీ, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎ.శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుపై వైఎస్సార్సీ ఫేక్ ప్రచారం: మంత్రి సుభాష్

సచివాలయం, నవంబరు 19 ప్రభాతవార్త: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు కూడా బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని వైసీపీ వక్రీకరించి ఫేక్ ప్రచారం చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవ చేశారు."గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా" విశాఖ పరిరక్షణకు ఎవరేం చేశారని ముఖ్యమంత్రి చెప్పడాన్ని జీర్ణించుకోలేక వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తు కార్మికులను రెచ్చగొడుతుందని ఆయన విమర్శించారు. వైసీపీ 5ఏళ్ళ పాలనలో విశాఖ ఉక్కును తుక్కు కింద పోస్కోకి అమ్మేందుకు విశ్వప్రయత్నాలు చేసిన సంగతి మరచి కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాట్లాడడం సిగ్గు అని పించడం లేదాని మంత్రి సుభాష్ వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాకనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కేంద్రంతో ప్రకటన చేయించడమే కాక ప్లాంట్ పరిరక్షణకు 12 వేల కోట్ల ప్యాకేజి సాధించిన విషయం గుర్తు చేసుకోవాలని వైసీపీకి సూచించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం మరో 2600 కోట్లు ఇచ్చిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ప్రజాధనం వృధా కాకుండా కార్మికులందరూ బాధ్యతగా పనిచేయాలని సిఎం చంద్రబాబు చెప్తే దాన్ని వక్రీకరించి జగన్ అండ్ కో ఫేక్ ప్రచారం చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. వైసీపీ పాలనలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్ధ్యం 20శాతం కాగా నేటి కూటమి ప్రభుత్వంలో అది 79శాతానికి పెరిగిందని కార్మికశాఖ మంత్రి వెల్లడించారు. అప్పట్లో ఒకటి బ్లాస్ట్ ఫర్నేస్ పనిచేయగా ఇప్పుడు మూడు పని చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చి లాభాల బాట పట్టించి ఉద్యోగులు కార్మికులకు అండగా నిలిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రగతికి అడ్డుపడే రాజకీయ అజ్ఞానులు,మంద బుద్ధిగల వారే చంద్రబాబు వ్యాఖ్యాలను వక్రీకరిస్తున్నారంటూ ఆయన వైసీపీ పై మండిపడ్డారు.ప్రతి ఒక్కరూ కష్టపడితేనే సంస్థలకైనా, వ్యక్తులకైనా మంచి భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు చెప్పడం తప్పు ఎలా అవుతుందో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ డిమాండ్ చేశారు.

# శివనామస్మరణతో హోరెత్తిన శ్రీకాళహస్తీశ్వరాలయం



స్వర్ణముఖి నదిలో గంగమ్మకు హారతులిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, నవంబరు 19 ప్రభాతవార్త: హర హర మహాదేవా అంటూ భక్తులు కీర్తిస్తుండగా ఆలయ అర్చకులు భక్తి భావంతో గంగమ్మ తల్లికి హారతులిచ్చారు. నిండుకుండలా స్వర్ణముఖి నదీ ప్రవహిస్తుండగా కార్తీక మాసం అమావాస్య సందర్భంగా గంగా హారతులతో పునీతమైంది. శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున కార్తీక మాసం అమావాస్య పవిత్ర దినమైన బుధవారం రాత్రి 'స్వర్ణముఖి హారతులు' ఏర్పాటు చేశారు. గంగమ్మఅమ్మవారు, మరో వైపు సోమాస్కంద మూర్తి అయిన శివయ్యలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి జలవినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. నభూతో అన్నట్లు హారతుల్ని నిర్వహించారు. స్వర్ణముఖి అందాల్ని హారతుల్ని తిలకించటానికి స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు తండోపతండాలుగా కదలివచ్చారు. స్వర్ణముఖి తీరం భక్త జనులతో కిటకిట లాడింది. శివనామస్మరణతో దద్దరిలింది. హారతులతో పునీతమైంది. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యులు పగడాల మురళి, లక్ష్మమ్మ, దండి రాఘవయ్య, గాదిపాకుల గోపి, వాకచర్ల గుప్తశెట్టి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు రాజేష్ గురుకుల్, కమల్, నిరంజన్ గురుకుల్, పారోహితులు అర్ధగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరులో ఒకరి దారుణ హత్య



పుత్తూరు, నవంబరు 19 ప్రభాతవార్త: అన్నం తినడానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన తిరుపతి జిల్లా పుత్తూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. రవి (35) అనే వ్యక్తి రామ్మూర్తిరెడ్డి (55)ని భోజనం కోసం డబ్బులడిగాడు. డబ్బులివ్వకపోగా తనను తిట్టడంతో ఆ కోపంలో కత్తితో పొడిచి చంపానని నిందితుడు రవి పోలీస్ విచారణలో తెలిపాడు. మిట్టపల్లూరుకు చెందిన రామ్మూర్తిరెడ్డి (55) పుత్తూరు పట్టణంలో నివశిస్తూ విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు తాలూకాలో కేశవరాజకుప్పం గ్రామానికి చెందిన రవి కొన్నాళ్లుగా పుత్తూరులో బికారిగా తిరుగుతున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఆధార్ కార్డు కూడా లేదు. రోడ్లపై ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో రామ్మూర్తి రెడ్డి బుధవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై గొల్లపల్లిలో సమీపంలోని ఒక దాబాలో రోటీలు కొనుక్కొని తిరిగి ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు వెళుతున్నాడు. సరిగ్గా గొల్లపల్లి క్రాస్, రిలయన్స్ పెట్రోలు బంక్ దగ్గర రామ్మూర్తిరెడ్డి వాహనాన్ని నిలిపి భోజనానికి డబ్బులివ్వాలని రవి అడిగాడు. డబ్బులివ్వకుండా ఏ ఊరు నుంచి వచ్చావు, ఇక్కడ ఏం పనిచేస్తున్నావని రామ్మూర్తి రెడ్డి కొంచెం గట్టిగా అడగడంతో ఇద్దరి మధ్య వాగ్యుద్ధం జరిగింది. దాంతో రవి తన దగ్గరున్న చాకుతో రామ్మూర్తి రెడ్డిని పొడిచాడు. దీంతో రామ్మూర్తి రెడ్డి కుప్పకూలిపోయాడు. స్థానికులు అతనిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. రామ్మూర్తిరెడ్డికి వివాహమైంది. పిల్లలు లేరు. ఇదిలా వుండగా వారం రోజుల క్రితం ద్రౌపదిదేవి గుడి వద్ద ఒక సెల్ ఫోన్ దొంగిలిస్తూ దొరికిపోయిన రవిని అక్కడే ఇనుప పైపులకు కట్టి స్థానికులు కొట్టారు. ఆ సంఘటనపై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. హత్య కేసును సిఐ శేఖర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

# నవోదయ విద్యార్థిని ఆత్మహత్య



మర్రిపాడు (నెల్లూరు), నవంబరు 19, ప్రభాత వార్త: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవోదయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రణీత (14) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని విద్యాలయ ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న ప్రణీతను మొదటగా ఆయమ్మ చూసి ప్రిన్స్‌పాల్‌కు చెప్పడంతో ఆమె విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం తెలిపారు. వారు హుటాహుటిన విద్యాలయం చేరుకోగా విగతజీవిగా పడి ఉన్న తమ కుమార్తెను చూసి బోరుమన్నారు. బాలిక తండ్రి కొండాపురం ఎంఇఒగా విధులు నిర్వహిస్తూ నవోదయ విద్యాలయంలో బాలికను చదివిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అందనంత ఎత్తులో ఉన్న ఫ్యాన్‌కు వైరు బిగించి విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ ఘటనపై విద్యార్థిని తండ్రి, కొండాపురం ఎంఇఒ రవికుమార్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమార్తె ఇటువంటి పనులకు పాల్పడే వ్యక్తి కాదని, చదువులోను, క్రీడల్లోను బాగా రాణిస్తుందని ఐపిఎస్ చదవాలనే లక్ష్యంతో తాను కష్టపడి చదువుకుంటుందన్నారు. విద్యాలయంలో అసలేం జరిగిందో తెలియాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు నవోదయ విద్యాలయం లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు ఆంధ్ర విద్యార్థి సంఘం, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

# భోళాశంకరునికి అష్టోత్తర కలశాభిషేకం

**లక్షబిల్వార్చన, కుంకుమార్చనలు ముగింపు**

శ్రీకాళహస్తి, నవంబరు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ సంప్రదాయం మేరకు అష్టోత్తర శత శంఖాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన 'లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు' ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలో భారీ ఎత్తున పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆర్చకులు డాక్టర్ స్వామినాధన్ గురకుల్ సారధ్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితుల వేద మంత్రాలతో ఆలయం దద్దరిల్లింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే లక్ష బిల్వార్చన, కుంకుమార్చనల్లో భాగంగా ముగింపు సందర్భంగా స్వామి గర్భగుడి ఎదురుగా స్వామి అమ్మవార్ల కలశాలను ఏర్పాటు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకంకు 108 కలశాలను ఏర్పాటు చేశారు. పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన కలశాలను ప్రదక్షిణ జరిపారు. ఆ జలాలతో అభిషేకించారు. స్వామి అమ్మవార్ల గర్భగుడుల వద్ద కుంభం (తిరుప్పావడ) నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ధూప దీప నైవేద్యం హారతులు, మంత్రపుష్పం నిర్వహించారు. పది రోజుల పాటు నిర్వహించిన లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలలో వాడిన పత్రి కుంకుమలను భక్తి శ్రద్దలతో సన్నిధి వీధి గుండా ఊరేగింపుగా తీసుకెళ్ళి పవిత్ర జీవనది స్వర్ణముఖి నదిలో నిమజ్జనం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాధ్ వారి కుటుంబసభ్యులు, ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి దంపతులు పాల్గొని సంకల్పం చేశారు. ఏర్పాట్లను ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుదదర్శనం నాయుడు, వెంకటస్వామి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, అనువంశిక ప్రధానార్చకులు డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్, డాక్టర్ స్వామి నాధన్, అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, అచ్చితా గురుకకుల్, సురేష్ గురుకుల్, నిరంజన్ గురుకుల్ వేదపండితులు భక్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్తుల ముఠా అరెస్టు

- 8 మంది నిందితులు కటకటాల్లోకి
- తిరుపతి జిల్లా ఎస్పీ



తిరుపతి, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: డిజిటల్ అరెస్ట్ ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తులను తిరుపతి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. 8మంది నిందితులను అరెస్ట్ చేసి ఇద్దరి జాయింట్ అకౌంట్‌లోని నగదును ఫ్రీజ్ చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. తిరుపతి నగరానికి చెందిన 65ఏళ్ళ సీనియర్ సిటిజన్‌ను లక్ష్యంగా చేసుకుని తెలియని వ్యక్తులు వాట్సాప్‌కాల్ చేసి ముంబై సిబిఐ అధికారులుగా పరిచయం చేసుకున్నారు. 583 కోట్ల రూపాయలు మనీలాండరింగ్ కేసులో అతని పేరు ఉందని చెప్పి భయపెట్టారు. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా విచారణ చేస్తామని నమ్మించి అతని బ్యాంక్ అకౌంట్ నుండి వివిధ ఖాతాలకు డబ్బు పంపాలని ఒత్తిడిచేసి మోసం చేశారు. ఇలా బాధితుడి నుండి ఏకంగా రూ.80 లక్షలు వివిధ రాష్ట్రాల్లోని మ్యూల్ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. బాధితుడు ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సిఐలు శ్రీనివాసులు, వినోద్‌కుమార్ బృందం దర్యాప్తుచేసింది. బాధితుడి ఖాతా నుండి ముందుగా రెండు మ్యూల్ అకౌంట్లకు అక్కడ నుండి 14 ఇతర రాష్ట్రాల్లోని ఇతర ఖాతాలకు, చివరకు గేమింగ్‌యాప్ వినియోగదారుల ఖాతాలకు నిధులు చేరినట్లు కనుగొన్నారు. ప్రధాన నిందితుడు కోటిబాబు టెలిగ్రామ్ ద్వారా హర్యానాలోని డానియల్, చైనాకు చెందిన టియాన్ ఇంకా డి పేర్లతో ఉన్న విదేశీ నెట్‌వర్కుతో సంబంధాలున్నట్లు తెలిసింది. 2024 జనవరిలో కోటిబాబు కంబోడియాకు వెళ్ళి 24రోజులు అక్కడ సైబర్‌మోసగాళ్ళ నెట్‌వర్కుతో కలసి పనిచేశాడు. తిరిగి వచ్చిన అతను శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రశాంతిరెడ్డి, గౌతమ్ వంటి వ్యక్తుల ద్వారా భారీ సంఖ్యలో మ్యూల్ అకౌంట్ ఖాతాలను సేకరించినట్లు నిర్ధారించారు. ముద్దాయిల బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.2.5లక్షల నగదును ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అరెస్టయిన ముద్దాయిల్లో అనంతపురం జిల్లాకు చెందిన దండే క్రాంతికుమార్, నిమ్మల పవన్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు, రాజమండ్రి ప్రాంతానికి చెందిన పరసాల శ్రీనివాస్, బళ్లారి జిల్లాకు చెందిన మరకట్టు చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, గౌతమ్ ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి. డిఎస్పీ భక్తవత్సలం, సిఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.

# నెల్లూరులో పంచలోహ కృష్ణుని విగ్రహం చోరీ

**గంటల వ్యవధిలో నిందితుడి అరెస్ట్, విగ్రహం స్వాధీనం**

**ప్రశంసలందుకున్న సంతపేట పోలీసులు**



నెల్లూరు క్రైమ్, నవంబరు 19 ప్రభాతవార్త: పంచలోహ కృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లారు. ఫిర్యాదు అందుకున్న సంతపేట పోలీసులు గంటల వ్యవధిలో నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి సంతపేట పోలీసు స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.వి సోమయ్య వివరాలను వెల్లడించారు. కామాటివీధిలో సంతాన బాలగోపాల కృష్ణమందిరం ఉంది. వాచ్‌మెన్ అంకయ్య రోజులాగానే బుధవారం ఉదయం ఆలయం గేట్లు తెరచి పనులు చేసుకుంటుండగా గుర్తుతెలియని దుండగుడు లోనికి ప్రవేశించి గర్భగుడిలోని పంచలోహ కృష్ణుని ఉత్సవ విగ్రహం, ఇత్తడి గంటను అపహరించుకుని వెళ్లారు. అర్చన చేసేందుకు ఆలయంకు వచ్చిన పూజారి రఘునందన్ ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ సీహెచ్ భాస్కర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. దీంతో భాస్కర్ చోరీ ఘటనపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సోమయ్య కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌లు ఆధారంగా నిందితుడు నార్తురాజుపాలెంకు చెందిన పాత నేరస్థుడు వెంకయ్యగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా కోటమిట్టకు చెందిన షేక్ షఫికి విగ్రహం విక్రయించినట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు షఫిని అదుపులోకి తీసుకుని చోరి సొత్తు స్వాధీనం చేసుకుని నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.లక్ష వరకు ఉంటుంది. వెంకయ్యపై చీరాల రైల్వే పోలీసుస్టేషన్‌లో, ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో దొంగతనం కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సంతపేట సీఐ వైవి సోమయ్య ఇతర సిబ్బందిని టౌన్ ఇన్చార్జి డిఎస్పి గిరిధర్, రూరల్ డిఎస్పి శ్రీనివాసరావులు అభినందించారు.

# విద్యుత్తు చార్జీల్లో రూ.12,717 కోట్ల ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలి

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారులపై రూ.12,717 కోట్ల ట్రూఅప్ భారాలు వేయాలన్న ప్రతిపాదన తిరస్కరించాలని ప్రజాసంఘాలు, విద్యుత్ నిపుణులు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)ని కోరారు. నాలుగో నియంత్రిత ఐదేళ్లలో (2019-20 నుంచి 2023-24) ఫీలింగ్, రిటైల్ విద్యుత్ విక్రయాలకు విద్యుత్ సంస్థలు చేసిన ఖర్చు వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తానికి మధ్య వ్యత్యాసాన్ని ట్రూఅప్ కింద వసూలుకు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్సీలో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో కమీషన్ ఇన్‌ఛార్జి చైర్మన్ పీవీఆర్ రెడ్డి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు హాజరై, ట్రూఅప్ కింద డిస్కంలు చేసిన ప్రతిపాదన తిరస్కరించాలని కోరారు. 'వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్లు ట్రూఅప్ భారాలు వేసింది. అదే బాటలో కూటమి ప్రభుత్వం వెళ్తోంది. ట్రూడౌన్ పేరుతో రూ.923 కోట్లు ప్రజలకు ఇచ్చి... రూ.12,717 కోట్ల భారం వేయడం భావ్యమేనా? ఇప్పటికే రూ.15,845 కోట్ల అదనపు భారాలు ప్రజలు భరిస్తున్నారు' అని బాబూరావు పేర్కొన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) నిర్ధేశించే విధానంలో లోపాలున్నాయని, ఈ నేపథ్యంలో ఎఫ్‌పీపీసీఏ పూర్తిగా తొలగించాలని విద్యుత్‌రంగ నిపుణులు వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక తరపున ఆంజనేయులు, సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తరపున గోపీనాథ్, ఫ్యాప్సీ తరపున వైదేహి, ఏపీ ఫెర్రో అల్లాయీస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తరపున విజయగోపాల్‌రెడ్డి వర్చువల్‌గా హాజరై ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలని కోరారు.

20-11P@g7exHMNWJQE 11_20-11P@g7exHMNWJQE.qxd 19/Nov/25 11:48 PM Page 1



# రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తాం

- ధాన్యం సేకరించిన గంటలలోనే రైతుల ఖాతాలో సొమ్ము జమ
- ముదినేపల్లిలో మంత్రి నాదెండ్ల మనోహర్

ముదినేపల్లి/ ఏలూరు, నవంబరు 19 ప్రభాత వార్త: తమది రైతు ప్రభుత్వమని విత్తనం నుండి విక్రయం వరకు అన్ని విధాలా రైతు వెన్నంటి ఉండి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ముదినేపల్లిలో పచ్చని పొలాల మధ్య పండగ వాతావరణంలో బుధవారం జరిగిన అన్నదాతా సుఖీభవ.. పీఎం కిసాన్ పథకం రెండవ విడత కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి నమూనా చెక్కును మంత్రి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ పథకం రెండవ విడతలో 1,60,968 మంది రైతుల ఖాతాలకు రూ. 106.23 కోట్లు జమచేశామన్నారు. అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ పథకంలో సంవత్సరానికి రూ.20 వేలు మూడు విడతలుగా అందించడం జరుగుతుందని, దీనిలో రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, 6 వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేసేందుకు ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టాలను కేంద్ర బృందం పరిశీలించింది, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు వాట్సాప్ ద్వారా తమ దగ్గరలోని రైస్ మిల్లులు తెలుసుకోవడం, రైతుకు అనువైన మిల్లులో అమ్మడం వంటి వెసులుబాటు కల్పించామన్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్లల్లో రాష్ట్రంలోని 4 వేల రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు 16 వేల మందిని సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. గత వ్యవసాయ సీజన్లో రైతులకు 50 వేల టార్పాలిన్లు 50 శాతం సబ్సిడీపై అందించామని,





ప్రస్తుతం రైతులకు పూర్తి సబ్సిడీతో టార్పాలిన్లు అందిస్తున్నామని, వీటిలో కౌలు రైతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగానే తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. అభిషేక్ గౌడ, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాష, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మూర్తి, ఉద్యానవన శాఖాధికారి షాజా నాయక్, రైతు సంఘాల నాయకులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు (నెల్లూరు), నవంబరు 19 ప్రభాతవార్త: ఆత్మకూరులో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.సత్యవతి అధ్యక్షతన జిల్లాస్థాయి అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్2025-26 సంవత్సరానికి సంబంధించి 2వ విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో బుధవారం స్థానిక శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డినమాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 46.22లక్షల మంది రైతులకు 3,077 కోట్లు రూపాయలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జమచేశారని, జిల్లా స్థాయిలో 1,95,866మంది రైతులకు రూ.130.20 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో 34,223 మంది రైతులకు రూ.22.95 కోట్లు మంది లబ్ధిపొందారన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని రైతులకు అన్ని విధాల అండగా ఉంటూ ఎన్నికల హామీ మేరకు 2వ విడత కూడా అన్నదాత సుఖీభవ నిధులను సిఎం జమ చేశారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడుక



మనమందరం తోడుగా ఉండాలన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్, ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏరఅ్పటుకు ఎంపి వేమిరెడ్డితో కలిసి కృషా చేస్తానన్నారు. ఈరెండు ప్రధాన సమస్యలపై సిఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని సిఎం దృష్టికి తెసుకెళ్ళి వీటి సాధనకు కృషి చేస్తామన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయితే మర్రిపాడు వరకు సోమశిల జలాలతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. ఈ కాలువ ద్వారా 90వేల మంది జనాభాకు తాగునీరు, 65వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను సిఎం చంద్రబాబు నాయుడు సమర్ధవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఒక్కో రైతుకు 7వేలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ముందుకు నడిపిస్తున్నారన్నారు. తొలుత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సంక్షేమంలో ఎపి నంబర్ వన్

తోటపల్లి గూడూరు (నెల్లూరు), నవంబరు 19 ప్రభాతవార్త: సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడతలో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు గా రైతుల ఖాతాల్లోకి రూ. 3135 కోట్లు జమవుతున్నాయని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ. 19.57 కోట్లు అందుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తోందని, గత ప్రభుత్వంలో మూడు విడతల్లో ఇచ్చిన రూ.13,500 కంటే ఎక్కువగా రెండు విడతల్లోనే రూ.14 వేలు ఇచ్చామని గుర్తు చేశారు. మరో రూ.6 వేలను మూడో విడతలో ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో మునుపటి ప్రభుత్వంతో పోల్చితే కూటమి పాలనలో నాలుగేళ్లకు అదనంగా రూ.12,088 కోట్లు రైతులకు అందుతాయని పేర్కొన్నారు. సంక్షేమంలో ఏపీ దేశంలో అగ్రగామి వృద్ధులు, వితంతువులకు ఇవ్వబడుతున్న రూ.4 వేల పింఛన్ దేశంలో ఎక్కడా లేదని, ఎన్టీఆర్ భరోసా కింద ఏపీ ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాన్ని ప్రతి బిడ్డకు విస్తరించడం వంటి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వ హైలైట్స్‌గా పేర్కొన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు అసత్యాలని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సోమిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజధాని రైతులతో ప్రతినెలా సమావేశం

- సిఆర్‌డిఏ కమిషనర్ కె.కన్నబాబు

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని పరిధిలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మూడో శనివారం రైతుల జెఏసితో సమావేశం నిర్వహిస్తామని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. రాజధాని సమగ్ర ప్లాను అమలు, నోటిపై చేసిన డ్రాఫ్ట్ ప్లాను, గైడ్‌లైన్స్ అంశాలను వివరించేందుకు సిఆర్‌డిఏ కార్యాలయంలో రైతు ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమరావతి బ్లూప్లాను, రోడ్లు, కాలువలు, రిజర్వాయర్లు, రోడ్ల వెంట గ్రీనరీ, నడక, సైకిల ట్రాక్, విద్యుత్ లైన్లు, మంచినీటి పైపులైన్లు వంటివి ఎలా ఉంటాయి. వాటిని ఎలా వినియోగిస్తామనే అంశాలను అధికారులు, కమిషనర్ రైతులకు వివరించారు. అనంతరం రైతులు జెఏసి తరుపున సమర్పించిన 14 డిమాండ్లను లేవనెత్తారు. గ్రామ కంతాలు, అబ్బురాజుపాలెం, దొండపాడు, బోరుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 150 ఎకరాలకు సంబంధించిన జరీబు భూముల అంశంతోపాటు ఫ్లోర్‌స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ) పెంపుదల అంశాలను ప్రస్తావించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ కొన్నిటిని పరిష్కరించామని, గ్రామ కంతాలు, జరీబు భూముల అంశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ త్రీమెన్ కమిటీ ఇటీవల దీనిపై సమావేశం అయిందని, కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈనెల 21, 22 తేదీల్లో మరోసారి సమావేశం అవుతుందని, అప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆ సమావేశానికి అవసరమైతే జెఏసి ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. దీంతోపాటు ప్రతి నెలా మూడో శనివారం రైతుల జెఏసితో సమావేశం అవుతామని, అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని చెప్పారు. అయితే గ్రీవెన్స్ పెడుతున్నారని, రైతులు ఇచ్చిన వినతిపత్రాలు చెత్తబుట్టలో వేస్తున్నారని పట్టించుకోవడం లేదని జెఏసి సభ్యులు తెలిపారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, స్వయంగా తానే గ్రామాల్లోకి వచ్చి రైతుల వద్ద సమస్యలు తెలుసుకున్నాని, అటువంటప్పుడు పరిష్కారం చేయడానికి ఇబ్బందులు ఏమి ఉంటాయని ప్రశ్నించారు. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ ప్రస్తుతం 2.8 ఇచ్చారని, దీన్ని 5కు పెంచాలని రైతులు కోరారు. కనీసం 3.5 అన్నా ఇవ్వాలని కోరారు. దీనికి కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ పెంచితే ఇబ్బందులు పడతారని, బిల్డర్లతో సమస్యలు వస్తాయని తెలిపారు. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం తరువాత సమావేశంలో వివరిస్తానని అన్నారు. రాజధానిని గుర్తిస్తూ గెజిట్ ఇచ్చే అంశం ఇంతకాలం ఎందుకు పెండింగ్లో ఉందని రైతులు అడిగారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఇప్పటి వరకూ దేశంలో ఏ రాజధానికి గెజిట్ లేదని అమరావతికి అవసరం ఏముందని అన్నారు. హైదరాబాద్ నగరానికి కూడా గెజిట్ లేదని చెప్పారు. దీనిపై రైతులు మాట్లాడుతూ విభజన చట్టంలోనే హైదరాబాద్ పది సంవత్సరాలు రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారని, అందువల్లే గెజిట్ అని అడిగామని తెలిపారు. ఇదే అంశంపై తాము కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళితే గెజిట్ ఇచ్చేందుకు అంగీకరించారని, అయితే న్యాయ విభాగం అధికారులు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారని తెలిపారు. వాటిని కూడా క్లియర్ చేస్తున్నామని, డిసెంబర్లో జరిగే పార్లమెంటు సమావేశాల్లో అమరావతికి సంబంధించిన బిల్లు పెట్టే అవకాశం ఉందని కమిషనర్ రైతులకు తెలిపారు. గ్రామాల్లో నుండి రోడ్లు వేసేందుకు తీసుకున్న ప్లానులో కొన్నిచోట్ల కొద్దిస్థలాన్ని వదిలేస్తున్నారని తెలిపారు. వాటిని దుకాణాలు నిర్మించుకుని వినియోగించుకునేలా ప్లాను చేస్తున్నామని కమిషనర్ రైతులకు తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఇచ్చిన ప్లాట్లకు సంబంధించి సరిహద్దు రాళ్లు కనిపించడం లేదని, ఆందోళనలో ఉన్నారని రైతులు తెలపగా పనులు జరుగుతున్న నేపథ్యంలో పగ్‌మార్కు చూపిస్తామని అక్కడ నుండి డెవలపర్ అభివృద్ధి చేసిన తరువాత రైతులకు ఇచ్చే సమయంలో రాళ్లు వేసి ఇస్తామని కమిషనర్ అన్నారు. ఇప్పుడు సరిహద్దు రాళ్లు పెట్టినా మెరకతోలాల్సి ఉంటుందని, అనంతరం కనిపించకుండా పోయే అవకాశం ఉన్న నేపథ్యంలో లేఅవుట్లు అభివృద్ధి తరువాత సరిహద్దు రాళ్లను పెట్టి ఇస్తామని కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ భార్గవతేజ హాజరయ్యారు.



# రైతులకు అండగా సహకార బ్యాంకులు నిలవాలి

బుచ్చి (నెల్లూరు), నవంబరు 19, ప్రభాతవార్త: సహకార బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంకులో నిర్వహించిన 72వ అఖిలభారత సహకార వారోత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కో ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రంలో బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకు అగ్రస్ధానంలో ఉందని ఆమె ప్రశంసించారు. గత ప్రభుత్వ పాలనలో వవ్వేరు బ్యాంకు నిర్వహణ అస్తవ్యస్తంగా మార్చి వేశారని. ప్రస్తుతం ఈ బ్యాంకు అభివృద్ధిని కాంక్షించి దొడ్ల విజయలక్ష్మిని బ్యాంకు చైర్మన్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. వవ్వేరు బ్యాంకు 145 కోట్లా 27 లక్షలు టర్నవర్ సాధించడం అభినందనీయమని అన్నారు. ధాన్యం అరబెట్టుకునే కల్లాలు, నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు నష్టపోతున్నారని రైతుల ప్రయెజనాలను దృష్టిలో ఉంచుకొని కల్లాలు, గోదాములు నిర్మించేందుకు సహకార బ్యాంకులు ముందుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి గుర్రప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, జిల్లా సహకార ఆడిటర్ అధికారి కాటసాని తిరుపతిరెడ్డి, విభాగేయ సహకార కోశాదికారి పోలిశెట్టి రాజశేఖర్, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నగర అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, గౌరవాద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, బ్యాంకు సిఇఒ మన్నారపు శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం రూలర్ బ్యాంకు చైర్మన్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రేబాల నీటి సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, అగ్రికల్చర్ ఏడి అనిత, నాయకులు వింజం రామానాయుడు,దొడ్ల కోదండరామిరెడ్డి, మైనార్టీ నాయకులు పఠాన్ మహబూబాషా, నారసింహారెడ్డి, బత్తల హరికృష్ణా, కౌన్సిరల్ రాచూరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మొగళ్లూరు వెంకట శేషయ్య, బిజెపి నాయకులు చేవూరు వినయ్‌నారాయణ, కాసా శ్రీనివాసులు, రూరల్ బ్యాంకు డైరక్టర్ మాచవరం శ్రీనివాసులు, వవ్వేరు బ్యాంకు డైరక్టర్ మద్దిసాని మాల్యాద్రి, కోవూరు పద్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# పన్నుల రాబడి అదుర్స్

## అక్టోబరు నెలాఖరుకు

## రూ.82,983.17 కోట్లు



విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడి అంచనాలకు అనుగుణంగా ఉంది. గడిచిన ఏడు నెలల్లో పన్నుల ద్వారా ఆదాయంగా ఆశించిన స్థాయిలోనే ఉండటమూ కాకుండా ఆ మొత్తంలో సగం మేర ఖజానా కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్ర పన్నుల రాబడి రూ.1,66,573.09 కోట్లుగా అంచనా వేశారు. అక్టోబరు నెలాఖరుకు రూ.82,983.17 కోట్ల వచ్చింది. ఏడు నెలల్లో సగం రాబడి సాధించింది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్ళలో 52.49%, అమ్మకపు పన్నులో 49.10%, కేంద్ర పన్నుల్లో వాటా 56% సాధించింది. మొత్తం మీద రాష్ట్ర రెవిన్యూ రాబడి రూ.91,638 కోట్లకు చేరింది. ఇది ఏడాది మొత్తం అంచనాల్లో 42.04%.

### అప్పులు రూ.67,283,53 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.79,926.89 కోట్ల నికర అప్పు తీసుకుంటామని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. ఏడు నెల్లలో రూ.67,289.53 కోట్ల నికర రుణం కాగ్ లెక్కల్లో చూపించారు. ఇందులో రూ.37,178.69 కోట్ల నికర ప్రజా రుణం, మరో రూ.30,104.83 కోట్ల నికర ప్రజా ఖాతా మొత్తాలు వినియోగించుకున్నట్లు వివరించారు.

### పన్నుల రాబడికి తోడు పన్నేతర రాబడి

కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు కలిపి మొత్తం కలిపి మొత్తం రూ.91,638.98 కోట్ల రెవిన్యూ రాబడి ఈ ఏడు నెల్లలో సాధించారు. అప్పులు తదితర మూలధన వసూళ్ళు కూడా కలిపి మీద ఏడు నెల్లలో రూ.1,58,960 కోట్లు ఖజానాకు చేరాయి.

### ఆస్తుల సృష్టికి రూ.13,942.50 కోట్లు

ఏడు నెల్లలో రాష్ట్రం ఆస్తుల సృష్టికి ఉపయోగపడే ఖర్చు రూ.13,942.50 కోట్లు చేసింది. ఇది బడ్జెట్ అంచనాల్లో దాదాపు 35% రెవిన్యూ ఖర్చులను రూ.1,39,444.97 కోట్లుగా పేర్కొంది. రెవిన్యూ రాబడితో పోలిస్తే ఖర్చు ఎక్కువగా ఉంది. రెవిన్యూ లోటు బడ్జెట్ అంచనాల్లో ఏడు నెలలకు 144.05% ఉంది. ఏడాది అంచనాలతో పోలిస్తే రెవిన్యూ లోటు ఇప్పటికే 44% అధికంగా ఉంది.

# విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు ఏపీ ఖనిజ అభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) ఆలోచన చేస్తున్నది. ఇందులో భాగంగా ఆఫ్రికన్ దేశాల్లో గనులు దక్కించుకోవాలనే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసింది. తద్వారా తవ్వకాలు చేసి సంస్థకు అదనపు రాబడి పెంచుకోవాలని భావిస్తోంది. సంస్థకు దశాబ్దాల తరబడి మంగంపేట ముగ్గురాయి తవ్వకాల్లో అనుభవం ఉంది. చీమకుర్తిలో గ్రానైట్ లీజులను కూడా నిర్వహిస్తోంది. కొంతకాలంగా మధ్యప్రదేశ్‌లోని సులియారీలో బొగ్గు గనుల్లో తవ్వకాలు ఆరంభించింది. ఈ అనుభవంతోనే విదేశాల్లో లీజులు తీసుకోవాలని భావిస్తోంది. మన రాష్ట్ర పరిధిలోని బొగ్గు గనులకు ప్రభుత్వ రంగ సంస్థ టెండర్లు వేసి, పోటీలో నిలవాలని సీఎం చంద్రబాబు ఇటీవల సూచించారు. దీంతో

### ఎపి ఖనిజ అభివృద్ధి సంస్థ ఆలోచన

ఏలూరు జిల్లాలోని చింతలపూడి, సోమవరం బొగ్గు బ్లాక్‌లకు టెండర్లు వేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. సోమవరం బ్లాక్‌లో సగటున జి13 రకం బొగ్గు లభిస్తుంది. ఇది 38.08 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. చింతలపూడి బ్లాక్‌లో సగటున జి12 రకం బొగ్గు లభిస్తుంది. బ్లాక్ 12.04 చదరపు కిలోమీటర్ల మేర ఉంది. సోమవరం, చింతలపూడి బొగ్గు బ్లాక్‌ల్లో భూగర్భ మైనింగ్ చేయాలని భావిస్తోంది. అలా చేస్తే గనక సంస్థకు గిట్టుబాటు కాదని కొందరు నిపుణులు అంటున్నారు. దీనికి బదులుగా ప్రత్యేక పద్ధతిలో భూమి లోపలి నుంచి మీథేన్ గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని సూచిస్తున్నారు. అయితే ఈ బ్లాక్‌లకు టెండర్లు దాఖలు చేసేందుకు డిసెంబరు 24 వరకు గడువు ఉంది. ఆ లోపు అధ్యయనం చేసి బిడ్లు వేసేందుకు ఏపీఎండీసీ సిద్ధమవుతుంది. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసీ) ఇప్పటికే వివిధ దేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు ఆరంభించింది. అదే విధంగా ఏపీఎండీసీ కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. ఆఫ్రికాలో లభించే ఇనుప ఖనిజం, బొగ్గుతో పాటు పలు ముఖ్య ఖనిజాల గనులు తీసుకోవాలనుకుంటోంది. ఇందుకు ఏదైనా ప్రైవేటు సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టులు చేపట్టాలని చూస్తోంది. ఏ దేశాల్లో ఏ గనులు దక్కించుకుంటే రాబడి వచ్చే అవకాశం ఉందో అధ్యయనం చేయాలంటూ సలహా సంస్థ కేపీఎంజీని ఆదేశించింది. ఈ మేరకు కసరత్తు మొదలైంది. త్వరలో దీనిపై ముందడుగు పడే అవకాశం ఉందని ఏపీఎండీసీ వర్గాలు తెలిపాయి.

# 15మంది మావోలకు రిమాండ్

## రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

తాడేపల్లిగూడెం, నవంబరు 19 ప్రభాతవార్త: ఏలూరు గ్రీన్ సిటీలో పట్టుబడిన 15 మంది మావోయిస్టులకు జిల్లా కోర్టు 14రోజులు రిమాండ్ విధించింది. మావోయిస్టులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించింది. విజయవాడలో పట్టుబడిన 24 మంది మావోయిస్టులకు కూడా కోర్టు రిమాండ్ విధించింది. మరో నలుగురు మావోయిస్టులకు వయోపరిమితి నిర్ధారించాలని కోర్టు ఆదేశించింది. తొలుత ఏలూరులో అరెస్టు చేసిన మావోయిస్టులను విజయవాడలో జరిగిన ప్రెస్ మీట్ కు పోలీసులు తరలించారు. అనంతరం మావోయిస్టులను విజయవాడ నుండి ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లోనే అరెస్ట్ అయిన మావోయిస్టులకు మెడికల్ టెస్టులు చేశారు. అనంతరం 15 మంది మావోయిస్టులను ఏలూరు జిల్లా కోర్టులో హాజరుపరిచారు.

# ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో నిన్న, ఈరోజు జరిగిన వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి, అరెస్టు చేసి కోర్టు ముందు ఉంచే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు అన్యాయంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయని తెలిపారు. చట్ట విరుద్ధమైన భూటకపు ఎన్‌కౌంటర్లను సిపిఐ(యం) ఖండిస్తున్నదన్నారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి నగరాల్లో పోలీసులు దాడులు చేసి 50 మందికి పైగా మావోయిస్టులు, వారి అనుయాయులను నిర్బంధించా రని, వివిధ చోట్ల నిర్బంధించబడిన వీరిని వెంటనే సంబంధిత న్యాయ స్థానాల ముందుంచాలని సిపిఐ(యం) కోరుతున్నదన్నారు. అమాయక గిరిజనులపై వేధింపు లను, నిర్బంధాన్ని వెంటనే నిలిపివేయాలని, సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రాపిడో పేరుతో తిరుపతిలో శ్రీకాకుళం భక్తుడి దోపిడీ

తిరుపతి, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో నేరస్తులు కొత్త పంథాలో దోపిడీకి పాల్పడుతున్నారు. నగరంలో ఆటోకోసం నిరీక్షిస్తున్న శ్రీకాకుళంజిల్లాకు చెందిన ఓ భక్తుడిని రాపిడో పేరుతో ద్విచక్ర వాహనదారుడు మోసం చేసి ఆపై ముళ్ళచెట్లలోకి తీసుకెళ్ళి మెడలోని బంగారుగోలుసును లాక్కెళ్ళాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. అలిపిరి పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీధర్ బళ్ళారిలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. కుటుంబం నెల్లూరు నగరం వైఎస్ఆర్ కాలనీలో ఉంటుంది. కుటుంబసభ్యులతో కలసి మంగళవారం తిరుమలకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం శ్రీవారి దర్శనానంతరం బుధవారం ఉదయం తిరుపతికి చేరారు. తిరుగుప్రయాణంలో కుటుంబసభ్యులు నెల్లూరుకు వెళ్ళగా శ్రీధర్ బళ్ళారి వెళ్ళేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో వేచివున్నాడు. అప్పటికే రాపిడో పేరుతో అక్కడకు వచ్చిన యువకుడు అతనిని ఎక్కించుకుని మంగళం ఉపాధ్యాయనగర్ వైపు వెళ్ళాడు. అప్పటికే అక్కడ ఉన్న కొందరు మద్యం సేవిస్తూ శ్రీధర్‌పై దాడి చేశారు. అతని మెడలోని బంగారు చైను లాక్కెళ్ళారు. గట్టిగా బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు గమికూడారు. సమాచారం పోలీసులుకు చేరడంతో అలిపిరి పోలీసులు వచ్చేలోపు కొందరు పరారయ్యారు. ఒకరు పట్టుబడ్డాడు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకుని మిగిలిన వారికోసం గాలింపు చేపట్టారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదుతో మహేశ్, వివేక్, జాఫర్, అఖిల్, ప్రభుదాస్, చందు అనుమానితులపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ఎస్ఐ లోకేశ్ సిబ్బందితో సిసికెమెరాల పుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్నారు. తిరుపతిలో కొత్తరకం దోపిడీ జరగడంతో యాత్రికులు, పోలీసులు కొంత అలర్ట్ అయ్యారు.



# దుర్గమ్మ ఆలయంలో భవానీ దీక్షల విరమణ

- ముమ్మర ఏర్పాట్లు...
- ఇఓ పరిశీలన

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో జరగబోయే భవానీ దీక్షల విరమణల కోసం ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు, స్నానాల ఘాట్లు, క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాల కౌంటర్లు, కేశఖండన శాలలు, ట్రాఫిక్ నియంత్రణ తదితరాల కోసం ఆలయ ఇఓ వికె శీనా నాయక్, డిసిపి గుణ్ణం రామకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వెస్ట్ ఎసిపి దుర్గారావు, సిఐ గురుప్రసాద్, పోలీస్ బృందంతో కలసి పరిశీలన చేసిన అనతరం ఇఓ మాట్లాడుతూ మరోమారు కలెక్టర్, విజయవాడ సిపి లతో కలిసి పరిశీలన చేస్తామన్నారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు



దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. బిల్వార్చన వేదోక్తంగా చేశారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, పంచ హారతులు, మహానివేదనలు గావించారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారిని ఎంపి కేశినేని చిన్ని బుధవారం దర్శించుకున్నారు.



# ఫిడే వరల్డ్ కప్‌లో అర్జున్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో ఎరిగైసి అర్జున్ క్వార్టర్స్‌లోనే ఓడిపోయాడు. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్రచారం ముగిసింది. గోవాలో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ టైబ్రేక్‌లో గ్రాండ్ మాస్టర్ అర్జున్ చైనా గ్రాండ్ మాస్టర్ వీ యి చేతిలో పరాజయం చెంది టోర్నీ నుండి నిష్క్రమించాడు. క్వార్టర్‌ఫైనల్ దశలో పోటీలో మిగిలి ఉన్న ఏకైక భారతీయుడు అర్జున్ రెండు క్లాసికల్ గేమ్‌లను డ్రా చేసుకున్న తర్వాత, టైబ్రేక్ లో ఎదురీత తప్పలేదు. ఎల్లప్పుడూ క్లిష్టమైన పోటీగా ఉన్న టైబ్రేక్‌లో తెలంగాణలోని వరంగల్‌కు చెందిన 22 ఏళ్ల అర్జున్ మొదటి టైబ్రేక్ గేమ్‌లో బ్లాక్‌తో ఫ్రెంచ్ డిఫెన్స్ కోసం వెళ్లాడు. అయితే మధ్య గేమ్‌లో ఈ భారత ఆటగాడు ఇబ్బందుల్లో ఉన్నట్లు అనిపించింది. కానీ 27వ ఎత్తుగడలో వీ చేసిన పొరపాటు సురక్షితమైన ఎత్తుగడను ఎంచుకోవడం, అర్జున్ తిరిగి ఆటలోకి అడుగుపెట్టడానికి వీలు కల్పించింది. తద్వారా 66 ఎత్తుగడల తర్వాత ఆట డ్రాగా ముగిసింది. ఇక 2023 ఎడిషన్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌లో టైబ్రేక్‌లో ఆర్ ప్రజ్ఞానంద చేతిలో ఓడిపోయిన అర్జున్, రెండో గేమ్‌లో వైట్‌తో విజయం సాధించాలంటే వీ పెట్రోవ్ డిఫెన్స్‌ను బద్దలు కొట్టాల్సి వచ్చింది. అయితే, వీ 28వ ఎత్తుగడ ద్వారా విజయ ప్రయోజనాన్ని పొందారు. కానీ వీ చివరికి 79 ఎత్తుగడల తర్వాత తన సి బంటును రాణిగా ప్రమోట్ చేసి, అర్జున్‌ను ఇరుకున పెట్టడం ద్వారా భారత్ ఆశలను తుడిచిపెట్టాడు.



# టోక్యో డెఫ్లింపిక్స్‌లో అభినవ్, ప్రాంజలికి స్వర్ణం

**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్ 2025, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ షూటర్లు అభినవ్ దేశ్వాల్, ప్రాంజలి ప్రశాంత్ ధుమల్ స్వర్ణం సాధించారు. అలాగే 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో కుషాగ్ర సింగ్ రజావత్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. బుధవారం టోక్యోలో జరిగిన 25వ డెఫ్లింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఈ భారత జంట చైనీస్ తైపీకి చెందిన యాజు కావో-మింగ్‌జుయి హ్సుపై 16-6 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. ఇప్పటివరకు, టోక్యోలో భారత షూటర్లు మాత్రమే పతకాలు సాధించారు, మొత్తం 11 పతకాలు గెలుచుకున్నారు. అభినవ్ మరియు ప్రాంజలి స్వర్ణ పతక పోటీ ప్రారంభం నుండి తమ ఆధిపత్య స్థానాన్ని నిలబెట్టుకున్నారు. దీంతో అభినవ్ 287, ప్రాంజలి 282 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానంలో నిలిచారు. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో, కుషాగ్రా 224.3 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

# వరల్డ్ కప్‌కు స్పెయిన్ అర్హత




**న్యూఢిల్లీ:** టర్కీతో 2-2తో డ్రా అయిన తర్వాత స్పెయిన్ 2026 ఫిఫా ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. ఈ ప్రపంచ కప్‌తో స్పెయిన్ టోర్నమెంట్‌లో 17వ సారి పాల్గొంటుంది. 1978లో ప్రారంభమైన అర్హత పరంపరను కొనసాగిస్తోంది. అయితే 2010లో మాత్రమే టైటిల్ వచ్చింది. సెవిల్లెలో టర్కీతో జరిగిన 2-2 డ్రా తర్వాత స్పెయిన్ 2026 ప్రపంచ కప్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. యూరోపియన్ ఛాంపియన్ నాల్గవ నిమిషంలోనే డాని ఓల్మో ద్వారా తొలి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ గ్రూప్‌ను కైవసం చేసుకోవడానికి ఏడు గోల్స్ విజయం అవసరమైన టర్కీ, 42వ నిమిషంలో డెనిజ్ గుల్ ద్వారా స్కోరును సమం చేయగలిగింది. 54వ నిమిషంలో సలీహ్ ఓజ్కాన్ బాక్స్ చేసిన గోల్‌తో టర్కీ ఘంగుతింది. క్వాలిఫయర్‌లో స్పెయిన్ ఒయర్జాబల్ ఎనిమిది నిమిషాల తర్వాత మ్యాచ్‌ను సమం చేశాడు. లామినే యమల్, రోడ్రి, డాని కార్వాజల్, పెడ్రి, డీన్ హుయిజ్సెన్ వంటి కీలక ఆటగాళ్లు లేకపోయినా స్పెయిన్ ఉత్సాహంగా ప్రారంభమైంది. నాల్గవ నిమిషంలో మార్క్ కుకురెల్లా తక్కువ క్రాస్ ఇచ్చిన తర్వాత అది ఆధిక్యంలోకి వచ్చింది. దాన్ని ఫాబియన్ రూయిజ్ డమ్మీ చేయగా, ఓల్మో డిఫెండర్‌ను దాటి బంతిని నెట్‌లోకి వెళ్ళేలా చేశాడు. విరామం తర్వాత, విన్సెంజో మోంటెల్లా నాయకత్వంలోని టర్కీ ఆత్మవిశ్వాసం పెంచుకుని 55వ నిమిషంలో ఆధిక్యంలోకి వెళ్లింది. ఓజ్కాన్ బాక్స్ అంచు నుండి ఖచ్చితమైన తక్కువ ముగింపుతో గోల్ చేశాడు. క్లిష్టమైన జట్టు ఎత్తుగడను అధిగమించి టర్కీకి 2-1 ఆధిక్యాన్ని అందించాడు. అయితే టర్కిష్ డిఫెండర్ గోల్ లైన్ నుండి క్లియరెన్స్ పొందడంతో స్పెయిన్ ఒయర్జాబల్ ద్వారా స్కోరును సమం చేసింది.

# భారత్‌తో మూడో వన్డేలో దక్షిణాఫ్రికా భారీ స్కోర్



**న్యూఢిల్లీ:** భారత్‌తో మూడో అనధికారిక వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు శతక్కొట్టడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఏకంగా 325 పరుగులు చేసింది. కాగా రెండు అనధికారిక టెస్టులు, మూమూడు వన్డేలు నిమిత్తం దక్షిణాఫ్రికా భారత్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఇరు జట్ల మధ్య రాజ్‌కోట్ వేదికగా బుధవారం నామమాత్రపు మూడో వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌తో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ప్రొటీస్ టీమ్‌ను తొలుత బ్యాటింగ్‌కు అహ్వానించింది. ఓపెనర్లు లువాన్ డ్రి ప్రిటోరియస్, రివాల్డో మూన్‌షామీ చెలరేగారు. ప్రిటోరియస్ 98 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో ఏకంగా 123 పరుగులు చేయగా, మూన్‌సామీ 130 బంతులు ఎదుర్కొన్ని 13 ఫోర్లు, 2 సిక్సర్లు బాది 107 పరుగులు సాధించాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన ఈ ఓపెనింగ్ జోడీని భారత్ పేసర్ ప్రసిద్ కృష్ణ విడదీశాడు. దీంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ నెమ్మదించింది. మిగిలిన వాళ్లంతా పెలివిలియన్‌కు క్యూ కట్టారు. రుబిన్ హెర్మాన్ (11), సినెతెంబ కెషిలె (1), కెప్టెన్ మార్క్వెస్ అకెర్మాన్ (16) పూర్తిగా విఫలం కాగా, డియాన్ ఫక్షరెస్టర్ 20, డిలానో పాట్‌గిటర్ 30 (నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. డిజోర్న్ ఫార్చ్యూన 2 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఫలితంగా దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత్ బౌలర్లలో పేసర్లు ప్రసిద్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, హర్షిత్ రాణా తలా రెండేసి వికెట్లు కూల్చారు.

# దక్షిణాఫ్రికాతో టెస్ట్.. కీలక సమరం

## టీం ఇండియా బి అలర్ట్

### మళ్లీ ఈ 3 తప్పులు చేస్తే సిరీస్ ఖతం





**న్యూఢిల్లీ:** భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ గౌహతిలోని బర్సపర క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. ఈ టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22న ప్రారంభమవుతుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. పర్యాటకులు భారత్‌ను 30 పరుగుల తేడాతో ఓడించారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది. భారత్‌తోజరిగే గౌహతి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా గెలిస్తే, వారు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేస్తారు. భారత్ క్లీన్ స్వీప్‌ను నివారించాలనుకుంటే, గౌహతి టెస్ట్‌లో గతంలో చేసిన ఈ మూడు తప్పులను ఇప్పుడు సరిదిద్దుకుని దాన్నుండి తప్పించుకోవాలి. కోల్‌కతా టెస్ట్‌లో భారత జట్టు నిర్లక్ష్యంగా బ్యాటింగ్‌చేసింది. గౌహతిటెస్ట్‌లో కూడా భారత్ అదే బాటలోనడుస్తే, దానిపరిణామాలను తీవ్రంగా ఎదుర్కోవలసి ఉంటుంది. రెండోటెస్ట్ గెలవాలంటే, గౌహతిలో టీమిం డియా బాధ్యతాయుతంగా, తెలివిగా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. మరోపక్క కొన్ని సంవత్సరాలుగా భారత జట్టు స్పిన్‌తో ఇబ్బందిపడుతోంది. 2024లో న్యూజిలాండ్ భారత్ లో పర్యటించినప్పుడు, వారి స్పిన్నర్లు గణనీయమైన ఇబ్బందులను కలిగించారు. ఇప్పుడు, దక్షిణాఫ్రికా స్పిన్నర్లు కూడా భారతదేశానికి పెద్ద తలనొప్పిగా మారుతున్నారు. భారత పరిస్థితులలో, ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లలో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారు. అందువల్ల, గౌహతిలో స్పిన్‌ను అర్థం చేసుకుని టీమిండియా ఆడాల్సి ఉంటుంది. లేకపోతే, కోల్ కతా టెస్ట్‌లాగా, వారుఇక్కడ కూడా గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఇక గౌహతి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను భారత జట్టు తక్కువ అంచనా వేయాల్సిన అవసరం లేదు. దక్షిణాఫ్రికాలో ఎప్పుడైనా ఆటను మలుపు తిప్పగల సమర్థులైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. కోల్‌కతా టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో టెంబా బావుమా అర్ధశతకం సాధించాడు. దక్షిణాఫ్రికా మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లో అతని 55 పరుగుల ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో జరిగే ఈ మ్యాచ్‌లో ఇవే తప్పులు పునరావృతం కాకుండా చూసుకుంటే భారత్ క్లీన్‌స్వీప్ నుండి తప్పించుకోగలుగుతుంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్.. రౌండ్ 16లో ప్రణయ్, శ్రీకాంత్

### తొలి రౌండ్ మ్యాచ్‌లో తరుణ్, ఆయుష్




**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 లో భారత్ షట్లర్లు దూసుకుపోతున్నారు. హెచ్‌ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ 16వ రౌండ్‌కు చేరుకోగా, యువ ఆటగాళ్లు ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి కూడా వారి వారి మొదటి రౌండ్ మ్యాచ్‌లలో విజయాలు నమోదు చేశారు. బుధవారం ముగ్గురు ఆటగాళ్ళు 16వ రౌండ్‌కు చేరుకున్నారు. అనుభవజ్ఞులైన షట్లర్లు ప్రణయ్, శ్రీకాంత్ తమ తొలి రౌండ్ మ్యాచ్‌లలో చిన్న ప్రత్యర్థులపై మూడు గేమ్‌ల పోరాట విజయాలను నమోదు చేశారు. ప్రణయ్ ఈ మ్యాచ్‌లో అద్భుత ఆరంభాన్ని సాధించాడు. ఇండోనేషియాకు చెందిన యోహానెస్ మార్సెలినో చేతిలో 6-21 తేడాతో నిరాశపరిచే స్కోరుతో మొదటి గేమ్‌ను కోల్పోయాడు. కానీ ఆ తర్వాత, అనుభవజ్ఞుడైన షట్లర్ శక్తివంతమైన పునరాగమనం చేసి, తదుపరి రెండు గేమ్‌లను 21-12, 21-17 తేడాతో గెలిచి, మ్యాచ్‌ను కైవసం చేసుకుని ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ప్రపంచ 20వ ర్యాంక్ క్రీడాకారుడిని చిత్తు చేసిన కిదాంబి దాదాపు నెల రోజుల తర్వాత బిడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లోకి తిరిగి వచ్చి ప్రచారాన్ని అద్భుతంగా ప్రారంభించాడు, ప్రపంచ 20వ ర్యాంకర్, చైనీస్ తైపీకి చెందిన చియా హావో లీని మూడు గేమ్‌లలో 21-19, 10-21, 21-15 తేడాతో ఓడించాడు. అలాగే యువ ఆటగాళ్లు ఆయుష్, తరుణ్ కూడా రౌండ్ ఆఫ్ 16లో తమ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో విజయాన్ని నమోదు చేశారు. మరోవైపు కిరణ్ జార్జ్ ధైర్యంగా పోరాడి, గత వారం ఫైనలిస్ట్ జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటో చేతిలో 21-11, 22-24, 17-21 తేడాతో ఓడిపోయింది. అతడు మొదటి గేమ్‌ను సులభంగా గెలిచి, రెండవ గేమ్‌లో 17-14తో ఆధిక్యంలోకి వచ్చినా, తరువాత వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయి ఆటను వదులుకున్నాడు.

# పడిలేచిన పసిడిధరలు..

## వెండిధరలూ అదే దారి..



**ముంబయి, నవంబరు 19:** బంగారం ధరలు కొనుగోలుదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. ధరలు తగ్గినట్టే తగ్గి మరోసారి భారీగాపెరిగాయి. ముందురోజు మార్కెట్‌లో ధర భారీగా దిగివచ్చిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం మళ్లీ పెరిగింది. డిమాండ్ బలంగా ఉండడంతో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధర పెరిగినట్లుగా ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.1500 పెరిగి తులానికి రూ.1,27,300కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1500 పెరిగి తులానికి రూ.1,26,700కి చేరుకుంది. వెండి ధర సైతం భారీగానే పెరిగింది. రూ.4వేలు పెరిగి కిలోకు రూ.1.60లక్షలకు ఎగిసింది. దాంతో మూడురోజుల తర్వాత ధరలు బులియన్ మార్కెట్‌లో ధరల తగ్గుదలకు బ్రేక్ పడినట్లయ్యింది. యుఎస్ లేబర్ మార్కెట్‌లో బలహీనమైన సంకేతాలు వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ వరుసగా రెండో సెషన్‌లో పెరిగాయి. ఔన్స్‌కు 1.14 శాతం పెరిగి 4,114.01 డాలర్లకు చేరుకుంది. ఔన్సుకు వెండి ధర 3.09 శాతం 52.26 డాలర్లకు పెరిగింది. బుధవారం రాత్రి ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎంసి) అక్టోబర్ సమావేశం వివరాలు వెల్లడికానుండగా పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని దాంతో స్పాట్ గోల్డ్ 4,084 డాలర్ల కంటే ఎక్కువగా ట్రేడ్ అవుతోందని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ రీసెర్చ్, ఏవీపీ విశ్లేషకుడు కైనాత్ చైన్వాలా మాట్లాడుతూ బంగారం కనిష్ట స్థాయి నుంచి కోలుకుని ఔన్సుకు 4,065 కంటే ఎక్కువగా ముగిసిందని తెలిపారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే 24 క్యారెట్ల గోల్డ్ రూ.1,24,860 ఉండగా 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,14,450 పలుకుతున్నది. ఇక కిలో వెండి రూ.1.76లక్షల వద్ద ట్రేడవుతున్నది.

# లాభాల్లోకి మళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, నవంబరు 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు రాణించడంతో మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 84,643.78 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకున్నాయి. ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు బలమైన కొనుగోళ్లతో మార్కెట్లు లాభపడ్డాయి. ఇంట్రాడేలో 84,525.98 కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్ గరిష్ఠంగా 85,236.77 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 142.60 పాయింట్లు పెరిగి 26,052.65 వద్ద స్థిరపడింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.3శాతం పెరగ్గా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పడిపోయింది. నిఫ్టీ బ్యాంక్ వరుసగా మూడవ సెషన్‌లో కొత్తగా 59,264.25 పాయింట్ల వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. 0.54శాతం లాభాలతో 59,216.05 వద్ద ముగిసింది. ఐటీ ఇండెక్స్ 3శాతం, పిఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.2శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ 0.3శాతం, రియాలిటీ ఇండెక్స్ 0.4శాతం తగ్గాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ ఉండగా.. టీఎంపీవీ, కోల్ ఇండియా, మారుతి సుజుకి, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. వెస్ట్రన్ రైల్వేస్ నుంచి ఆర్డర్ సాధించినా జీఆర్ ఇన్ఫ్రాప్రాజెక్ట్స్ షేర్లు 2శాతం పడిపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు బైబ్యాక్ ఆఫర్ కంటే ముందు 4శాతం పెరగ్గా.. హిందూస్తాన్ యూనిలీవర్ షేర్లు దాదాపు 2శాతం వృద్ధిని నమోదు చేశాయి. బయోకాన్ షేర్ ధర 3శాతం తగ్గగా సెబీ హెచ్చరిక లేఖతో నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ షేర్ ధర 1.2శాతం పడిపోగా కెనడా విస్తరణ నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు 4శాతం పెరిగాయి. భారత్ ఫోర్జ్, ఎం అండ్ ఎం ఫైనాన్షియల్, ఎంసిఎక్స్ ఇండియా, హీరో మోటోకార్ప్, ఫెడరల్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎస్‌బీఐ, బీహెచ్‌ఈఎల్ వంటి 120కి పైగా స్టాక్‌లు బీఎస్ఇలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

# పాపులర్‌ప్లాన్ వ్యాలిడిటీ తగ్గించిన బిఎస్ఎన్ఎల్




**న్యూఢిల్లీ, నవంబరు 19:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తన ప్రీపెయిడ్ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఎలాంటి ప్రకటన లేకుండా నిశ్శబ్దంగా తన పాపులర్ ప్లాన్లలో ఒకటైన రూ.107 ప్యాక్ కాలపరిమితిని తగ్గించింది. ప్రైవేట్ టెలికాం సంస్థల బాటలోనే బిఎస్ఎన్ఎల్ కూడా పయనించడంపై కస్టమర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.107 ప్లాన్‌పై గతంలో లభించిన 28 రోజుల వ్యాలిడిటీని ఇప్పుడు 22 రోజులకు కుదించారు. వాస్తవానికి, కొన్నేళ్ల క్రితం వరకు ఇదే ప్లాన్‌కు 35 రోజుల వ్యాలిడిటీ ఉండేది. దశలవారీగా వ్యాలిడిటీని తగ్గిస్తూ రావడంతో, ధర పెంచకపోయినా వినియోగదారులపై పరోక్షంగా భారం మోపినట్లయ్యింది. ప్లాన్ ధరను మార్చకుండా వ్యాలిడిటీని తగ్గించడం కూడా ఒకరకమైన టారిఫ్ పెంపు అవుతుందని టెక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత మార్పు దాదాపు 20 శాతానికి పైగా టారిఫ్ పెంపుతో సమానమని వారు అభిప్రాయపడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలోనూ వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. తక్షణమే పాత వ్యాలిడిటీని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.




# సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం

**ముంబయి, నవంబరు 19:** ప్రముఖ జంతు ఔషధాల తయారీ సంస్థ సీక్వెంట్ సైంటిఫిక్‌లో, బల్క్ డ్రగ్స్, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్ (ఎపిఐ) ఉత్పత్తిలో ప్రత్యేకత కలిగిన వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం అవుతున్నాయి. ఈ విలీన ప్రతిపాదనకు జాతీయ కంపెనీ లా ట్రెబ్యునల్ తన తుది ఆమోదముద్ర వేసింది. ఈ ఆమోదంతో ఏడాది కాలంగా కొనసాగుతున్న విలీన ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లే. ఇకపై రెండు కంపెనీల కార్యకలాపాలను పూర్తిగా ఏకీకృతం చేయడంపై యాజమాన్యం దృష్టి సారించనుంది. సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనాన్ని గతేడాది సెప్టెంబరులో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు సంస్థల యాజమాన్యాలు వ్యాపార కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు కృషి చేస్తున్నాయి. ఈ విలీనం వెనుక స్పష్టమైన వ్యూహాత్మక ప్రణాళిక ఉంది. జంతు ఔషధాల ఫార్ములేషన్లలో సీక్వెంట్ సైంటిఫిక్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది.

మరోవైపు, ఆ ఫార్ములేషన్లకు అవసరమైన కీలక ముడిపదార్థాలైన ఏపీఐలు, బల్క్ డ్రగ్స్‌ను తయారు చేయడంలో వియాష్ లైఫ్‌సైన్సెస్‌కు అపారమైన అనుభవం, ఉత్పత్తి సామర్థం ఉన్నాయి. ఈ రెండు సంస్థలు కలవడం ద్వారా ముడిపదార్థాల నుంచి తుది ఉత్పత్తి వరకు పూర్తి సరఫరా గొలుసు (సప్లై చైన్)పై పట్టు సాధించవచ్చు. ఇది ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, నాణ్యతపై మరింత నియంత్రణకు అవకాశం కల్పిస్తుంది. పరిశోధనఅభివృద్ధి, ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి కీలక విభాగాల్లో ఇప్పటికే కొంతమేర ప్రక్రియను సాధించినట్లు సీక్వెంట్ సైంటిఫిక్ యాజమాన్యం ఇటీవల వెల్లడించింది. ఆదాయాలు, లాభాల పరంగా చూస్తే ఈ విలీనం సంస్థను ఆర్థికంగా మరింత బలోపేతం చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జూలైసెప్టెంబర్) ఆర్థిక ఫలితాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ త్రైమాసికంలో రూ.424 కోట్ల ఏకీకృత టర్నోవర్‌ను నమోదు చేసింది.

పన్నుల తర్వాత నికర లాభం రూ.19.6 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే వియాష్ లైఫ్‌సైన్సెస్ సంస్థ రూ.428 కోట్ల టర్నోవర్‌తో పాటు, రూ.53.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. రెండు సంస్థల ఆర్థిక ఫలితాలను కలిపి చూస్తే, విలీన సంస్థ రెండో త్రైమాసికంలో మొత్తం రూ.852 కోట్ల టర్నోవర్‌ను, రూ.189 కోట్ల ఎబిటా (వడ్డీ, పన్నులు, తరుగుదలకు ముందు ఆదాయం)ను నమోదు చేసింది. ఎబిటా మార్జిన్ 22.2శాతంగా ఉండటం సంస్థ కార్యకలాపాల సామర్థ్యానికి, అధిక లాభదాయకతకు సూచికగా నిలుస్తుంది.

# కృత్రిమ మేధలో గూగుల్ జెమిని3 రిలీజ్!




**కాలిఫోర్నియా, నవంబరు 19:** ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో టెక్ దిగ్గజం గూగుల్ జనరేటివ్ ఎఐ మోడల్, జెమిని3ని మోడల్‌ని లాంచ్ చేసింది. జెమిని 2.5 స్థానంలో భర్తీ చేయనున్నది. ఇదే ఇప్పటి వరకు తమ మోస్ట్ ఇంటలిజెంట్ మోడల్ అని కంపెనీ చెబుతోంది. కంపెనీ ప్రతినిధులు జెమిని 3 అనేక కీలక పరిశ్రమ బెంచ్‌మార్క్‌లను అగ్రస్థానంలో నిలిపిందని, దాని సామర్థ్యాలను నిరూపించాయని చెప్పారు. గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ కంపెనీ మోస్ట్‌టాలెంట్ మోడల్‌గా అభివర్ణించారు. కొత్త ఎఐ మోడల్‌ను సైబర్ దాడుల నుంచి కాపాడేలా రూపొందించినట్లు చెప్పింది. గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో వస్తున్న ఎఐ మోడ్‌తో కొత్త ఎఐ మోడల్‌ను ఇంటిగ్రేట్ చేసినట్లు చెప్పింది. గూగుల్ చీఫ్ ఎఐ ఆర్కిటెక్ట్ వ్లోగ్ మాట్లాడుతూ కంపెనీ ఇప్పుడు గతంలో కంటే వేగంగా మోడల్స్‌ను విడుదల చేస్తుందన్నారు. ఈ సారి గూగుల్ జెమిని3ని తన సెర్చ్ ఇంజిన్‌లో తొలిసారిగా విడుదలతో పాటు ఏకకాలంలో అనుసంధానించినట్లుగా పేర్కొంది. గతంలో అప్‌డేట్ చేసేందుకు వారాలు, నెలలు పట్టేది. ఏఐ మోడ్‌ని ఉపయోగించి గూగుల్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులు జెమిని 3ని వినియోగించుకోవచ్చు. ఈ మోడల్ సంప్రదాయ వెబ్ లింక్స్‌కు బదులుగా సంక్లిష్టమైన ప్రశ్నలకు ఎఐ జెనరేటెడ్ సమాధానాలు ఇస్తుంది. ఇక గూగుల్ కొత్త ఫీచర్స్‌ను తీసుకు వచ్చింది. గూగుల్ జెమిని ఏజెంట్ అనే కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఈమెల్ ఇన్‌బాక్స్ నుంచి టూర్ ప్లాన్ వరకు మల్టి పుల్ టాస్క్‌ల వరకు ఆటోమేటిక్‌గా పనులు పూర్తి చేస్తుంది. అలాగే, గూగుల్ కొత్తగా జెమిని యాప్‌ను పునరుద్ధరించింది. ఇందులో ఎఐ ఇప్పుడు టెక్స్ట్ సమాధానాలు ఇవ్వడంతో పాటు వెబ్‌సైట్‌లాంటి ఇంటర్‌ఫేస్‌లో డిస్‌ప్లే విజువల్, ఇంటరాక్టివ్ ఎలిమింట్స్‌ను ప్రదర్శిస్తుంది. బిజినెస్ యూజర్ల కోసం 'యాంటీగ్రావిటీ' ప్లాట్‌ఫామ్‌ని అభివృద్ధి చేసింది. ఈ ప్లాట్‌ఫామ్ ఎఐ ఏజెంట్లకు వారి సొంత కోడ్‌ను ప్లాన్ చేసుకునే, రాసి ఇచ్చేసామర్థ్యాన్ని ఇస్తుంది. జెమిని 3 డెవలపర్ల కోసం అనేక కొత్త కోడింగ్ ఫీచర్స్‌ను సైతం జోడిస్తుంది.

# చిల్లరకోసం బ్యాంకుముందు క్యూలు కట్టిన ట్రేడర్లు!

**మెహసానా, గుజరాత్, నవంబరు 19:** బ్యాంకుముందు జనం బారులు తీరారు. 2016లో నోట్లరద్దు సందర్భంగా పాత నోట్లను మార్చుకోవడానికి దేశవ్యాప్తంగా బ్యాంకుల ముందు కస్టమర్లు బారులు తీరిన దృశ్యాలను తలపించేలా ఆ బ్యాంకు ముందు జనాలు క్యూకట్టారు. అది గుజరాత్ లోని మెహసానాలో గల అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్. ఇంతకూ ఆ బ్యాంకు దగ్గర జనం చిల్లర కోసమే. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు గుజరాత్ రాష్ట్రం మెహసానాలోని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. స్థానికంగా నెలకొన్న చిల్లర కొరతను తీర్చాలన్నది ఆశిబిరం ఉద్దేశం. ఆ శిబిరంలో బ్యాంకు సిబ్బంది కొత్తగా ముద్రించిన రూ.10 నోట్లు, నాణేలను మార్పిడి చేసింది. పెద్ద కరెన్సీ ఇచ్చి రూ.10, రూ.20 నోట్లు కాయిన్‌లతోపాటు, రూ.5, రూ.2, రూ.1 కాయిన్‌లు తీసుకోవడం కోసం జనం భారీగా తరలివచ్చారు. ఈ ఒక్కరోజు శిబిరంలో బ్యాంకు సిబ్బంది రూ.14 లక్షల విలువైన రూ.10, 20 నోట్లు.. రూ.3 లక్షల విలువైన రూ.1, 2, 5 నాణేలను బ్యాంక్ అధికారులు మార్పిడి చేశారు. ఉదయం పది గంటల మొదలైన ఈ డ్రైవ్ సాయంత్రం వరకు కొనసాగింది. రోజువారీ ఖర్చులకు, వ్యాపార ఖర్చులకు చిల్లర లేదని చిరు వ్యాపారులు, స్థానికులు తమ వద్ద ఉన్న పెద్ద నోట్లు ఇచ్చి చిల్లర తీసుకున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps